Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 02.05.2014, శుక్రవారం
సంపుటి : 33 సంచిక : 48
పేజీలు : 16, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

చట్టసభకి తాళం వేసి, మీడియా ప్రసారాలు నిలిపివేసి
ఒక రాష్ట్రాన్ని అడ్డంగా నరికేసిన ప్రజాస్వామ్య దేశంలో మనల్ని మనమే రక్షించుకుందాం.

నోటుకు నో చెబుదాం... మాటకు ఓటేద్దాం!



# ఓటేద్దాం రండి

మే 7వ తేదీ జరిగే ఎన్నికల్లో అందరం ఓటేద్దాం.
సం/-

• అలసిపోయిన ఫైటర్స్...

# ఇక తేల్చాల్సింది ఓటర్స్



ఇక గట్టిగా కళ్లు మూసుకుంటే నాలుగే నాలుగురోజులు. రాష్ట్ర విభజన అనంతరం సౌభాగ్యవంతమైన హైదరాబాద్ నగరాన్ని కోల్పోయిన సీమాంధ్ర భవిష్యత్‌ను నిర్ణయించే సార్వత్రిక ఎన్నికలు మన ముందుండబోతున్నాయి. రాష్ట్ర విభజన అనంతరం రాజధాని లేని రాష్ట్రంగా ఏర్పడ్డ ఆంధ్రప్రదేశ్‌కు ఈ నెల 7వ తేదీన అన్ని పార్టీలకు ప్రతిష్టాత్మకమైన ఎన్నికలు జరగబోతున్నాయి.

(మిగతా 14వ పేజీలో)






## మోడీని...

# చెడగొడుతున్న చంద్రబాబు

**కూ**సే గాడిదొచ్చి మేసేగాడిదను చెడగొట్టిందంట... అలా వుంది నరేంద్ర మోడీ విషయంలో చంద్రబాబు వ్యవహారం.

నరేంద్రమోడీ ఈరోజు దేశ ప్రధాని పదవికి పోటీ పడుతున్న అభ్యర్థి. ప్రధాని రేస్‌లో ముందు వరుసలో ఉన్న నాయకుడు. ప్రపంచ దేశాలన్నీ మోడీ వైపే ఆసక్తిగా చూస్తున్నాయి. అలాంటి స్థానంలో వున్న నాయకుడి మాటలు, ప్రవర్తన ఎంతో హుందాగా సాగాలి. ముఖ్యంగా ప్రాంతీయపార్టీలపై, వాటి అధినేతలపై వ్యక్తిగత విమర్శలు చేయకూడదు.

చంద్రబాబుతో సావాసదోషమో, ఏమోగాని ఈమధ్య ఓ ఇంటర్వ్యూలో జగన్‌పై నోరుజారారు మోడీ! ఎన్డీఏ అధికారంలోకి వస్తే జగన్ జైలుకు పోవాల్సివుంటుందని చెప్పారు. ఎవరైనా జైలుకు వెళ్లే అంశం చట్టాలు, కోర్టుల పరిధిలో ఉంటుంది. రాజకీయాలలో దోషులు చాలామందే ఉన్నారు. దోషులందరినీ జైలుకు పంపడం ప్రధానమంత్రి పనికాదు. అవి కోర్టులు చూసుకుంటాయి. కాని జగన్ విషయంలో మోడీ చేత అలా మాట్లాడించింది చంద్రబాబే! రేపు కేంద్రంలో ఎన్డీఏకు

(మిగతా 14వ పేజీలో)

## అధినేతలు...

# అవసరం లేదు

### సోనియా, రాహుల్ ప్రచారంపై సీమాంధ్రలో నిరాసక్తి



**కాంగ్రెస్‌పార్టీకి జాతీయ స్థాయిలో స్టార్ క్యాంపెయినర్స్ సోనియాగాంధీ, రాహుల్ గాంధీలు.**

ఎన్నికలలో వారి ప్రచారమే పార్టీకి ఉపయోగపడాలి. సోనియా, రాహుల్‌లు ప్రచారానికి వస్తే ప్రజలలో కొంత మార్పువస్తుందని, తమకు ఓట్లు వస్తాయని అభ్యర్థులు ఆశిస్తుంటారు. ఎన్నికలొస్తే దేశంలోని అన్ని రాష్ట్రాల్లో వీళ్లు

(మిగతా 14వ పేజీలో)



## పవర్ కోసమే...

# పవర్‌స్టార్ ప్రచారం

**ఫై**వ్‌స్టార్ హోటల్లో 'జనసేన' పార్టీని స్థాపించి, అదే స్థాయిలో కార్పొరేట్ రాజకీయాలు చేస్తున్న పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ అసలు లక్ష్యమేంటి? రాజకీయాలలో ఎవరిని టార్గెట్ చేసుకున్నాడు? ఏమి ఆశిస్తున్నాడు? ఆయన మాటలు, చేతలు చూస్తుంటే ఆయన ప్రచారం వెనుక ఏదో మర్మం ఉందనే అనుమానాలు రావడం సహజం.

పవర్‌స్టార్ అసలు లక్ష్యం పవరేనని తెలుస్తుంది. 2009లో ప్రజారాజ్యంపార్టీని పెట్టి దానిని కాంగ్రెస్‌కు అమ్ముకోవడం ద్వారా

(మిగతా 14వ పేజీలో)

ఏం మాయచేసారో గాని..

# తోక ముడిచిన 'బల్లి'



***ఆరునూరైనా పోటీ నుండి తప్పుకునేది లేదని బీరాలు పలికిన గూడూరు ఎమ్మెల్యే బల్లి దుర్గా ప్రసాదరావు పోటీ నుండి తప్పుకున్నారు. కాకపోతే ఆయన నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసాక ఈ నిర్ణయం తీసుకోవడంతో ఈవిఎంలో ఆయన పేరు, ఇండిపెండెంట్ గుర్తు అలాగే ఉండిపోనుంది.***

సిటింగ్ ఎమ్మెల్యే అయిన బల్లి దుర్గాప్రసాద్‌కు ఈ ఎన్నికల్లో టిక్కెట్ నిరాకరించారు. ఆయనకు టిక్కెట్ ఇవ్వకపోవడానికి కారణాలు చూపించలేదు. సిటింగ్ ఎమ్మెల్యే అయినప్పటికి ఆయనపై వ్యతిరేకత లేదు. స్థానికంగా అందుబాటులో ఉంటాడనే పేరుంది. ఆయనను మార్చాలని స్థానిక తెలుగుదేశం నాయకులెవరూ డిమాండ్ చేయలేదు. పార్టీ అధిష్టానాన్ని ఆయన మించిపోయిన సందర్భాలు కూడా లేవు. కాని జిల్లాలోని సిటింగ్ ఎమ్మెల్యేలలో ఆయన ఒక్కడికే టిక్కెట్ ఎగ్గొట్టారు. డాక్టర్ జ్యోత్స్నకు సీటిచ్చారు. దీంతో బల్లి ఇండిపెండెంట్‌గా బరిలో దిగారు. బల్లి అలాగే పోటీలో ఉంటే గ్యారంటీగా తెలుగుదేశం ఓడిపోతుంది. ఒకవేళ బల్లికే పార్టీ సీటిచ్చి ఉంటే గట్టిపోటీ ఉండేది. కాని బల్లి లేకపోవడంతో వైకాపాకు సులభమైంది.

బల్లి పోటీలో వుంటే ఓట్లు చీలుతాయని భావించిన తెలుగుదేశం కోటరీ కంభంపాటి రామ్మోహన్‌రావు, గంగా ప్రసాద్‌లు రంగంలోకి దిగి బల్లికి ఏం చెప్పారో, ఏం ఆఫర్ చేసారోగాని పోటీ నుండి విరమించుకునేలా చేసారు.

# ఆనం వెంట కనిపించని జనం



**జూదం... ఒక మనిషిని ఒక రోజులో లక్షాధికారిని చేయగలదు, కోటీశ్వరుడిని అడుక్కుతినేలా చేయగలదు. రాజకీయం... ఒక మనిషిని అందనంత ఎత్తుకు తీసుకెళ్లగలదు, అదే సమయంలో కూల్చేయనూగలదు.**



ఆనం కుటుంబ రాజకీయాలకు అడ్డా ఏ.సి. సెంటర్. ఆనం వారి కార్యాలయం ఇక్కడే వుంటుంది. తెల్లారాక ఏడు గంటలయ్యింది మొదలు రాత్రి 11గంటల దాకా ఎప్పుడూ జనాలతో కళకళలాడుతుండేది. ఆనం వివేకానందరెడ్డి, ఆనం విజయ కుమార్‌రెడ్డిలు ఈ సెంటర్‌లో ఏదో ఒక సమయంలో ఉంటూ జనాలను కలుసుకుంటుండే వాళ్లు. వివిధ పనుల మీద వచ్చిపోయే వాళ్లతో ఈ సెంటర్ సందడిగా ఉండేది. ఆనం వివేకా కోసం నగర పరిధిలోని జనాలు వివిధ పనులమీద వచ్చేవాళ్లు. నెల్లూరురూరల్ మండలం పరిధిలోని గ్రామాల ప్రజలు, నాయకులు తమ పనుల కోసం ఆనం విజయకుమార్‌రెడ్డి వద్దకు వచ్చేవాళ్లు. ఇక గత ఏడేళ్లుగా అయితే ఆనం రామనారాయణరెడ్డి మంత్రిగా ఉంటున్నారు. వై.యస్., రోశయ్య, కిరణ్... ఈ ముగ్గురి కేబినెట్‌లలో ఆనం మూడురకాల మంత్రి పదవులు నిర్వహించారు. ఆయన మంత్రిగా ఉండడంతో ఏడేళ్లుగా సంతపేటలోని ఆయన ఇళ్లు తిరునాల మాదిరిగా ఉండేది. ఆనం రామనారాయణరెడ్డి నెల్లూరుకు వచ్చాడంటే జనాలు జాతర కొచ్చినట్లు వచ్చేవాళ్లు. 2009లో ఆయన ఆత్మకూరు నుండి పోటీచేసి గెలిచారు. ఈ 5ఏళ్లలో ఎప్పుడు చూసినా ఆయన ఇంటి వద్ద ఆత్మకూరు జనాలే ఎక్కువుగా కనిపించేవాళ్లు.

రాజకీయాలలో ఓడలు బండ్లు, బండ్లు ఓడలు కావడానికి పెద్ద సమయం పట్టదు. రెండునెలల క్రితం వరకు కూడా మంత్రిగా ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యేగా ఆనం వివేకానందరెడ్డిల హవా నడిచింది. కాని రాష్ట్ర విభజన తర్వాత పరిణామాలు వేగంగా మారాయి. సీమాంధ్రలో కాంగ్రెస్‌తో పాటు నెల్లూరు జిల్లాలో ఆనం కోటలు కూడా కూలసాగాయి. మా గుండెలు చీలిస్తే ఆనం బ్రదర్స్ కనిపిస్తారని చొక్కాలు చించుకుని చెప్పిన వాళ్లంతా వాళ్లకు మస్కా కొట్టేసి వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలోకి వెళ్లిపోయారు. నెల్లూరు నగరంలో, రూరల్ నియోజకవర్గంలో, ఆత్మకూరు నియోజకవర్గంలో ఆనం వర్గీయులు చాలావరకు వైకాపా, తెలుగుదేశంలలో చేరిపోయారు. అయితే వీరంతా వెళ్లింది ఆనం సోదరుల మీద కోపంతో కాదు... భవిష్యత్ ఆలోచనలతో. వీళ్లు కాంగ్రెస్‌లో ఉన్నారు. ఇంకో పదేళ్ల దాకా ఇక్కడ కాంగ్రెస్ బ్రతికి బట్టకట్టే పరిస్థితి లేదు. అలాంటప్పుడు వీళ్ల చేతుల్లో పవర్ ఉండదు. కాబట్టి వీరి వెంట ఉండడంకంటే వైకాపా లేదంటే తెలుగుదేశంలలోకి పోవడం మేలనుకున్నారు. ఆ దిశగా తమతమ దారులు చూసుకున్నారు. ఆనంకు అత్యంత విశ్వసనీయ అనుచరులుగా చెప్పుకోబడిన నాయకులు కూడా ఈసారి పార్టీ మార్చారు.

రాజకీయ చరిత్రలో ఆనం కుటుంబానికి ఇంతటి గడ్డు పరిస్థితి ఎప్పుడూ లేదు. నిన్నటివరకు జనం వారి కోసం ఎదురుచూసారు. ఈరోజు జనం కోసం వాళ్లు ఎదురుచూడాల్సిన పరిస్థితి వచ్చింది.

# రిపీట్ 1983

**ముప్ఫైఏళ్ల తర్వాత కాంగ్రెస్ జీరో కానుంది**

***దాదాపు మూడు దశాబ్దాల తర్వాత కాంగ్రెస్‌పార్టీ తన జీవాన్ని, జవసత్వాన్ని కోల్పోతూ కనిపిస్తుంది. ఈ ఎన్నికలు చూస్తుంటే కాంగ్రెస్‌పార్టీకి 1983 ఎన్నికల్లో పట్టిన గతే పడుతుందేమోననిపిస్తుంది. నెల్లూరుజిల్లాలో 1983ఎన్నికల నాటి వాతావరణమే కనిపిస్తుంది.***

1983లో జరిగిన ఎన్నికల్లో ఈ జిల్లా నుండి కాంగ్రెస్‌పార్టీ ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది. ఉదయగిరి నుండి మాత్రం బీజేపీ అభ్యర్థిగా యం.వెంకయ్యనాయుడు గెలవగలిగాడు. మిగతా 10సీట్లు తెలుగుదేశం ఖాతాలోకే చేరాయి. ఆ తర్వాత ఏ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు ఇంతటి గడ్డు పరిస్థితి ఎదురుకాలేదు. 1985ఎన్నికల్లో అయితే జిల్లాలోని 11స్థానాలకు గాను 5సీట్లను గెలిచింది. అంతటి ఎన్టీఆర్ ప్రభంజనంలోనూ కాంగ్రెస్ ఇక్కడ సత్తా చాటుకుంది. 1989లో అయితే నెల్లూరులో ఇండిపెండెంట్ జె.కె.రెడ్డిని కలుపుకుని 11సీట్లను క్లీన్‌స్వీప్ చేసింది. 1994లో మళ్లీ ఎన్టీఆర్ గాలి బలంగా కొట్టింది. అయితే ఆ ఎన్నికల్లో కూడా కావలి సీటులో కాంగ్రెస్ విజయం సాధించగలిగింది. తెలుగుదేశం తిరిగి అధికారంలోకి వచ్చిన 1999ఎన్నికల్లోనూ జిల్లాలో వెంకటగిరి, నెల్లూరు, రాపూరు, ఆత్మకూరు సీట్లలో కాంగ్రెస్ గెలిచింది. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ మళ్ళీ క్లీన్‌స్వీప్. 2009ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్‌కే అధికారం వచ్చినా ఈ జిల్లాలో తెలుగుదేశం కంటే ఒక సీటు తగ్గింది. 1983 తర్వాత 6సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ పూర్తిగా కనుమరుగైపోయింది లేదు. కాని ఈ ఎన్నికల్లో ఆ పార్టీ ఉనికినే కోల్పోబోతుంది. ఎన్నికల్లో గెలవకపోయినా కనీసం ఆ పార్టీ ప్రతిపక్షంగానన్నా ఉండేది. ఈసారి ఆ పొజిషన్‌లో కూడా లేదు. జిల్లాలో ఒకట్రెండు చోట్ల మాత్రమే ఆ పార్టీ రెండోస్థానంలో ఉండబోతుంది. చాలాచోట్ల మూడు, నాలుగు స్థానాలకు వెళ్లబోతుంది. అధికారపార్టీకి ఈ పరిస్థితి రావడం చాలా అరుదు.

# పనిరాక్షసి



సాధారణంగా జాయింట్ కలెక్టర్‌లు, అదనపు ఎస్పీలు పెద్దగా వెలుగులోకి రారు. జేసీ, ఏఎస్పీల స్థాయి అంటే... తమ శాఖల గురించి తెలుసుకోవడానికే వారు ఎక్కువ సమయం కేటాయించాల్సి వుంటుంది. తమకు సంబంధం లేని విషయాలలో అయితే అసలు జోక్యం చేసుకోరు. ఏ జిల్లాలో అయినా జిల్లా ఉన్నతాధికారులుగా కలెక్టర్, ఎస్పీలు ఎక్కువుగా ఫోకస్ అవుతుంటారు. ముఖ్యంగా జాయింట్ కలెక్టర్‌లు అయితే సివిల్ సప్లయిస్, మీసేవ, గ్యాస్ ఏజన్సీలు వంటి కొన్ని అంశాలకే పరిమితమై ఉంటారు.

అయితే ఏ అధికారి అయినా తన చుట్టూ ఒక గిరి గీసుకుంటే అతని పని అంతవరకే పరిమితమవుతుంది. కాని తన పనికి పరిమితి అనేది విధించుకోకపోతే ఆ అధికారికి పనిలో క్షణం తీరిక కూడా ఉండదు.

జిల్లా జాయింట్ కలెక్టర్ రేఖారాణి పనిరాక్షసిగా పేరు తెచ్చుకుంది. పనితీరులో ఆమె చిరుత వేగాన్ని తలపిస్తుంది. పట్టుదలతో పని చేయడం, అనుకున్న టైంకు అనుకున్న పనిని అంకితభావంతో పూర్తి చేయడం ఆమె సహజగుణంగా చెప్పుకోవచ్చు. జాయింట్‌కలెక్టర్‌గా కేవలం కొన్ని అంశాలకే పరిమితం కాకుండా తాను పనిచేయగలిగిన అన్ని అంశాలలోనూ జొరపడుతుంది. ప్రభుత్వశాఖల్లో క్రింది స్థాయి అధికారులను, సిబ్బందిని ఒళ్లు వంచి పనిచేసేలా చేస్తుంది. ముఖ్యంగా జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా శాంతియుతంగా నిర్వహించడానికి, ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచడానికి ఆమె ప్రత్యేక శ్రద్ధతో చేపట్టిన కార్యక్రమాలు ప్రజల ప్రశంసలందుకుంటున్నాయి.

ఉన్నతాధికారిగానే కాదు సామాజిక స్పృహ వున్న మానవతా వాదిగా కూడా ఆమె అభినందనీయురాలు. ఇటీవల హైదరాబాద్‌లో ఓ మార్వాడీ కుటుంబంలో భారీఎత్తున వివాహ వేడుక జరిగింది. కోట్ల రూపాయలు ఖర్చు చేసారు. అయితే అంతకుముందే రేఖారాణి ఆ కుటుంబసభ్యులతో మాట్లాడి అదే వివాహ వేదికపైన నాలుగు వికలాంగుల జంటలకు వివాహాలు జరిపించి తన మానవతా వాదాన్ని, సేవా దృక్పథాన్ని చాటుకున్నారు.

పది మందికి మంచి చేయాలనే తపన ఆమెలో వుంది. ఆ తపనతోనే ఆమె పనిరాక్షసిగా పరుగులు తీస్తుంది.

## ఆప్కాబ్ సబ్‌కమిటీలో ధనుంజయరెడ్డి



రాష్ట్ర విభజన నేపథ్యంలో ఆప్కాబ్‌ను రెండు రాష్ట్రాలలోనూ ఏర్పాటు చేయనున్నారు. ఆప్కాబ్ ఆస్తులను రెండు రాష్ట్రాలకు పంపిణీ చేయడానికి ఆప్కాబ్ ఛైర్మెన్ వీరారెడ్డి అధ్యక్షత ఏర్పాటు చేసిన సబ్ కమిటీలో నెల్లూరుజిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయ రెడ్డిని సభ్యులుగా నియమించారు. ఏప్రిల్ 26వ తేదీ హైదరాబాద్‌లో జరిగిన ఆప్కాబ్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ కమిటీలో ఆయనతో పాటు ఏలూరు, కడప, నల్గొండ, మెదక్ జిల్లాల కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్‌లు కూడా సభ్యులుగా ఉంటారు.

# అభివృద్ధి కోసం ఓటేయండి

## - వెంకయ్యనాయుడు



దేశ సమగ్రాభివృద్ధి కోసం, సీమాంధ్రను ఒక మంచి రాష్ట్రంగా మలచుకోవడం కోసం తెలుగుదేశం, బీజేపీ పార్టీలకు ఓట్లేసి గెలిపించాలని బీజేపీ జాతీయ నాయకులు యం.వెంకయ్యనాయుడు కోరారు.

సోమవారం వెంకటగిరిలో నిర్వహించిన ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. తిరుపతి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి కారుమంచి జయరాం, వెంకటగిరి అసెంబ్లీ తెలుగుదేశం అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణలను గెలిపించాలని ఆయన కోరారు. లక్షల కోట్ల కుంభకోణాలకు కారణమైన కాంగ్రెస్‌పార్టీని దేశ సరిహద్దులు దాటేలా తరిమికొట్టాలన్నారు. ఈసారి సీమాంధ్రలో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆయన పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా నరేంద్ర మోడీ గాలి వీస్తుందని, ఈ గాలిలో కాంగ్రెస్ కొట్టుకుపోవడం ఖాయమన్నారు. కేంద్రంలో ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన వెంటనే మూడుజిల్లాలో మెట్టప్రాంతాలకు ఉపయోగపడే నడికుడి–వెంకటగిరి రైల్వేలైన్‌ను పూర్తి చేస్తామన్నారు. అలాగే మన్నవరం 'భెల్' ప్రాజెక్ట్‌ను కూడా పూర్తి చేయిస్తామని చెప్పారు. కుంభకోణాలు చేయడంలో నేలను మొదలుకొని నింగి వరకు కాంగ్రెస్ నాయకులు దేనిని వదల్లేదన్నారు. యాభైఏళ్ల పాలనలో ముస్లింలకు కాంగ్రెస్ చేసిందేమీ లేదని, వారింకా వెనుకబడిన వారుగానే ఉన్నారని అన్నారు. నరేంద్ర మోడీ పాలనలోని గుజరాత్‌లో ముస్లింలు అభివృద్ధి ఫలాలను అందుకుంటూ అన్ని రంగాలలో ముందడుగు వేస్తున్నారని చెప్పారు.

గత ఎన్డీఏ ప్రభుత్వంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, అభివృద్ధి కావాలంటే ఎన్డీఏ, అవినీతి కావాలంటే యూపిఏ అన్నట్లుగా పరిస్థితి మారిందన్నారు. బీజేపీ ఒక్కటే దేశంలో 250సీట్లను గెలుస్తుందని మిత్రపక్షాలు 50సీట్లను గెలుచుకుంటాయని, 300సీట్లతో కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటు కానుందని ఆయన జోస్యం చెప్పారు.

# పెద్దాయనకి
# మా నివాళి



మంచికి ప్రతిరూపం
మానవత్వానికి మరో రూపం
**మా పెద్దాయన...**

మమ్ము వెన్నుతట్టి నడిపించి
కష్టసుఖాలలో మాకు తోడుగా నిలిచి
అన్ని వేళలా మమ్మల్ని ప్రోత్సహించి
మాపై ప్రేమానురాగాలను కురిపించిన
మనసున్న మారాజు
**మా పెద్దాయన...**

మాకు మార్గదర్శకులు
మాకు స్ఫూర్తిప్రదాతలు
మా అభివృద్ధికి కారకులు
**మా పెద్దాయన...**

సి.పి.ఆర్. కల్యాణ మండపం అధినేత
## చెరకుపల్లి పిచ్చిరెడ్డి గారి
ఆత్మశాంతికి ప్రార్థిస్తూ...
నివాళులర్పిస్తున్నాం.

మా మనసుల్లో చిరకాలం జీవించే మా పెద్దాయన మళ్ళీ మాకు పెద్దదిక్కుగా జన్మించాలని కోరుకుంటూ...

**షేక్ రియాజ్ భాషా**
రియాజ్ హైదరాబాద్ లైటింగ్ హౌస్ & హైరర్స్
మాగుంట లే అవుట్, నెల్లూరు.

**పి.శ్రీనివాసులు (పూలశీనయ్య)**
శ్రీ గౌరిశంకర్ ఫ్లవర్ డెకరేషన్స్
మూలాపేట, నెల్లూరు.




## అవకాశవాదులు

రాజకీయనాయకులు పదవుల కోసం పార్టీలు మారుస్తుంటారు. ఇప్పుడు గ్రామస్థాయి నాయకులు వారిని మించిపోయారు. అవకాశ వాద రాజకీయాలను బాగా వంట బట్టించుకున్నారు. ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనుకుంటే ఆ పార్టీలోకి వలస పోతున్నారు. రాజకీయాలు మరీ నీచంగా తయారయ్యాయి. విలువలు లేకుండా పోయాయి.

పులిచేటి కృష్ణమోహన్,
వరదయ్యపాళెం.

## వై.వి.కి న్యాయం జరిగింది

వైసిపి సీనియర్ నాయకులు వై.వి.సుబ్బారెడ్డికి ఒంగోలు లోక్‌సభ సీటు కేటాయించడం సముచితం. వై.యస్. చనిపోయాక సొంత చిన్నాన్నే దూరమైనా వై.వి.సుబ్బారెడ్డి మాత్రం అన్ని విషయాలలో జగన్‌కు చేదోడు వాదోడుగా నిలిచారు. జగన్ జైలులో ఉన్నప్పుడు పార్టీలో కార్యకర్తలకు దిశానిర్దేశం చేసారు. వై.యస్. ద్వారా లబ్ది పొందిన వారంతా జగన్‌ను విడిచి పెట్టినప్పటికి వై.వి.సుబ్బారెడ్డి జగన్ వెంట వుండి తన విశ్వసనీయత చాటుకున్నారు.

*బి.ఆర్.శాలి,* కావలి.

## బీజేపీతో టీడీపీకి లాభం

సుప్రీంకోర్టు పుణ్యమా అని అన్ని రకాల ఎన్నికలు మన రాష్ట్రంలో జరుగుతున్నాయి. ప్రజలకు ఇంకో అయిదేళ్ల దాకా ఎన్నికల పనే లేదు. బీజేపీతో కలయికతో తెలుగుదేశానికి ఎంతో ఉపశమనం కలుగుతుంది. ముస్లింలు, క్రిస్టియన్‌లు మాత్రం ఖచ్చితంగా ఫ్యాన్‌కు గుద్దేస్తారు. బీజేపీతో పొత్తు కుదరకుంటే తెలుగుదేశం ఎంతో నష్టపోయేది. నెల్లూరుజిల్లాలో చూస్తే ఫ్యాన్ గాలికే మొగ్గు కనిపిస్తుంది.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

## మధ్యతర'గతి' ఏంటి?

రాష్ట్రంలో ఏ ప్రభుత్వం వచ్చినా పేదవారికి, ఉన్నవారికి మాత్రమే లాభం చేకూరుస్తున్నాయి. వారికి అందించే ఫలాలకు బలయ్యేది మధ్య తరగతి ప్రజలే. వారిని పట్టించుకునే ప్రభుత్వం రావాలి.

లక్ష్మీకృష్ణ, నెల్లూరు.

# 'ప్రభా'తం

కూటి కోసం కోటి విద్యలంటారు. రాజకీయ నాయకులైతే ఓట్ల కోసం కోట్ల విద్యలు ప్రదర్శిస్తుంటారు. కోట్లాది రూపాయలను ఉచితంగా ఇస్తామంటున్నారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో ప్రజలను ఊదరగొట్టేస్తున్నారు. ప్రజలను పనికిమాలిన వాళ్లుగా, పనిలేని వాళ్లుగా చేసి, వారికి మేమే పనికల్పిస్తామంటారు. భారత రాజకీయాలు ఎంత చెత్తగా ఎంత నికృష్టంగా తయారవుతున్నాయంటే... ప్రజలారా, మీరు కష్టపడి పనులు చేయనవసరం లేదు, మీ స్వేదాన్ని ఖర్చు కానీయొద్దు... మీరెందుకు కష్టపడాలి, మీరు మాకు ఓటేయండి చాలు... మీకు ఆహార ధాన్యాలు ఉచితంగా ఇస్తాం, కూరగాయలు, పండ్లు, పాలు అన్నీ ఫ్రీనే, మీ ఇంటికి కరెంట్, మీ ఒంటికి బట్టలు, ఇంట్లోకి ఏ.సి అన్నీ ఫ్రీ అనే చెబుతారు. ఆల్‌ఫ్రీ వాగ్దానాలు నమ్మి జనం ఓట్లేసారా... జీవితాంతం ఇక బానిసలే!

అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్, జర్మనీ, చైనా, జపాన్ వంటి అభివృద్ధి చెందిన అగ్రదేశాలున్నాయి కదా... వాటిని అభివృద్ధి పరంగా వెనక్కితోసేయాలంటే ఒకే ఒక మార్గముంది. మన దేశంలో ఉన్న రాజకీయనాయకులను అక్కడకు పంపించాలి. వారి చేత అక్కడ పార్టీలు పెట్టించాలి. అప్పుడు మన రాజకీయ నాయకులు ఆల్‌ఫ్రీ వాగ్దానాలతో ముందు అక్కడ జనాన్ని చెడగొడతారు, పనిచేయకుండా సోమరిపోతులుగా మార్చేస్తారు. ఆ తర్వాత ఆటోమేటిక్‌గా ఆ దేశం కూడా భ్రష్టు పట్టిపోతుంది.

## కోట్ల వరాలు ఓట్ల కోసమే!



***ప్రజలు ఈరోజు కోరుకోవాల్సింది సబ్సిడీలు, ఋణ మాఫీలు, ఉచితంగా వచ్చే కలర్‌టీవీలు కాదు, వాటిని మార్కెట్‌లో కొనుగోలు చేసే స్వయం ఆర్థికశక్తి తమకు రావాలని. మంచి ఆలోచన, సమాజం పట్ల అవగాహన, ముందుచూపున్న ప్రభుత్వాలతోనే ఇది సాధ్యమవుతుంది.***

ఇప్పటికే మనకున్న రాజకీయ విధానాల మూలంగా ప్రజలు దారి తప్పుతున్నారు. డబ్బు తీసుకుని ఓట్లేసే విష సంస్కృతి విచ్చలవిడిగా పెరిగిపోతుంది. నాయకుడు తమ వద్ద కొంటున్న ఓటుతో వ్యాపారం చేస్తున్నాడనే విషయం జనం తెలుసుకోలేకపోతున్నారు. ఓటుకు నోటు తీసుకుంటూ సమస్యలపై ప్రజాప్రతినిధులను ప్రశ్నించే అర్హతను కోల్పోతున్నారు. ఎన్నికల్లో డబ్బు, మద్యమే కాకుండా ఆయా పార్టీలిచ్చే ఆల్‌ఫ్రీ హామీల కోసం ప్రజలు ఎదురుచూస్తుండడం పరిపాటిగా మారింది.

ఒక దేశమైనా, రాష్ట్రమైనా వాస్తవిక అభివృద్ధి సాధించాలంటే మౌళిక రంగాలకు పెద్దపీట వేయాలి. ప్రతి ఒక్కరికీ విద్య, వైద్యాన్ని అందుబాటులోకి తేవాలి, ఉపాధి అవకాశాలు పెంచాలి, వ్యవసాయ విస్తీర్ణతను, ఉత్పత్తిని పెంచాలి, పారిశ్రామికీకరణకు పెద్దపీట వేయాలి. మహిళల స్వయం ఆర్థిక సమృద్ధికి చేయూతనివ్వాలి. విద్యుత్ ఉత్పాదన పెంచాలి. అదేక్రమంలో జనాభాను తగ్గించుకుంటూ ఉన్న వనరులను సద్వినియోగపరుచుకోవాలి. అన్ని ప్రాంతాలను అనుసంధానిస్తూ చక్కని రహదారుల నిర్మాణం, రైల్వేలైన్లు పెంచడం చేయాలి. కమ్యూనికేషన్ వ్యవస్థను అభివృద్ధి పరచాలి. నగరాలు, పట్టణాలలో వలసలను అరికట్టడానికి గ్రామాలలో విద్య, వైద్య సదుపాయాలు పెంపొందించాలి. రాజకీయపార్టీలు, రాజకీయనాయకులు వాస్తవిక అభివృద్ధి కోసం దృష్టి పెట్టాల్సిన అంశాలివి. అధికారంలోకి వచ్చిన పార్టీలు చేయాల్సిన పనులు కూడా ఇవే!

కాని ఇప్పుడు ఈ అంశాల ఆధారంగా పార్టీలు హామీలివ్వడం లేదు. జనం మైండ్‌సెట్‌ను బట్టే రాజకీయపార్టీల హామీలు, మేనిఫెస్టోలు తయారవుతున్నాయి. జనం నా దేశం కంటే నా రాష్ట్రం, నా రాష్ట్రం కంటే నా జిల్లా, నా జిల్లా కంటే నా ఊరు, నా ఊరు కంటే నాకేం వచ్చిందనే స్వార్థ సంకుచిత కోణంలో ఆలోచిస్తున్నారు. మీ ఊర్లో రోడ్డు వేసాం, స్కూల్ కట్టించాం అంటే... అవేమన్నా నా ఒక్కడి కోసమే చేసారా అంటున్నారు. జనం నాడిని పసిగట్టిన పార్టీలు ప్రతిఒక్కరికీ వ్యక్తిగత లబ్ది చేకూర్చే విధంగా వాగ్దానాల వరాలు కురిపిస్తున్నాయి.

ఋణమాఫీ, పింఛన్‌లు, ఉచిత కరెంట్, వడ్డీలేని ఋణాలు, సబ్సిడీ పథకాలు... వివిధ వర్గాలకు రిజర్వేషన్లు, ఉచిత టీవీలు, కంప్యూటర్లు... ప్రతి ఎన్నికలలోనూ ఇవి ప్రధాన హామీలైపోతున్నాయి. ఈ ఉచిత పథకాలనేవి ఆర్థిక వ్యవస్థకు పెనుభారం తప్పితే ఇంకోటి కాదు. జనాలు కూడా ఆలోచన చెయ్యాలి. ఏ నాయకుడన్నా ఉచిత హామీలిస్తున్నాడంటే... ఆయన ఆస్తులు అమ్మి జనానికి పెట్టేదేమీ ఉండదు. ప్రజల డబ్బును ప్రజలకు ఫ్రీగా ఇవ్వడమే. ఇలా ఉచిత పథకాలు, సబ్సిడీ కార్యక్రమాలు ఏళ్ల తరబడి సాగాయంటే ఏ దేశంలోనైనా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలడం ఖాయం. ప్రజలు ఈరోజు కోరుకోవాల్సింది సబ్సిడీలు, ఋణ మాఫీలు, ఉచితంగా వచ్చే కలర్‌టీవీలు కాదు, వాటిని మార్కెట్‌లో కొనుగోలు చేసే స్వయం ఆర్థికశక్తి తమకు రావాలని. మంచి ఆలోచన, సమాజం పట్ల అవగాహన, ముందుచూపున్న ప్రభుత్వాలతోనే ఇది సాధ్యమవుతుంది. చైనా ఈరోజు మనకంటే అభివృద్ధిలో ఎంతో ముందుందంటే కారణం అక్కడ నూటికి 90మంది పనిచేస్తారు. అక్కడ మనలాగా చెత్తరాజకీయాలు లేవు. ప్రభుత్వం అందరిచేత పనిచేయిస్తుంది. కాని ఇక్కడ ఆ సంస్కృతి లేదు. నూటికి 90మంది కాకున్నా, 60మంది చేత పనిచేయించే అవకాశమున్నా సంకుచిత రాజకీయాలు వారిలో సగం మందిని సోమరిపోతులుగా చేస్తున్నాయి. ఇవే రాజకీయాలు కొనసాగితే ఇంకో 50ఏళ్ల తర్వాత కూడా మనది అభివృద్ధి చెందుతూ.... వున్న దేశంగానే మిగిలిపోతుంది.

# 'అంతర్'జాతీయం

- తన గగన తలాన్ని శత్రు క్షిపణుల నుండి రక్షించే దిశగా భారత్ ముందడుగు వేసింది. ఏప్రిల్ 27వ తేదీన ఒడిసాలోని బాలాసోర్‌కు 100కిలోమీటర్ల దూరంలో వీలర్‌ఐలాండ్ నుండి పృథ్వి డిఫెన్స్ ఐపికల్ అస్త్రాన్ని విజయవంతంగా ప్రయోగించింది. భారత్‌కు ఇరుగుపొరుగు దేశాల నుండి క్షిపణుల ముప్పు ఉన్న నేపథ్యంలో రెండంచల క్షిపణి రక్షణ కవచం రూపకల్పనకు డిఆర్‌డిఓ నడుంకట్టింది.
- గతంలో పోప్‌లుగా పనిచేసిన జాన్-23కి, జాన్‌పాల్-2కు అత్యంత పవిత్రమైన సెయింట్ హోదా లభించింది. ఏప్రిల్ 27వ తేదీన సెయింట్ పీటర్ స్క్వేర్‌లో అత్యంత భారీగా హాజరైన జనసందోహం మధ్య వారిద్దరికీ సెయింట్ హోదా కల్పిస్తున్నట్లు పోప్ ఫ్రాన్సిస్ ప్రకటన చేసారు.
- టైటానిక్ ప్రమాదం నుండి బయటపడిన ఇద్దరు వ్యక్తులు వ్రాసిన లేఖ 1.20కోట్లకు అమ్ముడుపోయింది. 1912లో నౌక ప్రమాదానికి గురికాక ముందు అద్భుత ప్రయాణంగా వర్ణిస్తూ వ్రాసిన లేఖను వేలం వేసారు.
- భారతదేశంలో వున్న ఏకైక గొరిల్లా 'పోలో' ఏప్రిల్ 26వ తేదీ మైసూరు జూలో మరణించింది. 1995లో ఐర్లాండ్‌లోని జూ నుండి దీనిని ఇండియాకు తీసుకొచ్చారు. వృద్ధాప్యం, మానసిక సమస్యలతో అది మరణించినట్లు జూ అధికారులు వెల్లడించారు.
- కొత్తగా ఏర్పడబోయే కేంద్రప్రభుత్వంలో ప్రవాస భారతీయుల మంత్రిత్వశాఖను ఎన్‌ఆర్‌ఐకే ఇవ్వాలని భారత్-అమెరికా సంస్థ విజ్ఞప్తి చేసింది.
- ఛార్‌ధామ్ యాత్రకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి హరీష్‌రావత్ ప్రకటించారు.
- దేశీయంగా రూపొందించిన ఆకాశ్ క్షిపణిని ఒడిసాలోని చాందీపూర్‌లో వున్న ఇంటిగ్రేటెడ్ టెస్ట్‌రేంజ్ నుండి విజయవంతంగా ఇటీవల ప్రయోగించారు. ఇది యుద్ధవిమానాలు, క్రూయిజ్ క్షిపణులు, గగనతలం నుండి నేలమీదకు ప్రయోగించే క్షిపణులను నాశనం చేయగలదు.
- ఈజిప్టులో ముస్లింబ్రదర్‌హుడ్ సంస్థ అధిపతి మహమ్మద్ మోర్సీ, ఆయనకు సంబంధించిన 682మంది ఇస్లామిక్ మద్దతుదారులకు ఈజిప్టు కోర్టు మరణశిక్ష విధించింది. గత ఏడాది ఆగస్టు14న దక్షిణ మిన్యా ప్రావిన్సులో జరిగిన హత్యలు, పోలీసులపై హత్యాయత్నాలకు సంబంధించి దోషులపై అభియోగాలు మోపారు. ఆరోజున పదవీచ్యుత అధ్యక్షుడు మహ్మద్‌మోర్సీకి మద్దతుగా వీరు హింసాకాండ నిర్వహించారు.
- దక్షిణ మధ్య అమెరికాలో ఏప్రిల్ 27వ తేదీ విరుచుకుపడిన టోర్నాడోలతో 15మంది చనిపోయారు. భారీగా ఆస్థినష్టం సంభవించింది.

# వార్త వ్యాఖ్య

వార్త :- జగన్ అవినీతి నిపుణుడు. – బాలకృష్ణ.
**వ్యాఖ్య :- *మీక్కూడా దేంట్లోనో నైపుణ్యమున్నట్లుందే!***

వార్త :- చిన్న రాష్ట్రానికి సీఎంగా వద్దనే పోటీ నుండి తప్పుకున్నా. – కిరణ్.
**వ్యాఖ్య :- *పెద్ద రాష్ట్రానికే సీఎంగా ఉండాలనుకుంటే యూపికి పోండి.***

వార్త :- పదిరోజుల్లో తెదేపా ప్రభుత్వం. – నారా రోహిత్.
**వ్యాఖ్య :- *ఇదేమన్నా సినిమా అనుకుంటున్నారా?***

వార్త :- బీసీల్ని తిడితే తాటతీస్తా. – కేసీఆర్‌పై నిప్పులు చెరిగిన పవన్.
**వ్యాఖ్య :- *మిమ్మల్ని తప్పితే ఇంకెవరిని తిట్టినా ఒప్పుకునేటట్లు లేరు.***

వార్త :- దేశాన్ని దేవుడే కాపాడాలి. – సోనియా.
**వ్యాఖ్య :- *అవును... కాంగ్రెస్ నుండి కాపాడాలంటే దేవుడికే సాధ్యం.***

వార్త :- బాలకృష్ణను విమర్శించే అర్హత షర్మిలకు లేదు. – టీడీపీ ప్రధాన కార్యదర్శి అనూరాధ.
**వ్యాఖ్య :- *దానికేమన్నా డిగ్రీలు చదవాలా?***

వార్త :- మోడీ ప్రధాని అయితే నాశనమే. – కేంద్రమంత్రి ఆజాద్.
**వ్యాఖ్య :- *కాంగ్రెస్‌పార్టీనా?***

వార్త :- సీమాంధ్రను సింగపూర్‌గా చేయడం చంద్రబాబుకే సాధ్యం. – నారా లోకేష్.
**వ్యాఖ్య :- *అధికారంలోకొస్తే సీమాంధ్రకు సింగపూర్ అని పేరు మార్చేటట్లున్నారే!***

వార్త :- చిరంజీవి కాంగ్రెస్‌కు సంజీవని. – పద్మరాజు.
**వ్యాఖ్య :- *ఎవరు ఎవరికి సంజీవనో ఎన్నికల తర్వాత తెలుస్తుంది.***

వార్త :- రెచ్చగొట్టే విషయంలో కిరణ్, కేసీఆర్‌లు ఒకటే. – దాసరి జైరాంరమేష్.
**వ్యాఖ్య :- *కిరణ్‌కు అంత సీనే వుంటే రాష్ట్రం విడిపోయేదా?***

వార్త :- 16నెలలు జైల్లో ఉన్న జగన్‌కు ఓటేస్తారా? – మేధాపాట్కర్.
**వ్యాఖ్య :- *ఈ లెక్కన చూస్తే ఎవరికీ ఓటేయబల్లేదు.***

వార్త :- జగన్‌ది ఆత్మరక్షణపోరు... బాబుది ఆఖరిపోరు. – చిరంజీవి.
**వ్యాఖ్య :- *తమది అధికార పోరు.***

వార్త :- జగన్ మోడీని విమర్శించరేం. – సీపీఎం నేత మధు.
**వ్యాఖ్య :- *ఆయన్ను ఈయన తిట్టకుంటే మీకొచ్చిన బాధేంటో?***

# ఒంగోలు గెలుపుగిత్త వై.వి.నే!

***ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన ఒంగోలు గిత్తలకు, చీమకుర్తి గెలాక్సీకి పేరొందిన ప్రకాశంజిల్లాలో ఈసారి ఎన్నికలు ఒక ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.***

ఈ జిల్లాలో ఒంగోలు లోక్‌సభ పోటీకి మరింత ప్రాధాన్యత ఏర్పడింది. దీనికి ప్రధానకారణం వైయస్సార్ కాంగ్రెస్ అధ్యక్షుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి చిన్నాన యల్లం వెంకటసుబ్బారెడ్డి ఇక్కడ నుండి వైకాపా అభ్యర్థిగా పోటీ చేస్తుండడమే. వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ స్థాపనలోనూ, ఆ తర్వాత పార్టీని నడపడంలోనూ వై.వి. సుబ్బారెడ్డి కీలకపాత్ర పోషించారు. కాంగ్రెస్ నుండి జగన్ బయటకొచ్చేటప్పుడు సొంత చిన్నాన పెదముఖం చూపినా వై.వి.సుబ్బారెడ్డి జగన్ వెంట నడిచాడు. జగన్ విషయంలోనే కాదు, వై.యస్.రాజశేఖరరెడ్డి ఉన్నప్పుడు కూడా వై.వి.సుబ్బారెడ్డి ఎంతో నమ్మకంగా పనిచేసారు. తన తోడల్లుడు వై.యస్. కోసం వై.వి.సుబ్బారెడ్డి తన ఆస్తులను కూడా పణంగా పెట్టాడు. వై.యస్. సిఎంగా ఉన్నప్పుడు వై.వి.సుబ్బారెడ్డి పార్టీ సీట్లను గాని, పదవులను గాని ఆశించకుండా నిస్వార్థంగా పనిచేసారు. వై.యస్. మరణించాక జగన్‌కు పెద్దదిక్కుగా నిలిచారు. జగన్ పార్టీని స్థాపించడంలోనూ, పార్టీలోకి కేడర్‌ను సమీకరించడంలోనూ వై.వి.సుబ్బారెడ్డి విశేషకృషి చేసారు. జగన్ జైలులో వున్న 16నెలల్లో కూడా వై.వి. సుబ్బారెడ్డి కార్యకర్తలకు ఆ లోటు తెలియనీయకుండా కేడర్‌ను లీడర్లను సమన్వయ పరచుకుంటూ వచ్చారు.

ఈరోజు రాష్ట్రంలో జగన్ గాలి తోలుతుంది. వైకాపా సీటు తెచ్చుకుంటే చాలు, గెలుపు గ్యారంటీ అన్న పరిస్థితి ఉంది. ఇలాంటి తరుణంలో కూడా తాను పోటీ చేయాలా... వద్ద అనే విషయాన్ని వై.వి.సుబ్బారెడ్డి, జగన్‌కే వదిలేసాడు. అయితే తనకు కష్టకాలంలో పెద్ద దిక్కులా వ్యవహరించిన వై.వి.సుబ్బారెడ్డిని లోక్‌సభకు పంపాలనే లక్ష్యంతో జగన్ ఆయనను ఒంగోలు లోక్‌సభ బరిలో నిలిపాడు.

కడప జిల్లా తర్వాత వైకాపా జోరుగా వున్న జిల్లా ప్రకాశం. ఇక తెలుగుదేశం అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులురెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా దర్శి పవన్‌కుమార్‌లు రంగంలో ఉన్నారు. ఒంగోలు లోక్‌సభ



పరిధిలో ఒంగోలు టౌన్, కొండెపి, గిద్దలూరు, మార్కాపురం, యర్రగొండపాలెం, కనిగిరి, దర్శి అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. 2009లో నియోజకవర్గాల పునర్విభజనకు ముందు నెల్లూరుజిల్లాలోని కావలి, ఉదయగిరి అసెంబ్లీలు ఒంగోలు లోక్‌సభ పరిధిలోనే వుండేది. పునర్విభజన తర్వాత ప్రకాశం జిల్లాలోని 7అసెంబ్లీలే ఈ లోక్‌సభలో ఉన్నాయి.

దాదాపు 3దశాబ్దాల కాలంగా ఈ పార్లమెంటుపై నెల్లూరీయుల పెత్తనమే సాగుతూ వస్తుంది. 1984లో బెజవాడ పాపిరెడ్డి, 1989లో మేకపాటి రాజమోహన్‌రెడ్డి, 1992లో మాగుంట సుబ్బరామరెడ్డి, 1996లో మాగుంట పార్వతమ్మ, 1998, 2004, 2009లలో మాగుంట శ్రీనివాసులురెడ్డిలు ఎంపీలుగా విజయం సాధించారు. 1999లో మాత్రం వాజ్‌పేయి గాలిలో ప్రకాశంజిల్లాకు చెందిన కరణం బలరాం గెలిచారు.

ప్రస్తుత ఎన్నికల్లో స్థానికుడైన వై.వి. సుబ్బారెడ్డి వైకాపా అభ్యర్థిగా ఉన్నారు. స్థానికుడిగా, వివాదరహితుడిగా పేరుంది. అందరితో కలిసిపోయే తత్వం వున్న మనిషి. ఇక వైయస్ సానుభూతి ప్రజలలో బలంగా వుంది. లోక్‌సభ పరిధిలోని 7సెగ్మెంట్లలో కూడా వైకాపా అభ్యర్థులు గెలిచే సూచనలున్నాయి. ఇక్కడ నుండి వై.వి.సుబ్బారెడ్డి భారీ మెజార్టీతోనే గెలుస్తాడనే అంచనాలున్నాయి.

కాంగ్రెస్ నుండి జంప్ చేసి వచ్చిన మాగుంట శ్రీనివాసులురెడ్డిని తెలుగుదేశం అభ్యర్థిగా ప్రజలు అంగీకరించే పరిస్థితి లేదు. 1992నుండి మాగుంట కుటుంబం కాంగ్రెస్‌కు అలవాటు పడింది. ఈరోజు శీనయ్య పార్టీ మారినంత సులభంగా ప్రజలు మారలేరు. అదీగాక సిటింగ్ ఎంపీగా ఆయన పట్ల వ్యతిరేకత కూడా బలంగానే వుంది. కాంగ్రెస్ నామమాత్రపు పోటీలో వుంది.

ఇక్కడ నూటికి నూరుపాళ్లు విజేత వై.వి.సుబ్బారెడ్డే!

## మోటారు వల్లే ఇంత జరిగింది



ఏప్రిల్ 24వ తేదీన మనుబోలు సమీపంలో గూడ్స్‌రైలు పట్టాలు తప్పడంతో రైళ్ల రాకపోకలు ఆలస్యం కావడం జరిగింది. ఒకే ట్రాక్‌పై రైళ్ల రాకపోకలు సాగించాల్సి వుండడంతో ఈ రూట్లో కొన్ని రైళ్లను రద్దు చేసారు కూడా. ఎక్స్‌ప్రెస్ రైళ్లు అయితే ఆరేడుగంటల పాటూ ఆలస్యంగా నడిచాయి. రెండురోజుల పాటు రైళ్లు ఇలాగే ఆలస్యంగా నడిచాయి. అయితే దీనికంతటికి కారణమైన గూడ్స్‌రైలు ప్రమాదానికి అసలు కారణం రైలింజన్‌లోని 15టన్నుల బరువుగల మోటారు క్రిందకు జారిపోవడమేనట. ఈ మోటారు కిందకు పడిపోవడంతో 16బోగీలు పక్కకు జరిగాయి.

## బాలికలే టాప్

ఇంటర్మీడియట్ మొదటిసంవత్సరం ఫలితాలను సోమవారం విడుదల చేసారు. ఉత్తీర్ణతలో బాలుర కంటే బాలికలే పైచేయి సాధించారు. జిల్లా వ్యాప్తంగా 26947 మంది పరీక్షలకు హాజరు కాగా 17281మంది (64శాతం) ఉత్తీర్ణులయ్యారు. అయితే ఉత్తీర్ణతలో గత ఏడాది జిల్లా 3వ స్థానంలో నిలవగా ఈసారి 4వ స్థానంలో నిలవడం విశేషం. ఒకేషనల్ కోర్సులో 69శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 981మంది పరీక్షలు రాయగా 687మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురు 14,384 మందికిగాను 8885 మంది(62%), బాలికలు 12,563 మందికిగాను 8396మంది(67%) ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీ గ్రూపులో కొండూరు సాయి కార్తికేయ 470కి గాను 466మార్కులతో, బైపిసిలో దువ్వూరు స్వర్శారెడ్డి 440కి గాను 430మార్కులతో, ఎంఇసిలో పి.వినీత్ 500కుగాను 491మార్కులతో జిల్లాలో అగ్రస్థానంలో నిలిచారు.


## ఉత్తరక్రియలు

మానవత్వంలో కీర్తిశిఖరానివి... దాతృత్వంలో స్ఫూర్తిప్రదాతవి
మంచితనం మీ ఆభరణం! మంచి హృదయం మీ ఆయుధం!!
'శ్రమయేవజయతే' సూక్తికి అక్షరశిల్పి మీరు.
మీ చేతి చలువ అందుకున్న గుండెల్లో కలకాలం నిలుస్తుంది మీ పేరు.

ధన్యజీవి... పుణ్యజీవి... మా ఇంటి దైవం

**శ్రీ చెరుకుపల్లి పిచ్చిరెడ్డి గారు**

తేది. 18.05.2014, శుక్రవారం స్వర్గస్తులైనారు.

వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య: సుబ్బరత్నమ్మ

కుమారుడు - కోడలు:
చెరుకుపల్లి పద్మనారాయణరెడ్డి - సుమతి

మనుమలు: హరీశ్వర్‌రెడ్డి, భవనేశ్వర్‌రెడ్డి



శ్రీ చెరుకుపల్లి పిచ్చిరెడ్డి గారు
అధినేత - సిపిఆర్ కల్యాణ మండపం, శివప్రియ లాడ్జి

కుమార్తెలు - అల్లుళ్లు
సువర్చల - మాలకొండారెడ్డి
కరుణ - శ్రీనివాసులురెడ్డి
అరుణ - పరంధామిరెడ్డి
మమత - జగదీష్

మేనల్లుడు
ప్రసాద్‌రెడ్డి - హారిత

మరియు
మనుమరాళ్ళు

ఉత్తరక్రియలు: తేది.08.05.2014 ఉదయం 8.30గంటలకు మాగుంట లేఅవుట్‌లోని మా స్వగృహమునందు జరుగును. కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

# ఇంటర్‌లో నారాయణ జోరు


సాయి కార్తికేయన్


స్పర్శరెడ్డి

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర ఫలితాలలో నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎప్పటి లాగే తమ సత్తా చాటారు. ఎంపీసీ విభాగంలో సాయికార్తికేయన్ 470కి గాను 466మార్కులు, జి.ఇందు ఆశ్రిత, లోకేశ్వరినాయుడు, ఎం.వి. అలేఖ్య 465మార్కులు సాధించారు. 151మంది 460మార్కులకు పైన, 592మంది 450మార్కులకు పైన సాధించారు. బైపిసిలో స్పర్శారెడ్డి 440కి గాను 434మార్కులు, ట్వింకిల్ రాథోర్, వెంకటసౌమ్య, సుస్మిత 432మార్కులు సాధించారు. 7మందికి 430మార్కులు పైన, 180మందికి 400మార్కులుపైన వచ్చాయి. ఎంఇసి విభాగంలో శ్రీచందన 500కిగాను 480మార్కులు సాధించారు. 29మందికి 450కిపైగా మార్కులొచ్చాయి.

# మోడీ పాలనతో అభివృద్ధికి అర్థం ఏర్పడుతుంది

**- వెంకయ్యనాయుడు**


మాట్లాడుతున్న వెంకయ్యనాయుడు

నెల్లూరు నర్తకిసెంటర్‌లో గత నెల 27న భారతీయ జనతాపార్టీ ఎన్నికల ప్రచారసభ నిర్వహించింది. నెల్లూరు గ్రామీణ నియోజకవర్గంలోని వెంగళ రావునగర్ నుంచి మూలాపేట మీదుగా ర్యాలీ నిర్వహించి నర్తకి సెంటర్ చేరుకున్న కార్యకర్తలు సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ అగ్రనేత వెంకయ్యనాయుడు మాట్లాడుతూ సీమాంధ్ర అభివృద్ధికి ప్రత్యేకప్యాకేజీ తీసుకొస్తామని, మెట్ట ప్రాంతాలకు నీరు అందేలా చేస్తామని తెలిపారు. ప్రధాని అభ్యర్థి ఎవరంటే చెప్పే పరిస్థితి మిగిలిన పార్టీలకు లేదని, మోడీ ప్రధానిగా ఏర్పడే ఎన్డీఏ ప్రభుత్వం పాలనలో అభివృద్ధికి అర్థం ఏర్పడుతుందని అన్నారు. ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా నిజాయితీగా ప్రజల కోసం పనిచేసే అభ్యర్థిని గెలిపించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నెల్లూరునగర ఎమ్మెల్యే అభ్యర్థి ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, బీజేపీ నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే అభ్యర్థి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కిలారి వెంకటస్వామినాయుడు, తాళ్ళపాక రమేష్‌రెడ్డి, తాళ్ళపాక అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

### ముమ్మరంగా...

# జయ కుమార్తె, మేనల్లుళ్ళ ప్రచారం



జై సమైక్యాంధ్ర పార్టీ నెల్లూరు నగర ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం జయకుమార్‌రెడ్డిని గెలిపించమని అభ్యర్థిస్తూ ఆయన కుమార్తె శార్వరీ, మేనల్లుడు సాయిశరవణ్ నెల్లూరు కామాటివీధి, కుక్కలగుంట, పొర్లుకట్ట తదితర ప్రాంతాలలో ఇంటింటి ప్రచారం ముమ్మరంగా చేస్తున్నారు. సమైక్యాంధ్ర కోసం ఆనం జయకుమార్‌రెడ్డి ఉద్యమంలో పాల్గొని తెలుగుజాతి ఐక్యత కోసం కృషిచేయగా, సామాన్య ప్రజలకు న్యాయం చేయకుండా తమ సొంత ప్రయోజనాల కోసం ఆయన అన్నలు కృషిచేసారని, అందుకే వారిని ఎదిరించి జయకుమార్‌రెడ్డి ప్రజల పక్షాన నిలిచారని, కాబట్టి ప్రజలందరూ ఆయనను ఆదరించి ఆశీర్వదించి పాదరక్షల గుర్తుకే ఓటు వేయమని వారు అభ్యర్థించారు. కార్యక్రమంలో మహ్మద్‌షఫీ, షబ్బీర్, ఖలీజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్‌లో విశ్వసాయి హవా




ఇంటర్ మొదటిసంవత్సరం పరీక్ష ఫలితాల్లో నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభ చాటారు. బైపిసి విభాగంలో పి.మేఘనారెడ్డి 440కి 432మార్కులు సాధించారు. అలాగే గ్రూప్ సబ్జెక్ట్సులో యశ్వంత్, సాయిరవితేజలు 100శాతం మార్కులు సాధించారు. ఎంపిసి విభాగంలో పి.హరిచందన 470కి 463మార్కులు, జి.కావ్యశ్రీసాయి, పి.వి.బిందుభార్గవిలు 461మార్కులు సాధించారు. ఈ విద్యార్థులను కళాశాల డైరెక్టర్ సత్యనారాయణ అభినందించారు.

## నెల్లూరు కబుర్లు

# నెల్లూరుపై విఐపిల దాడి

ఎన్నికల ప్రచారం పుణ్యమా అని నెల్లూరుకు రాజకీయ ప్రముఖుల తాకిడి ఎక్కువైంది. మే1వ తేదీన నెల్లూరు ఏ.సి. స్టేడియంలో జరిగిన సభలో బీజేపీ ప్రధానమంత్రి అభ్యర్థి నరేంద్ర మోడీ పాల్గొన్నారు. ఆయనతో పాటు తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు, పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్‌లు పాల్గొన్నారు. ఇక మంగళవారం జిల్లాలో జరిగిన ప్రచారసభలలో మెగాస్టార్ చిరంజీవి కాంగ్రెస్ తరపున పాల్గొన్నారు. మాజీక్రికెటర్, ఎంపీ అజారుద్దీన్ బుధవారం నెల్లూరులో జరిగిన కార్యక్రమాలలో పాల్గొన్నారు. త్వరలో వైకాపా అధినేత జగన్ కూడా జిల్లాలో రెండోవిడత ఎన్నికల ప్రచారానికి రానున్నారు.

### తెలంగాణకు

# నెల్లూరు పోలీసులు

తెలంగాణలో సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని గత నెల 27న నెల్లూరు జిల్లా పోలీసు సిబ్బంది దాదాపు 2023 మంది ప్రత్యేకబస్సుల్లో బయలుదేరారు. 1ఏఎస్పీ, 5మంది డిఎస్పీలు, 25మంది సిఐలు, 81మంది ఎస్సైలు, 85మంది ఏఎస్సైలు, 1 మహిళా ఏఎస్సై, 255 మంది హెడ్‌కానిస్టేబుళ్ళు, 9మంది మహిళా హెడ్‌కానిస్టేబుళ్ళు, 1176మంది కానిస్టేబుళ్ళు, 25మంది మహిళా కానిస్టేబుళ్ళు, 331మంది హోంగార్డులు, 34మంది మహిళా హోంగార్డులు ఈ బస్సుల్లో వెళ్ళి మెదక్, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లో రిపోర్టు చేసారు. మే1న జిల్లాకు తిరిగివచ్చారు.

### ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్

# నూతన కార్యవర్గం

నెల్లూరు ఆచారివీధిలోని హోటల్ శివంలో గత నెల 27న ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకారం జరిగింది. బయ్యా వెంకటరమణయ్య అధ్యక్షుడుగా, కృష్ణయ్య కార్యదర్శిగా, కొండా ప్రేమ్‌శంకర్ కోశాధికారిగా ప్రమాణం చేసారు. లయన్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎడ్లవల్లి అమృతవల్లి పర్యవేక్షించారు. కార్యక్రమంలో బయ్యా వాసు, బి.వి.నరసింహం, మాచవోలు రమేష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ పశువైద్య దినోత్సవం

ప్రపంచ పశువైద్యుల దినోత్సవం సందర్భంగా గత నెల 26న నెల్లూరు మినీబైపాస్‌లోని పరమేశ్వరి కల్యాణ మండపంలో రక్తదాన శిబిరం, క్రీడలు, సాంస్కృతిక పోటీల విజేతలకు బహుమతి ప్రదాన కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా పశుసంవర్ధకశాఖ జేడీ భాస్కర్‌రావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఈ సంవత్సరాన్ని మూగజీవుల సంక్షేమ సంవత్సరంగా పాటించనున్నారని తెలిపారు. మొదట పశువైద్యులు, సిబ్బంది రక్తదానం చేసారు. తదుపరి వైద్యసిబ్బంది, వారి కుటుంబసభ్యులకు నిర్వహించిన క్రీడలు, సాంస్కృతిక అంశాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యుల సంఘం అధ్యక్షులు కృష్ణమౌర్య, రామచంద్రారెడ్డి, విశ్రాంత పశువైద్యులు రాజేంద్రప్రసాద్, రామచంద్రారెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, రాజేష్, బ్రహ్మయ్య, రమేష్‌బాబు, ప్రభాకర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# నిశ్చింతగా ఓటేయొచ్చు

**- ఎస్పీ**



ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటును వేసుకునేలా అన్ని ఏర్పాట్లు చేసామని జిల్లా ఎస్పీ నవదీప్‌సింగ్ గ్రేవాల్ పేర్కొన్నారు. సోమవారం నెల్లూరులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేకదృష్టి పెడుతున్నట్లు చెప్పారు. గుర్తించిన ప్రతి సమస్యాత్మక గ్రామంలో ఒక ఎస్ఐతో పాటు కేంద్ర బలగాలను బందోబస్తుకు నియమిస్తున్నామన్నారు. ప్రజల్లో నమ్మకం, ధైర్యం కల్పించేందుకు సమస్యాత్మక గ్రామాలలో భద్రతా దళాలతో ఫ్లాగ్‌మార్చ్‌ను నిర్వహించనున్నామన్నారు. ఎన్నికల బందోబస్తు కోసం కేంద్ర పారామిలిటరీ బలగాలతోపాటు కర్నాటక, ఒడిసా రాష్ట్రాలనుండి కూడా అదనపు బలగాలు రానున్నాయని ఆయన చెప్పారు.

# బంగ్లాతోటలో వైఎస్సార్సీపీ ఆత్మీయ సమావేశం


ప్రచారంలో మేకపాటి రాజమోహన్‌రెడ్డి, డా॥ అనిల్ యాదవ్

నెల్లూరులోని బంగ్లాతోట ప్రాంతంలో గత నెల 27న వైఎస్సార్సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, నెల్లూరు నగర నియోజకవర్గ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో స్థానిక నాయకులతో ఆత్మీయ సమావేశం జరిగింది. సమావేశంలో వైవీరెడ్డి, తిప్పిరెడ్డి రఘురామిరెడ్డి, ముక్కాల ద్వారకానాథ్, గున్నం శ్రీనివాసులురెడ్డి, ఓబిలి రవిచంద్ర, లంకా రామశివారెడ్డి, సన్నపురెడ్డి పెంచలరెడ్డి, ఈదల ధనూజా, వంగాల చినశ్రీనివాసులురెడ్డి, అద్దంకి జగన్, మాల్యాద్రి, ఖాసిం సాహెబ్, మల్లు సుధాకర్‌రెడ్డి, దార్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణపై ఐజీ సునీల్ ఆదేశాలు

నెల్లూరు దర్గామిట్టలోని జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో గతనెల 27న గుంటూరురేంజి ఐజీ సునీల్‌కుమార్ ఎస్పీ, ఏఎస్పీ, డీఎస్పీలతో సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బు, మద్యం పంపిణీ జరుగకుండా పకడ్బందీగా వ్యవహరించాలన్నారు. జిల్లా సరిహద్దులోని చెక్‌పోస్టులను తనిఖీ మరింత దృఢతరం చేయాలన్నారు. ఎన్నికల నిబంధనలు పాటించని వారిపై కఠినచర్యలు తీసుకోవాలని, అభ్యర్థుల ఇళ్ళ వద్ద షాడో పార్టీలను ఏర్పాటుచేసి నిరంతరం వారి కదలికలను పరిశీలించాలన్నారు. ప్రజలందరూ నిర్భయంగా ఓటును వేసే వాతావరణం కల్పించాలన్నారు. సమస్యాత్మక కేంద్రాలపై నిఘాను పెంచాలన్నారు. సమావేశంలో ఎస్పీ నవదీప్‌సింగ్‌గ్రేవాల్, ఏఎస్పీలు రెడ్డి గంగాదరరావు, ఏసీ నాగేశ్వరరావు, డీఎస్పీలు పి.వెంకటనాథ్‌రెడ్డి, వివిఎస్ రాంబాబు, శిల్పవల్లి, చౌడేశ్వరి, బాలవెంకటేశ్వరరావు, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ వైజయ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ముస్లింయూత్ వితరణ



నెల్లూరులోని పుట్టవీధిలో గతనెల 26న ముస్లింయూత్ ఆధ్వర్యంలో రజ్జబ్ నెలను పురస్కరించుకొని పేదవారికి బియ్యం, పప్పులను ఉచితంగా పంపిణీ చేసారు. కార్యక్రమంలో పాల్గొన్న సూక్ష్మకళాకారుడు ముస్సవీర్ మాట్లాడుతూ అన్ని పర్వదినాల సందర్భాలలో మతాలకతీతంగా మానవతా దృక్పథంతో వీరు మంచి కార్యక్రమాలు చేస్తున్నారని అభినందించారు. పంపిణీలో ముస్లిం యూత్ జిల్లా అధ్యక్షులు ఎస్.కె.ఖాలీద్, గోల్డ్‌స్మిత్ ఎజాజ్, ఇసాక్, రియాజ్, ఫజల్, గౌస్‌బాషా, సద్దాం, కెజిఎన్ ఫ్రూట్స్ మున్నా, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటుహక్కు ప్రాధాన్యతపై ఫోటో ప్రదర్శన

కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖకు చెందిన డివిపి, ఫీల్డ్ ఎగ్జిబిషన్ ఆఫీస్, హైదరాబాదు అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల సందర్భంగా గతనెల 28న ఓటు హక్కు యొక్క ప్రాధాన్యతను తెలుసుకొని ప్రజలందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్న ఉద్దేశ్యంతో నెల్లూరు ఆర్‌టిసి బస్టాండులో ఒక ఫోటో ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఓటు యొక్క ప్రాధాన్యం, ప్రాముఖ్యత, ఓటు వేసే విధానం మొదలైన అంశాలకు సంబంధించిన ఫోటోలకు ఈ ప్రదర్శనలో ఉంచారు. ఓటింగ్ ప్రక్రియలో ఇవిఎమ్‌ల పనితీరు, వీటిని ప్రజలు ఉపయోగించే తీరు, ఇతర అంశాలు కూడా ఇందులో ఉన్నాయి. ఈ సందర్భంగా డివిఎపి ఫీల్డ్ ఎగ్జిబిషన్ ఆఫీసర్ కృష్ణనందన మాట్లాడుతూ ఓటు వినియోగంలో నిరాసక్తత చూపిస్తే ఏర్పడే ప్రభుత్వాలవల్ల ప్రజలు ఇబ్బందుల పాలవుతారని, ఓటువేసి సమర్థులైన వారిని ఎన్నుకోవడం ప్రతి పౌరుని బాధ్యతని పేర్కొన్నారు.

# పొలిటికల్ వార్ 2014




| ఓటర్ల వివరాలు | |
|---|---|
| పురుషులు | 1,03,520 |
| మహిళలు | 1,04,767 |
| ఇతరులు | 23 |
| మొత్తం | 2,08,310 |

**నియోజకవర్గ మండలాలు**

ఆత్మకూరురూరల్, ఏఎస్‌పేట, మర్రిపాడు, అనంతసాగరం, చేజర్ల, సంగం

**రంగంలోని ప్రధానపార్టీ అభ్యర్థులు**

గూటూరు కన్నబాబు(టీడీపీ)
మేకపాటి గౌతంరెడ్డి(వైసీపీ)
ఆనం రామనారాయణరెడ్డి(కాంగ్రెస్)
వల్లూరు విజయభాస్కర్‌రెడ్డి(జేఎస్పీ)

## ఆత్మకూరు... గౌతం జోరు

స్వర్గీయ ఆనం వెంకటరెడ్డి, ఆనం సంజీవరెడ్డి వంటి నాయకులు రాజకీయాలు చేసిన నియోజకవర్గం.

జిల్లా రైతాంగానికంతటికీ సాగునీరును, జిల్లా ప్రజల దాహాన్ని తీర్చే తాగునీటిని అందించే జలకామధేనువు సోమశిల రిజర్వాయర్ కలిగిన నియోజకవర్గం. వెనుకబడిన ప్రాంతాలు ఎక్కువుగా కలిగిన ప్రాంతం. ఈ జిల్లాలో ఇప్పుడు ఇక్కడ జరుగుతున్న ఎన్నికలు రాష్ట్ర వ్యాప్తంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఎందుకంటే నిన్నటి వరకు రాష్ట్ర మంత్రివర్గంలో నెంబర్ టూగా కొనసాగిన మాజీరాష్ట్ర ఆర్థికశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నాడు. సాధారణ పరిస్థితుల్లో అయితే ఇక్కడ ఆనం రామనారాయణరెడ్డి గెలుపుపై సందేహమే ఉండకూడదు. ఎందుకంటే ఈ ఐదేళ్లలో ఆత్మకూరు నియోజకవర్గానికి మంత్రిగా ఆయన తెచ్చినన్ని నిధులు చరిత్రలో ఎవరూ తెచ్చిఉండరు. సీఎంగా కిరణ్ తన పీలేరు నియోజకవర్గానికి ఎంత చేసాడో, ఆర్థికమంత్రిగా ఆనం రామనారాయణరెడ్డి తన నియోజకవర్గానికి అంతకంటే ఎక్కువే చేసారు. ఇంత అభివృద్ధి చేసాక కూడా ఏ నాయకుడైనా ఓడిపోయాడు అంటే అభివృద్ధి అనే మాటకు అర్థం లేనట్లే!

కాని ఆత్మకూరులో ఇప్పుడున్న పరిస్థితి అది కాదు. రాష్ట్ర విభజనకు ముందు ఆత్మకూరులో ఆనం రామనారాయణరెడ్డి గెలిచే పరిస్థితి ఉండింది. కాని విభజన తీరుతో ప్రజల్లో కాంగ్రెస్ అంటే అసహ్యం ఏర్పడింది. కాంగ్రెస్ మీద ఉన్న కోపంతో జనం ఆనం చేసిన అభివృద్ధిని మరచిపోయారు. దీంతో ఇంత చేసి కూడా ఈ ఎన్నికల్లో ఆనం రామనారాయణరెడ్డి ఏటికి ఎదురీదాల్సివస్తుంది. విభజన మూలంగానే నియోజకవర్గంలో గట్టిగా వున్న కాంగ్రెస్ కేడర్ కూడా చెల్లాచెదురైంది. దీనికితోడు ఇటీవల జరిగిన మున్సిపల్, పంచాయితీరాజ్ ఎన్నికలకు ఆనం పట్టించుకోకపోవడం మరికొంత మందిని ఆయనకు దూరం చేసింది.

రాష్ట్ర విభజన అనంతరం జరిగిన పరిణామాలన్నీ ఇక్కడ వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థి మేకపాటి గౌతంరెడ్డికి కలిసొచ్చేలా ఉన్నాయి. మొదటిసారిగా ఎన్నికలలోకి దిగుతుండడంతో ఆయన పట్ల వ్యతిరేకత లేదు. సొంత మండలం మర్రిపాడు ఈ నియోజకవర్గంలో వుండడం కలిసొచ్చే విషయం. జగన్ సానుకూల ఓటు వుంది.

టీడీపీ అభ్యర్థిగా గూటూరు కన్నబాబు రంగంలో వుండడంతో నిన్నటివరకు స్థానిక ఎన్నికల్లో వైకాపాకు వ్యతిరేకంగా పడిన ఓటు చీలే అవకాశముంది. కాంగ్రెస్‌పార్టీని పక్కన పెడితే తాను చేసిన అభివృద్ధికిగాను గెలుపుకు అన్ని విధాలా అర్హుడు ఆనం రామనారాయణరెడ్డి. కాని కాంగ్రెస్ పార్టీ ఈ రోజు ఆయనకు మైనస్. ఆనం వర్గం మొత్తం వైకాపా వైపుకు పోయింది. గెలుపు గౌతందే!

## కోవూరు... ఫ్యాన్ హోరు!

కీర్తిశేషులు బెజవాడ పాపిరెడ్డి, నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి వంటి ఉద్దండులు రాజకీయాలు నడిపిన ప్రాంతం. జిల్లాలోనే సంపన్నమైన ప్రాంతంగా పేరొందిన నియోజకవర్గం. పాడిపంటలకే కాదు పారిశ్రామికంగా కూడా జిల్లాలో మొదటి స్థానంలో ఉండిన నియోజకవర్గం. కోవూరంటేనే ఒకప్పుడు సహకార చక్కెర కర్మాగారం, మొలగొలుకుల వడ్లకు, బలిసిన రెడ్లకు ఇక్కడ ప్రాధాన్యత ఉంటుంది. గ్రామంలోని రెడ్లే ఇక్కడ రాజకీయాలను శాసిస్తుంటారు.

ఇలాంటి రాజకీయ ప్రాధాన్యతగల నియోజకవర్గం నుండి వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థిగా సిటింగ్ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, తెలుగుదేశం నుండి మాజీఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా వెంకటరమణ పోటీ పడుతున్నారు. ఇక్కడ కాంగ్రెస్ పోటీని లెక్కలోకి కూడా తీసుకోవాల్సిన పనిలేదు. ప్రధాన పోరు వైకాపా, తెలుగుదేశంల మధ్యే!

కోవూరు నియోజకవర్గం నల్లపరెడ్డి శీనయ్య కాలం నుండి కూడా వారికి కంచుకోటగా వుంది. 1985 నుండి కూడా కోవూరుపై నల్లపరెడ్డి ఆధిపత్యమే వుంది. శీనయ్య ఇక్కడ ఓటమి చవిచూసిందే లేదు. ఆయన మొదట తెలుగుదేశం నుండి పోటీ చేసినా, 1989లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసినా విజయం సాధించాడు. శీనయ్య మరణం తర్వాత 1993లో ఉప ఎన్నికల ద్వారా ప్రసన్న కోవూరు రాజకీయాల్లోకి ప్రవేశించాడు. ఉపఎన్నికలతో పాటు 1994, 1999 ఎన్నికల్లో వరుసగా గెలిచాడు. 2004ఎన్నికల్లో మాత్రం స్వయంకృతాపరాధం వల్ల ఓడిపోయాడు. మళ్ళీ 2009లో గెలిచి, గెలవగానే తెలుగుదేశంను వదిలి వైయస్ వైపుకు చేరాడు. వైయస్ మరణం తర్వాత జగన్ పార్టీలో చేరాడు. 2012లో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి వైకాపా అభ్యర్థిగా మళ్ళీ ఉపఎన్నికల్లో గెలిచాడు. వైకాపా నుండి రెండోసారి కోవూరు బరిలో ఏడవసారి ప్రసన్న పోటీ చేస్తున్నాడు. ఈసారి ఆయన 2004లో తనను అనూహ్యంగా మట్టికరిపించిన పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నుండే గట్టిపోటీని ఎదుర్కొంటున్నారు.

పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి 2004లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప మెజార్టీతో సంచలన విజయం సాధించారు. 5ఏళ్లు ఎమ్మెల్యేగా బాగానే పనిచేసినా 2009ఎన్నికల్లో కొన్నివర్గాలకు దూరమై ఓడిపోయారు. 2012ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఆయన ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. అయితే ఈ ఎన్నికల్లో ఆయన తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. నియోజకవర్గంలో మొదటి నుండి తెలుగుదేశంకు పట్టుంది. ఓట్లున్నాయి. జగన్ గాలి ఉన్నా పోలంరెడ్డి గట్టి పోటీ ఇచ్చే పరిస్థితి వుంది. 2012ఉపఎన్నికల్లో తెలుగుదేశం, కాంగ్రెస్‌లకు కలిసి 80వేల ఓట్లొచ్చాయి. ఈసారి కాంగ్రెస్ నిర్వీర్యమైపోయింది. తెలుగుదేశం శ్రేణులతో కాంగ్రెస్ కేడర్ పూర్తిగా కలవదు. మొగ్గు ప్రసన్నవైపే కనిపిస్తుంది.

| ఓటర్ల వివరాలు | |
|---|---|
| పురుషులు | 1,16,231 |
| మహిళలు | 1,24,538 |
| ఇతరులు | 20 |
| మొత్తం | 2,40,789 |

**నియోజకవర్గ మండలాలు**

కోవూరు, విడవలూరు, బుచ్చి, కొడవలూరు, ఇందుకూరుపేట

**రంగంలోని ప్రధానపార్టీ అభ్యర్థులు**

పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి(టీడీపీ)
నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి(వైసీపీ)
గిద్దలూరు వెంకటరమణ(కాంగ్రెస్)
జొన్నలగడ్డ వెంకమరాజు(సీపీఎం)




## నెల్లూరు నగరం... మళ్ళీ అదే సమరం

రాష్ట్ర రాజకీయాలకే దిక్సూచి లాంటిది నెల్లూరు. ఇక్కడ జరిగే రాజకీయాల పరిణామాలు, వచ్చే ఫలితాల కోసం రాష్ట్రమే ఎదురుచూస్తుంటుంది. ఇక్కడ గాలులు, ప్రభంజనాలు, హవాలు, సానుభూతికన్నా వ్యక్తులు, వ్యక్తిగత పరిచయాలు, కుల సమీకరణలే ప్రభావం చూపుతుంటాయి. అన్ని కులాలు, మతాలు, వర్గాలు, వృత్తుల సమాహారం ఈ నియోజకవర్గం.

అసెంబ్లీ బరిలో తెలుగుదేశం అభ్యర్థిగా సిటింగ్ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే వివేకా తనయుడు ఏ.సి.సుబ్బారెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థిగా పి. అనిల్‌కుమార్‌యాదవ్, జైసమైక్యాంధ్ర పార్టీ అభ్యర్థిగా ఆనం జయకుమార్‌రెడ్డి రంగంలో వున్నారు. 2009ఎన్నికల్లో ప్రజారాజ్యం అభ్యర్థిగా గెలుపొందిన ముంగమూరు ఈ ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేస్తుండడం గమనార్హం. ఈ ఐదేళ్లలో ఎమ్మెల్యేగా పనిచేసినా ఆయన పట్ల వ్యతిరేకత లేదు. ఆనం సోదరుల సహకారంతో నిధులు బాగానే తెచ్చి అభివృద్ధి పనులు చేసాడనే పేరుంది. ముఖ్యంగా ఆయన వ్యక్తిగత పరిచయాలు ప్రభావవంతంగా ఉంటున్నాయి. కమ్మ, వైశ్య, బ్రాహ్మణ, కాపు ఓటర్లలో గట్టి పట్టుంది. రెడ్డి సామాజికవర్గంలో చీలిక తేగలడు. తూర్పు నగరంలో ముంగమూరు ఆధిపత్యం వుంటుంది. ఇక్కడ గట్టి పట్టుండడం వల్లే 2009ఎన్నికల్లో ఆయన 90ఓట్ల తేడాతో గెలవగలిగాడు. తూర్పుప్రాంతంలో స్వతహాగా తెలుగుదేశం పార్టీకి సాంప్రదాయ ఓటు బ్యాంకు ఉండడం కలిసొచ్చే అంశం.

కాంగ్రెస్ అభ్యర్థిగా వున్న ఏ.సి.సుబ్బారెడ్డికివి తొలిఎన్నికలు. ఆనం వివేకా పోటీ నుండి తప్పుకుని తన పెద్దకొడుకును నిలబెట్టాడు. కాంగ్రెస్‌పార్టీ ఒక్కటే వారికి పెద్దమైనస్. గత ఐదేళ్లలో చూస్తే అభివృద్ధి పరంగా వివేకాకు సానుకూల స్పందన ఉంది. అంతకుముందున్న వ్యతిరేకతను పోగొట్టుకున్నాడు. వ్యక్తిగతంగా కూడా ఏసికి మంచి పేరుంది. ప్రజల్లోకి చొరవగా వెళుతున్నాడు. నగరంలో ఆనంకు ప్రత్యేకంగా కొంత ఓటు బ్యాంకు ఉంది. వైకాపాకు గట్టి మద్దతుగా వున్న ముస్లిం, క్రిస్టియన్ ఓట్లలో చీలిక తేగల సత్తా ఆనంకు మాత్రమే వుంది. వాళ్లిప్పుడు ఆ పనిలోనే వున్నారు. ఆనంకు తరతరాలుగా నగరంలోవున్న కుటుంబ, వ్యక్తిగత సంబంధాలు కూడా ఏసికి ఉపకరిస్తున్నాయి. నా బిడ్డను మీ చేతుల్లో పెట్టానంటూ వివేకా పండిస్తున్న సెంటిమెంటు సీన్లు కొంత ప్రభావం చూపుతున్నాయి.






**నెల్లూరు నగరం**

నెల్లూరు నగరపాలక సంస్థలోని 28డివిజన్‌లు

**రంగంలోని ప్రధానపార్టీ అభ్యర్థులు**

ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి(టీడీపీ)
పి.అనిల్‌కుమార్‌యాదవ్(వైసీపీ)
ఏ.సి.సుబ్బారెడ్డి(కాంగ్రెస్)
ఆనం జయకుమార్‌రెడ్డి(జేఎస్పీ)

| ఓటర్ల వివరాలు | |
|---|---|
| పురుషులు | 1,23,850 |
| మహిళలు | 1,20,372 |
| ఇతరులు | 81 |
| మొత్తం | 2,44,303 |

వైకాపా అభ్యర్థిగా బరిలో వున్న పి.అనిల్‌కుమార్‌యాదవ్ బలహీన వర్గాలకు చెందిన యువకుడు. 2009ఎన్నికల్లోనే కాంగ్రెస్ భారీ తేడాతో ఓడిపోతుందనుకున్న నెల్లూరు నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపు అంచులదాకా వచ్చి కేవలం 90ఓట్ల తేడాతో ఓడిపోయిన దురదృష్టవంతుడు. ఈ ఎన్నికల్లో ఆ సానుభూతి కొంత వుంది. అదీగాక రెండేళ్ల నుండి నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లలో తిరుగుతూనే వున్నాడు. కొన్ని వర్గాలలో జగన్ హవా పనిచేస్తుండడం కలిసొచ్చే విషయం. బిసిల మద్దతుంది. మైనార్టీ ఓటర్లు ఎక్కువుగా ఉండడం కలిసొచ్చే విషయం. కాకపోతే సొంత పార్టీలోని కొందరు నాయకుల నుండే మద్దతు లేదనే ప్రచారం కూడా వుంది.

ఇక తన సోదరులను ఎదిరించి, తాను నమ్మిన విధానాలను అనుసరించి సమైక్యాంధ్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఆనం జయకుమార్‌రెడ్డి జైసమైక్యాంధ్ర పార్టీ అభ్యర్థిగా రంగంలో వున్నారు. మొత్తానికి నగరంలో ప్రధాన పోటీ తెలుగుదేశం, వైకాపాల మధ్యనే నెలకొంది. విజయం ఎవరిదనేది ఘంటాపథంగా చెప్పే పరిస్థితి లేదు.

# సింహపురి... ముఖాముఖీ బరి






దాదాపు నాలుగు దశాబ్దాల పాటూ ఎస్సీ రిజర్వ్‌డ్ కేటగిరిలో వుండి 2009ఎన్నికలప్పటి నుండి జనరల్‌గా మారిన నెల్లూరు లోక్‌సభ స్థానం ఇప్పుడు అన్ని రాజకీయపార్టీలకు కూడా కీలకంగా మారింది. 2009లో ఈ సీటు నుండి పోటీ చేయాలని నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి తెగ ఉబలాటపడ్డారు. అయితే ఆరోజు వై.యస్.రాజశేఖరరెడ్డి ఆయనను ముందుగా రాజ్యసభకు పంపించేసి మేకపాటి రాజమోహన్‌రెడ్డిని ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థిగా నిలబెట్టారు. ఆరోజు టీడీపీ అభ్యర్థిగా వంటేరు వేణుగోపాలరెడ్డి, ప్రజారాజ్యం అభ్యర్థిగా జానా రామచంద్రయ్యగౌడ్‌లు పోటీకి దిగారు. టీడీపీ అభ్యర్థి వంటేరు వేణుగోపాల్‌పై కాంగ్రెస్ అభ్యర్థి మేకపాటి 60వేల ఓట్ల తేడాతో గెలుపొందారు.

వై.యస్. మరణం తర్వాత చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో మరోసారి నెల్లూరు లోక్‌సభకు ఉపఎన్నికలు రావడం జరిగింది. జగన్ స్థాపించిన వై.యస్.ఆర్ కాంగ్రెస్ అభ్యర్థిగా మేకపాటి రాజమోహన్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా టి.సుబ్బరామిరెడ్డి, తెలుగుదేశం అభ్యర్థిగా వంటేరు వేణుగోపాలరెడ్డిలు నిలవగా, వైకాపా అభ్యర్థిగా మేకపాటి దాదాపు 3లక్షల ఓట్ల రికార్డు మెజార్టీతో గెలిచారు. ఇదంతా కూడా వై.యస్. సానుభూతి, జగన్ హవాతో వచ్చిన మెజార్టీనే!

ఉపఎన్నికలు జరిగి రెండేళ్లు కూడా కాలేదు. 3లక్షల మెజార్టీ అంటే ఆషామాషీ కాదు. జనాల్లో జగన్ గాలి అన్నా తగ్గాలి, లేదంటే సిటింగ్ ఎంపీగా మేకపాటి పట్ల వ్యతిరేకత ఉధృతంగానన్నా ఉండాలి. ఈ పరిస్థితి ఉంటేనేగాని ఈ సీటులో వైకాపా అభ్యర్థిని ఓడించలేరు. మరి అంతటి సీన్ ఈ నియోజకవర్గంలో నెలకొని వుందా? అన్నదే ప్రశ్న.

తెలుగుదేశం నుండి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నుండి వాకాటి నారాయణరెడ్డిలు పోటీలో వున్నారు. వాకాటి నాయకుడిగా సమర్థుడే అయినా కాంగ్రెస్ పార్టీ ఆయనకు గుదిబండ. వాకాటికి ఓట్లేయాలనుకునే వాళ్లు కూడా హస్తం గుర్తు చూసి వెనక్కిపోతారు. వైకాపాకు ప్రధానపోటీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి నుండే! నియోజకవర్గానికి ఆదాల కొత్త. కాకపోతే నెల్లూరు, కావలి, ఉదయగిరి, కందుకూరు నియోజకవర్గాలలో వ్యక్తిగత పరిచయాలు బాగున్నాయి. ఆదాల పట్ల ప్రజలలో వ్యతిరేకతకు అవకాశం లేదు. ఆదాల వచ్చాక కోవూరు, ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాలలో పార్టీని పటిష్టం చేసాడు. అయితే నెల్లూరురూరల్ బీజేపీకివ్వడం, ఆత్మకూరులో బలమైన అభ్యర్థిని నిలబెట్టలేకపోవడం ఆదాలకు మైనస్‌గా చెప్పుకోవచ్చు. ఈ రెండుచోట్ల కూడా భారీగా క్రాస్‌ఓటింగ్ జరుగుతుందనే దానిపైనే ఆదాల శిబిరం ఆశలు పెంచుకుని వుంది. అసెంబ్లీలో జగన్‌కు సానుకూలంగా కొంత ఓటింగ్ జరిగినా పార్లమెంట్‌లో నరేంద్ర మోడీ ప్రభావం ఉంటుందని, ఆ దిశగా క్రాస్‌ఓటింగ్ జరగవచ్చనే అంచనాలతోనే ఆదాల గట్టిగా పోరాటం చేస్తున్నాడు.

**నియోజకవర్గాలు**

నెల్లూరు నగరం, నెల్లూరురూరల్, కోవూరు, ఆత్మకూరు, కావలి, ఉదయగిరి, కందుకూరు.

**ఓటర్ల వివరాలు**

| | |
|---|---|
| పురుషులు | 7,62,866 |
| మహిళలు | 7,75,140 |
| మొత్తం | 15,38,006 |

**రంగంలోని ప్రధానపార్టీ అభ్యర్థులు**

ఆదాల ప్రభాకర్‌రెడ్డి(టీడీపీ)
మేకపాటి రాజమోహన్‌రెడ్డి(వైసీపీ)
వాకాటి నారాయణరెడ్డి(కాంగ్రెస్)

# తిరుపతి... వైకాపాకే పరపతి






పేరుకు తిరుపతి లోక్‌సభ నియోజకవర్గమే అయినా దీనిలో నాలుగు శాసనసభ నియోజకవర్గాలు నెల్లూరుజిల్లా పరిధి లోవే! 2009లో నియోజకవర్గాల పునర్విభజనకు ముందు సూళ్లూరుపేట, వెంకటగిరి అసెంబ్లీలు మాత్రమే తిరుపతిలో కలిసి వుండేవి. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలతో పాటు గూడూరు, సర్వేపల్లి నియోజకవర్గాలు కూడా కలిసాయి.

ఈ ఎన్నికలలోనూ కాంగ్రెస్ అభ్యర్థిగా మళ్ళీ చింతా మోహన్ పోటీ చేస్తున్నాడు. కాంగ్రెస్‌పార్టీ అధిష్టానం తిరుపతి లోక్‌సభను ఆయనకు శాశ్వతంగా రాసిచ్చినట్లుంది. అందుకే ఆయనకు తప్పితే సీటు విషయంలో ఇంకొకరి పేరు ఆలోచన కూడా చేయడం లేదు. ఇక వైకాపా అభ్యర్థిగా క్రితంసారి ఇదే లోక్‌సభ నుండి ప్రజారాజ్యం అభ్యర్థిగా పోటీ చేసిన వరప్రసాద్ బరిలో వున్నారు. పొత్తులో భాగంగా ఈ లోక్‌సభ నుండి తెలుగుదేశం బదులు బీజేపీ అభ్యర్థిగా కారుమంచి జయరామయ్య పోటీ చేస్తున్నారు.

ఈసారి తిరుపతి లోక్‌సభపై చింతా మోహన్ ఆశలు వదులుకోక తప్పేటట్లు లేదు. రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమానికి కనీస ధర్మంగా మద్దతు కూడా తెలుపని నాయకుడు చింతా మోహన్. ఈ కోపంతోనే తిరుపతిలో జనం ఆయన ఇంటిమీదకు కూడా పోయారు. కాంగ్రెస్ అధిష్టానానికి దాసోహమై సమైక్య ఉద్యమం వైపు కన్నెత్తి కూడా చూడలేదు చింతామోహన్. రాష్ట్ర విభజన విషయంలో ప్రజలకు కాంగ్రెస్ మీద ఎంత కోపముందో చింతా మోహన్ మీద అంతకంటే ఎక్కువ కోపముంది. ఈమధ్య దుగరాజపట్నం పోర్టుకు ప్రధాని చేత శంకుస్థాపన చేయించి కొంత కవర్ చేసుకోవాలనుకున్నాడు. అయితే ఆ ప్రయత్నాలు నెరవేరలేదు.

వైకాపా అభ్యర్థి వరప్రసాద్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి. గత ఎన్నికల్లో ప్రజారాజ్యం అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయి వున్నాడు. ఆయన పట్ల ఎలాంటి వ్యతిరేకత లేదు. ఇక జగన్ హవా వుంది. ఇక్కడ బీజేపీని కూడా తేలిగ్గా తీసుకోవడానికి ఆస్కారం లేదు. 1999ఎన్నికల్లో తిరుపతి లోక్‌సభ నుండి బీజేపీ అభ్యర్థి వెంకటస్వామి విజయం సాధించడం తెలిసిందే! ఈ లోక్‌సభ పరిధిలోకి తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేట, వెంకటగిరి, గూడూరు, సర్వేపల్లి అసెంబ్లీలొస్తాయి. ఈ 7అసెంబ్లీ సెగ్మెంట్లలో అభ్యర్థుల గెలుపోటములను బట్టే లోక్‌సభ అభ్యర్థుల భవిష్యత్ ఆధారపడి వుంటుంది. ముఖ్యంగా నెల్లూరుజిల్లాలోని గూడూరు, సర్వేపల్లి, సూళ్లూరుపేటలలో వైకాపా బలంగా వుంది. పార్లమెంటుకు కూడా ఇక్కడ మంచి మెజార్టీ రానుంది. ఇక చిత్తూరుజిల్లాలోని మూడు అసెంబ్లీ సెగ్మెంట్లలో కూడా వైకాపాకే మెజార్టీ రానుంది. ఈ నేపథ్యంలో వరప్రసాద్ గెలుపు ఖాయమంటున్నారు.

**ఓటర్ల వివరాలు**

| | |
|---|---|
| పురుషులు | 7,44,536 |
| మహిళలు | 7,59,485 |
| ఇతరులు | 144 |
| మొత్తం | 15,36,764 |

**నియోజకవర్గాలు**

తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేట, వెంకటగిరి, గూడూరు, సర్వేపల్లి

**రంగంలోని ప్రధానపార్టీ అభ్యర్థులు**

వి.వరప్రసాద్‌రావు(వైసీపీ)
చింతా మోహన్(కాంగ్రెస్)
కె.జయరాం(బీజేపీ)

# వెంకటగిరి... కొమ్మికే ఈసారి

చరిత్రలో వెంకటగిరి సంస్థానంగా ఓ వెలుగు వెలిగిన ప్రాంతమిది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక కాదు, రాకముందు కూడా ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న నియోజకవర్గం. దాదాపు రెండు దశాబ్దాల పాటూ నల్లపరెడ్లు, నేదురుమల్లి కుటుంబాల రాజకీయ పోరుకు వేదిక వెంకటగిరి. చేనేత కార్మికులు అత్యధికంగా ఉన్న నియోజకవర్గం.

వెంకటగిరి నియోజకవర్గానికి ఇప్పటివరకు జరిగిన ఎన్నికలు ఓ ఎత్తు, ఇప్పుడు జరగబోతున్న ఎన్నికలు మరో ఎత్తు. ఇప్పటివరకు నేదురుమల్లి కుటుంబసభ్యులు ఇక్కడ గెలవడమో లేకపోతే రెండో స్థానంలో నిలవడమో జరుగుతూ వచ్చింది. కాని ఈ ఎన్నికల్లో మాత్రమే మూడోస్థానానికి పోయే పరిస్థితిలో వున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిగా నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, తెలుగుదేశం అభ్యర్థిగా సిటింగ్ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థిగా కొమ్మి లక్ష్మయ్యనాయుడు బరిలో వున్నారు. కాంగ్రెస్ పట్ల జనాల్లో వున్న వ్యతిరేకత తొలిసారి ఎన్నికల బరిలోకి దిగిన నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డిపై ప్రభావం చూపుతుంది. ప్రధాన పోటీ కురుగొండ్ల రామకృష్ణ, కొమ్మి లక్ష్మయ్యనాయుడుల మధ్యే నెలకొంది. సిటింగ్ ఎమ్మెల్యేగా కురుగొండ్లపై ప్రజల్లో పెద్దగా వ్యతిరేకత లేదు, అలాగని మళ్ళీ ఓట్లేయాలనేంత ఇమేజ్‌లేదు. రెండేళ్ల క్రితమే వైకాపా వెంకటగిరి ఇన్‌ఛార్జ్‌గా కొమ్మి లక్ష్మయ్యను నియమించడంతో ఆయన నియోజకవర్గాన్ని సుడిగాలి లాగా చుట్టేసాడు. స్వతహాగానే కొమ్మికి మాస్ లీడర్‌గా పేరుంది. జనాల్లోకి చొచ్చుకుపోగలడు. జనం కోసం ఎంత దూరమైనా వెళ్తాడనే పేరుంది. మాస్ లీడర్‌గా ఆయనకున్న ఇమేజ్ వెంకటగిరి ప్రజలపై బాగానే ప్రభావం చూపుతుంది. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే కొన్ని వర్గాలు ఆయనకు సహకరించడం లేదనే ప్రచారం జరుగుతుంది. అయితే జగన్ గాలిలో ఇది పెద్దగా ప్రభావం చూపకపోవచ్చు. ప్రచారంలో కొమ్మి చాలావేగంగా దూసుకుపోయాడు. ఒక్కో ఇంటిని రెండేసిసార్లు చుట్టేసాడు. రూపాయి ఖర్చుకాకుండా ఎలక్షన్ చేయడంలో కొమ్మి దిట్ట. అందరూ జనాలకు డబ్బులిస్తుంటే, ఇతను జనాల నుండే డబ్బులు తీసుకుని ఓట్లు వేయించుకోగలడు.

వెంకటగిరి మున్సిపాల్టీలో కొంత తెలుగుదేశం ప్రభావం వున్నా బాలాయపల్లి, డక్కిలి, రాపూరు, సైదాపురం, కలువాయి మండలాలలో 'ఫ్యాన్'గాలి వీస్తుంది. మొగ్గు కొమ్మివైపే కనిపిస్తుంది.






**ఓటర్ల వివరాలు**

| | |
|---|---|
| పురుషులు | 1,06,762 |
| మహిళలు | 1,09,191 |
| ఇతరులు | 25 |
| మొత్తం | 2,15,978 |

**నియోజకవర్గ మండలాలు**

వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి, సైదాపురం, రాపూరు, కలువాయి

**రంగంలోని ప్రధానపార్టీ అభ్యర్థులు**

కురుగొండ్ల రామకృష్ణ(టీడీపీ)
కొమ్మి లక్ష్మయ్యనాయుడు(వైసీపీ)
నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి(కాంగ్రెస్)
వెంకటేశ్వర్లు(సీపీఎం)

# సూళ్లూరుపేట... సంజీవయ్యకే పీట

అంతర్జాతీయ స్థాయిలో పేరెన్నికగన్న అంతరిక్ష ప్రయోగకేంద్రం(షార్ సెంటర్), ఆసియాలోనే అతిపెద్ద ఉప్పునీటి సరస్సును కలిగిన నియోజకవర్గం సూళ్లూరుపేట. ఆంధ్రప్రదేశ్ - తమిళనాడు రాష్ట్రాలకు సరిహద్దుల్లో ఉన్న నియోజకవర్గం. ఎన్నో ఏళ్లుగా ఎస్సీ రిజర్వ్‌డ్‌లో కొనసాగుతుంది.

ప్రస్తుత ఎన్నికల్లో సిటింగ్ ఎమ్మెల్యే పరసారత్నం తెలుగుదేశం అభ్యర్థిగా, కిలివేటి సంజీవయ్య వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా, ధూర్జాటి మధుసూదన్‌రావు కాంగ్రెస్ అభ్యర్థిగా రంగంలో వున్నారు. కాంగ్రెస్ ఇక్కడ నామమాత్రపు పోటీలో వుంది. ప్రధాన పోటీ తెలుగుదేశం, వైకాపాల మధ్యనే నెలకొని వుంది. సిటింగ్ ఎమ్మెల్యే పరసారత్నం 1994 నుండి ప్రతి ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. 2004 ఎన్నికల్లో తప్ప మిగిలిన మూడు ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచారు. ఈసారి మాత్రం ప్రజల్లో ఆయన మీద వ్యతిరేకత ఉందనే ఉద్దేశ్యంతో ఆయనను తప్పించాలనుకున్నారు. కాని చివరకు ఆయనే సీటు దక్కించుకున్నారు. కాని గతంలోలాగా తెలుగుదేశంలోని వాళ్లే ఆయనకు సహకరించడం లేదు.

మాజీమంత్రి పసల పెంచలయ్య అల్లుడు కిలివేటి సంజీవయ్య వైకాపా అభ్యర్థిగా తొలిసారి ప్రత్యక్షఎన్నికల్లో పోటీకి దిగుతున్నారు. వ్యక్తిగతంగా మంచిపేరుంది. నియోజకవర్గంలో పసల పెంచలయ్య పట్ల ఇప్పటికీ ఆదరణ వుంది. అన్నింటికి మించి నియోజకవర్గంలో వైయస్ సానుభూతి ఓటు బలంగా వుంది. కొన్ని నెలల క్రితమే సూళ్లూరుపేట సమన్వయకర్తగా సంజీవయ్యను ప్రకటించి ఉండడంతో ప్రచారంలో కూడా ఆయన జోరుగా దూసుకుపోయారు. మత్స్యకారులు ఎక్కువుగా వున్న నియోజకవర్గమిది. తెలుగుదేశంకు సాంప్రదాయ ఓటుబ్యాంకు ఉంది. కాబట్టి సంజీవయ్యకు తెలుగుదేశం నుండి కొంత పోటీ ఎదురుకావచ్చు గాని ఆయన గెలుపును మాత్రం అడ్డుకోలేకపోవచ్చు.

ముఖ్యంగా ఈ నియోజకవర్గంలో అభ్యర్థులు ఎస్సీలే అయినా, వారిని నడిపేది మాత్రం అగ్రవర్ణాల నాయకులే. కాంగ్రెస్‌కు వాకాటి నారాయణరెడ్డి, తెలుగుదేశంకు వేనాటి రామచంద్రారెడ్డి, జి.గంగాప్రసాద్‌లు ఇక్కడ తెరవెనుక నాయకులు. పార్టీల అభ్యర్థులను నిర్ణయించేది కూడా వీళ్ళే. అయితే వైకాపాకు ఇలాంటి తెరచాటు లీడర్ లేకపోయినా, బలంగానే ఉన్న కేడర్‌తో సంజీవయ్య ప్రచారంలో దూసుకుపోతున్నాడు. సిటింగ్ ఎమ్మెల్యేగా పరసారత్నం పట్ల ఉన్న వ్యతిరేకత, సొంతపార్టీలోనే ఆయనకు సహకారం లోపించడం సంజీవయ్యకు కలిసొస్తుంది.






**ఓటర్ల వివరాలు**

| | |
|---|---|
| పురుషులు | 1,12,303 |
| మహిళలు | 1,14,856 |
| ఇతరులు | 28 |
| మొత్తం | 2,27,187 |

**నియోజకవర్గ మండలాలు**

సూళ్లూరుపేట, డి.వి.సత్రం, తడ, నాయుడుపేట, పెళ్లకూరు

**రంగంలోని ప్రధానపార్టీ అభ్యర్థులు**

పరసా వెంకటరత్నం(టీడీపీ)
కిలివేటి సంజీవయ్య(వైసీపీ)
దుర్గాటి మధుసూదన్‌రావు(కాంగ్రెస్)
దుగ్గిరాల అన్నపూర్ణయ్య(సీపీఎం)

# నెల్లూరురూరల్... రూలర్ కోటంరెడ్డి

2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజన ద్వారా ఏర్పడిందే నెల్లూరు గ్రామీణ నియోజకవర్గం. అంతకుముందు నెల్లూరు నగరం పోను మిగిలిన రూరల్ ప్రాంతం కొంత సర్వేపల్లి నియోజకవర్గంలో, మరికొంత రాపూరు నియోజకవర్గంలో కలిసి వుండేది. 2009లో పునర్విభజన తర్వాత నెల్లూరు నగరంలో కొంత భాగాన్ని, నెల్లూరురూరల్ మండలాల్ని కలిపి నెల్లూరు గ్రామీణ నియోజకవర్గంగా ఏర్పాటు చేసారు. 2009లో జరిగిన తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఆనం వివేకానందరెడ్డి ఈ అసెంబ్లీ నుండి 3131ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో తెలుగుదేశంతో కుదుర్చుకున్న పొత్తులో భాగంగా సీపీఎం ఇక్కడ నుండి పోటీ చేసింది. చిరంజీవి నేతృత్వంలోని ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థి ఆనం వెంకటరమణారెడ్డి గట్టి పోటీ ఇచ్చారు.

నెల్లూరు గ్రామీణ నియోజకవర్గానికి రెండోసారి ఎన్నికలు జరగబోతున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థిగా ఆనం విజయకుమార్‌రెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థిగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తలపడుతున్నారు. తెలుగుదేశంతో కుదుర్చుకున్న పొత్తులో భాగంగా బీజేపీ అభ్యర్థిగా సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి రంగంలో వున్నారు. సీపీఎం, ఆమ్‌ఆద్మీతో పాటూ పలు పార్టీలు రంగంలో వున్నాయి. వైకాపా, కాంగ్రెస్, బీజేపీల మధ్య త్రిముఖపోటీ నెలకొని వుంది. కాంగ్రెస్ అభ్యర్థి ఆనం విజయకుమార్‌రెడ్డికి రూరల్ గ్రామాలపై పట్టుంది. గ్రామస్థాయి నేతలతో పరిచయాలు బాగున్నాయి. అయినా రూరల్ నియోజకవర్గంలో 60శాతం ఓట్లు నెల్లూరు నగర పరిధిలోనే వున్నాయి. ఇక్కడ ఓటర్లను ఆయన కంటే కూడా ఆయన అన్న ఆనం వివేకానందరెడ్డి ప్రభావితం చేయగలరు. నాయకుడిగా ఆనం విజయకుమార్‌రెడ్డికి మంచి గుర్తింపు వున్నా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ ఆయనకు పెద్ద మైనస్. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పడే ఓట్లన్నీ కూడా ఆనం విజయను చూసి వేసేవే తప్పితే కాంగ్రెస్‌ను చూసి వేసేవి కావు.

కాంగ్రెస్ నుండి జగన్‌తో పాటే బయటకు వచ్చి ఆయన వెంటే నడుస్తున్న నాయకుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి. జగన్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించిన వెంటనే నెల్లూరురూరల్ సీటు అడ్వాన్స్ బుకింగ్ చేసుకున్నాడు. ఆ సీటులో మరొకరు దూరకుండా నియోజకవర్గాన్ని తిరిగిందే తిరిగాడు. ఒక్కో ఇంటిని రెండేసిసార్లు చుట్టాడు. నియోజకవర్గంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇప్పుడు నియోజకవర్గంలో జగన్ గాలితో పాటు కోటంరెడ్డి అభ్యర్థిత్వం కూడా బాగానే పనిచేస్తుంది. రూరల్‌లో ఇతర పార్టీల నుండి వైకాపాలోకి వలసలు భారీగా జరిగాయి. ప్రత్యర్థిపార్టీగా తెలుగుదేశం కాకుండా బీజేపీ కావడం కోటం రెడ్డికి కలిసొచ్చినట్లే!

తెలుగుదేశంతో పొత్తులో భాగంగా ఏ మాత్రం బలంలేని నెల్లూరు గ్రామీణ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. పార్టీ పరంగా గట్టి నాయకుడే! కాని రూరల్‌లో పార్టీ కేడర్ అంతంత మాత్రమే. తెలుగుదేశం కేడర్ కూడా పూర్తిగా సహకరించడం లేదు. బీజేపీకి సీటివ్వడంతో రూరల్‌లో కొంత తెలుగుదేశం కేడర్ వైకాపాలోకి వెళ్లిపోయింది. జిల్లాలో వైకాపాకు మొదటిసీటు ఇదేనని చెప్పవచ్చు.






**ఓటర్ల వివరాలు**

| | |
|---|---|
| పురుషులు | 1,29,675 |
| మహిళలు | 1,31,871 |
| ఇతరులు | 24 |
| మొత్తం | 2,61,570 |

**నియోజకవర్గ మండలాలు**

నెల్లూరు రూరల్ మండలంలోని 26డివిజన్‌లు

**రంగంలోని ప్రధానపార్టీ అభ్యర్థులు**

సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి(బీజేపీ)
కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి(వైసీపీ)
ఆనం విజయకుమార్‌రెడ్డి(కాంగ్రెస్)
మాదాల వెంకటేశ్వర్లు(సీపీఎం)

# కావలి... నువ్వా - నేనా

కాంగ్రెస్‌పార్టీకి కంచుకోట లాంటి నియోజకవర్గం. నెల్లూరు జిల్లాకు ఇదొక ఉత్తరం వాకిలి అనుకోవచ్చు. ప్రకాశంజిల్లా సరిహద్దులో నుండే కావలి మొదలవుతుంది. కలికి యానాదిరెడ్డి, గొట్టిపాటి కొండపనాయుడు, మాగుంట పార్వతమ్మ వంటి వాళ్ళు శాసనసభ్యులుగా సేవలందించిన నియోజకవర్గం. జిల్లాలో నెల్లూరు తర్వాత పెద్ద పట్టణం ఇదే! పేరొందిన వస్త్ర వ్యాపార సముదాయాలకు, దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన విశ్వోదయ విద్యాసంస్థలకు కేంద్రం కావలి.

ప్రస్తుత ఎన్నికలలో తెలుగుదేశం అభ్యర్థిగా బీద మస్తాన్‌రావు, వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థిగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా చింతాల వెంకట్రావు పోటీలో వున్నారు. కాంగ్రెస్ గట్టిపోటీలో లేదు. ప్రధానపోటీ తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్‌ల మధ్యే. బీద మస్తాన్‌రావు సిటింగ్‌ఎమ్మెల్యే, గత 5ఏళ్లలో బాగానే పనిచేసాడనే పేరుంది. ప్రజలలో వ్యతిరేకత లేదు. ఈ నియోజకవర్గంలో బి.సి ఓట్లు ఎక్కువుగా వుండడం కూడా బలహీనవర్గాల నాయకుడిగా ఆయనకు కలిసొచ్చే అంశం. కమ్మ సామాజికవర్గం ఓట్లు కూడా బాగానే ఉన్నాయి.

ఇక బిఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిరంతరం సేవా కార్యక్రమాలు నెరుపుతూ ప్రజల మధ్య ఉన్నారు. ఎమ్మెల్యేగా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టివున్నారు. కాంగ్రెస్ బలహీనపడి అల్లూరు, దగదర్తి మండలాల్లో ఆ పార్టీ కేడర్ కొంతవరకు బీదకే పనిచేస్తుంది. ఇక జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులుగా బీద రవిచంద్ర గత ఎన్నికల్లో మాదిరిగానే ఈ ఎన్నికల్లో కూడా తన సోదరుడు విజయం కోసం గట్టిగా కృషి చేస్తున్నాడు.

వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి 2009ఎన్నికల్లో ప్రజారాజ్యం అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయి ఉన్నాడు. వ్యక్తిగతంగా మంచిపేరుంది. దీనికితోడు జగన్ హవా నడుస్తుంది. రెండేళ్ల క్రితమే కావలి నియోజకవర్గ సమన్వయకర్తగా వై.యస్.జగన్ ఆయన్ను ప్రకటించి వున్నారు. అప్పటి నుండి ప్రతాప్ ప్రజాదీవెన పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తూ నియోజకవర్గంలోని ప్రతి పల్లెను చుట్టాడు. ప్రజలతో సంబంధాలు మెరుగుపరుచుకున్నాడు. స్వతహాగా వ్యాపారస్తుడైనప్పటికీ, కొంత కాలం నుండి వాటిని పక్కనపెట్టి, పూర్తిగా కావలి నియోజకవర్గానికే అంకితమై ప్రచారం చేస్తున్నాడు. నియోజకవర్గంలో దళితులు, ముస్లింల ఓట్లు బాగానే వున్నాయి. ముఖ్యంగా కావలి మున్సిపాల్టీ పరిధిలో గట్టి పట్టు లభించింది. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లోనూ కావలి మున్సిపాల్టీలో వైకాపా గెలుస్తుందని ప్రచారం కూడా ఉంది. ఈ ప్రచారం కూడా ప్రతాప్‌కు ఉపయోగపడనుంది. మాజీఎమ్మెల్యే వంటేరు వేణుగోపాలరెడ్డి, మాజీమున్సిపల్ ఛైర్మెన్ గ్రంధి యానాదిశెట్టితో పాటు మరికొందరు నాయకులు వైకాపాలో చేరడం ప్రతాప్‌రెడ్డికి కలిసొచ్చింది. ఇద్దరు నాయకులూ నియోజకవర్గంలో బలంగా తయారయ్యారు. గెలుపు కోసం గట్టిగా కృషి చేస్తున్నారు. అయితే ఇద్దరిలో ఎవరికీ గెలుపు నల్లేరుపై నడక కాదు. ఎవరు గెలిచినా భారీమెజార్టీలు ఉండవు. హోరాహోరీ పోరు నడుస్తుంది.








**నియోజకవర్గ మండలాలు**

కావలి, అల్లూరు, దగదర్తి, బోగోలు.

**రంగంలోని ప్రధానపార్టీ అభ్యర్థులు**

బీద మస్తాన్‌రావు(టీడీపీ)
రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి(వైసీపీ)
చింతాల వెంకట్రావ్(కాంగ్రెస్)
జి.సతీష్‌కుమార్‌రెడ్డి(లోక్‌సత్తా)

**ఓటర్ల వివరాలు**

| | |
|---|---|
| పురుషులు | 1,12,669 |
| మహిళలు | 1,17,089 |
| ఇతరులు | 30 |
| మొత్తం | 2,29,788 |

# సర్వేపల్లి... కాకాణికే పట్టం

ఒకప్పుడు రాజకీయ ప్రాముఖ్యత కలిగిన నియోజకవర్గం. ఇప్పుడు జిల్లాలోనే పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి సాధించిన నియోజకవర్గం. తూర్పున బంగాళాఖాతం నుండి పడమర వెలుగొండ అడవుల దాకా విస్తరించిన నియోజకవర్గం. మొన్నటివరకు ఈ రాష్ట్రంలో పులివెందుల తర్వాత వైకాపా గెలుస్తుందనుకుని అంచనా వేసిన రెండో సీటు. అందుకే ఇక్కడ తెలుగుదేశం పార్టీ నుండి పోటీ చేయడానికి ఎవరూ సాహసించలేదు. చివరకు మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డే తెలుగుదేశం అభ్యర్థిగా రంగంలోకి దిగాల్సి వచ్చింది. ఈ సీటుపై తెలుగుదేశంవాళ్లు ఇంతగా ఆశలు కోల్పోవడానికి ప్రధాన కారణం ఇక్కడ జగన్ గాలి బలంగా వీస్తుందని కాదు, వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ జిల్లా పరిషత్ ఛైర్మెన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి కావడమే. వైకాపాలో చేరినప్పుడే సర్వేపల్లి అభ్యర్థిగా కాకాణి డిసైడయ్యారు. జగన్ గాలి వుంది, జడ్పీ ఛైర్మెన్‌గా విభిన తరహాలో పనిచేసిన కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ప్రత్యేక ఇమేజ్ వచ్చింది. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో కాకాణి సొంత మండలం పొదలకూరు ఈ నియోజకవర్గంలో కలిసింది. ఇది ఆయనకు బాగా కలిసొచ్చే అంశం. అదీగాక రెండేళ్ల నుండి నియోజకవర్గంలో ప్రతి పల్లె తిరుగుతూ, ప్రతి గడప తొక్కుతూ తన పట్టును పెంచుకున్నాడు.

సర్వేపల్లికి పాతకాపే అయినప్పటికి తెలుగుదేశం అభ్యర్థిగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చాలా ఆలస్యంగా దిగాడు. 2009 ఎన్నికల్లో ఇక్కడ నుండి ఓడిపోయిన సోమిరెడ్డి ఇదే నియోజకవర్గాన్ని వీడకుండా కనిపెట్టుకునే ఉండుంటే ఈరోజు పరిస్థితి ఇంకోరకంగా వుండేది. ఆయన స్థితి బలంగానే ఉండేది. మొన్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ఆయన ఇక్కడ పట్టించుకుని పనిచేసున్నా పార్టీ కేడర్ కొంత బలంగా ఉండేది. మొన్నటివరకు నెల్లూరురూరల్ సీటు మీద ప్రయత్నాలు సాగించి ఈరోజు ఒక్కసారిగా తిరిగి సర్వేపల్లికే రావాల్సి వచ్చేసరికి ఆయనకు కొంత కష్టంగానే మారింది. ఆయన సీనియార్టీని, పనితీరులో సిన్సియార్టీని సర్వేపల్లి ప్రజలు ఎంతవరకు గుర్తిస్తారో చూడాలి.

ఇక కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ పట్టాభిరామయ్య పోటీలో వున్నప్పటికి లెక్కలోకి తీసుకోవాల్సిన పని లేదు. ప్రధానపోటీ కాకాణి, సోమిరెడ్డిల మధ్యే! రాజకీయాలలో అప్పుడప్పుడు అద్భుతాలకు కూడా అవకాశముంటుంది. అలాంటిదేదన్నా జరిగితే సోమిరెడ్డి గెలిచే ఛాన్సుంది.

సర్వేపల్లి నియోజకవర్గంలో కాకాణి ఓడిపోవడం, సోమిరెడ్డి గెలవడం అంటూ జరిగితే సీమాంధ్రలో తెలుగుదేశం పార్టీకి 150 సీట్లు ఖాయంగా వస్తాయి. సర్వేపల్లి సీటు మీద వైకాపా శ్రేణులకున్న బలమైన నమ్మకం అటువంటిది. వైకాపా గ్యారంటీగా గెలిచే సీట్లలో సర్వేపల్లి టాప్10లో ఉంది.

**ఓటర్ల వివరాలు**

| | |
|---|---|
| పురుషులు | 1,00,334 |
| మహిళలు | 1,03,438 |
| ఇతరులు | 22 |
| మొత్తం | 2,03,794 |




**నియోజకవర్గ మండలాలు**

సర్వేపల్లి, ముత్తుకూరు, టి.పి.గూడూరు, వెంకటాచలం, మనుబోలు, పొదలకూరు.

**రంగంలోని ప్రధానపార్టీ అభ్యర్థులు**

సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి(టీడీపీ)
కాకాణి గోవర్ధన్‌రెడ్డి (వైసీపీ)
కె. పట్టాభిరామయ్య(కాంగ్రెస్)



# గూడూరు... పాశంకే ప్రాధాన్యం

నేదురుమల్లి, నల్లపరెడ్డి కుటుంబాలు నెలవైన నియోజకవర్గం. నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డిలు రాజకీయ ఓనమాలు దిద్దుకున్న నియోజకవర్గం. పేరుకు ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గమైనప్పటికి రెడ్లు తమ ఆధిపత్యపోరుకు వేదికగా మలచుకున్న ప్రాంతం.

ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పనబాక కృష్ణయ్య, వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థిగా పాశం సునీల్‌కుమార్, తెలుగుదేశం అభ్యర్థిగా డాక్టర్ జ్యోత్స్నలు రంగంలో వున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాదరావుకు తెలుగుదేశంపార్టీ ఈసారి టిక్కెట్ నిరాకరించడంతో ఆయన రెబల్ అభ్యర్థిగా పోటీలోకి దిగి, తెలుగుదేశం నాయకులు బుజ్జగించడంతో విరమించుకున్నారు. అయితే ఇవిఎంలో బల్లి దుర్గాప్రసాద్ పేరు, సింబల్ ఉండడం తెలుగుదేశంకు కొంత మైనస్ కాగలదు. ప్రధానపోటీ మాత్రం వైయస్సార్ కాంగ్రెస్, తెలుగుదేశంల మధ్యే వుంది. కాంగ్రెస్ అభ్యర్థి పనబాక కృష్ణయ్య 2009 ఎన్నికల్లో ఓడిపోయాడు. ఆరోజు నేదురుమల్లి వర్గం ఆయనకు బలంగా వెన్నుపోటు పొడిచింది. ఈ ఎన్నికల్లో కూడా అదే సీను. కాంగ్రెస్ పట్ల జనాల్లో వ్యతిరేకత బలంగా వుంది. గెలిచే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి. తెలుగుదేశం అభ్యర్థి డాక్టర్ జ్యోత్స్నలత నియోజకవర్గానికి కొత్త. పార్టీ ఓట్లపైనే ఆధారపడాలి. పార్టీకి అంత ఊపు లేదు.

వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థిగా పాశం సునీల్‌కుమార్ చాలా కాలం నుండే ప్రచారంలో ఉన్నాడు. పరిచయాలు కూడా విస్తృతంగా వున్నాయి. జగన్ హవా పనిచేస్తుంది. నల్లపరెడ్డి వర్గం ఆయన కోసం గట్టిగా పనిచేస్తుంది. ఇవన్నీ సునీల్‌కు కలిసొచ్చే అంశాలు. తెలుగుదేశంపార్టీ టిక్కెట్ బల్లి దుర్గాప్రసాద్‌కే ఇచ్చుంటే గెలిచినా గెలిచుండేవాడని ప్రచారం ఉంది. గత ఐదేళ్లుగా ఎమ్మెల్యేగా వున్నా ఆయనపై వ్యతిరేకత లేదు. ప్రజలకు అందుబాటులో ఉంటాడనే పేరుంది. స్థానికంగా పరిచయాలు బాగుండడం, వినయవిధేయతలు ప్రదర్శించడం ఆయనకు కలిసొచ్చేది. కాని ఇప్పుడు డాక్టర్ జ్యోత్స్నలతకు టిక్కెట్ ఇవ్వడంతో స్థానిక టీడీపీ కేడర్ ఆమెకు సక్రమంగా పనిచేయడం లేదు. కాంగ్రెస్ నుండి కూడా పెద్దగా పోటీ లేకపోవడంతో పాశం సునీల్‌కు ఇక్కడ పని సులువుగా వుంది. చంద్రబాబు కోటరీ కంభంపాటి రామ్మోహన్‌రావు, గంగా ప్రసాద్‌లు రంగంలోకి దిగి ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్ చేత జ్యోత్స్నలతకు మద్దతుగా పనిచేయిస్తున్నారు. అయితే అది ఎంతవరకు సత్ఫలితాన్నిస్తుందో తెలియడం లేదు. బల్లి పోటీలో ఉంటే ఆ పరిస్థితి వేరుగా ఉండేది. బల్లి ప్రచారం పార్టీకి పెద్దగా ఉపయోగపడకపోవచ్చు. గూడూరు మున్సిపాల్టీ పరిధిలో వైకాపా, తెలుగుదేశంల మధ్య నువ్వా-నేనా అన్నట్లు పోటీ నడిచినా, చిల్లకూరు, కోట, చిట్టమూరు, వాకాడు మండలాల్లో వైకాపా గాలి జోరుగా ఉంది. పాశం సునీల్‌కు ఈసారి ఎమ్మెల్యే అయ్యే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి.

**ఓటర్ల వివరాలు**

| | |
|---|---|
| పురుషులు | 1,05,444 |
| మహిళలు | 1,09,702 |
| ఇతరులు | 28 |
| మొత్తం | 2,15,174 |




**నియోజకవర్గ మండలాలు**

గూడూరు రూరల్, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు

**రంగంలోని ప్రధానపార్టీ అభ్యర్థులు**

బత్తుల రాధాజ్యోత్స్నలత(టీడీపీ)
పాశం సునీల్‌కుమార్(వైసీపీ)
పనబాక కృష్ణయ్య(కాంగ్రెస్)
దందోలు చక్రధర్(జేఎస్పీ)



# ఉదయగిరి... హోరాహోరీ

స్వర్గీయ బెజవాడ గోపాలరెడ్డి, బీజేపీ జాతీయ నాయకులు యం.వెంకయ్యనాయుడు వంటి ఉద్ధండుల చేత రాజకీయంగా అడుగులు వేయించిన నియోజకవర్గమిది. డెల్టా జిల్లాలో వున్న మెట్టప్రాంతం. అభివృద్ధికి దూరంగా వున్నా రాజకీయ చైతన్యానికి కొదువలేదు. ఇక్కడ ప్రజలు ఎంత చైతన్యవంతులంటే... రాజకీయ గాలులు, ప్రభంజనాలు ఇక్కడ పనిచేయవు. దానికి ఉదాహరణ 1983, 1985, 1994ఎన్నికలే. ఎన్టీఆర్ ప్రభంజనంలో జరిగిన ఎన్నికలివి. రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం తరపున అనామకులు కూడా గెలిచారు. కాని ఉదయగిరిలో మాత్రం 1983లో టీడీపీ మూడోస్థానానికి పోయింది. ఆ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి యం.వెంకయ్యనాయుడు, 1985లో కాంగ్రెస్ అభ్యర్థి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, 1994లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా కంభం విజయరామిరెడ్డి విజయం సాధించారు.

ఎంతో చారిత్రక ప్రాధాన్యమున్న ఈ నియోజకవర్గం నుండి ఈసారి వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, తెలుగుదేశం నుండి బొల్లినేని రామారావు, కాంగ్రెస్ నుండి బలహీన వర్గాలకు చెందిన పి.చెంచల బాబుయాదవ్‌లు పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ మూడోస్థానానికి పోవడం ఖాయం. ప్రధానపోటీ వైకాపా, తెలుగుదేశంల మధ్యనే ఉండబోతుంది. రెండేళ్ల క్రితం ఉదయగిరికి జరిగిన ఉపఎన్నికల్లో మేకపాటి చంద్రమోహన్‌రెడ్డి 30వేల ఓట్ల తేడాతో గెలిచారు. ఈసారి అదే ఊపు, అదే మెజార్టీ సాధ్యమేనా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జగన్ హవా వున్నా సిటింగ్ ఎమ్మెల్యేగా మేకపాటి పట్ల కొంత వ్యతిరేకత వుంది. అయితే అది అంతగా ప్రభావం చూపకపోవచ్చనేది అంచనా! ఆల్‌రెడీ జగన్ పార్టీకి ఉపఎన్నికల్లో ఒకసారి ఓటు వేసి ఉండడంతో కొంత ఆ ప్రభావం కూడా తగ్గే అవకాశముంది.

ఇక తెలుగుదేశం అభ్యర్థి బొల్లినేని రామారావు చాలా గట్టిగా పోరాడుతున్నాడు. ముఖ్యంగా పంచాయితీ ఎన్నికలను జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను తెలుగుదేశం కేడర్‌కు అండగా నిలిచాడు. వారికి ఆర్థికంగా చేయూతనందించాడు. పార్టీ కేడర్‌ను కాపాడుకుంటూ కొత్త ఓటుబ్యాంకు వైపు దృష్టి పెట్టాడు. నియోజకవర్గంలో పలు సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు బాగా చేరువయ్యే ప్రయత్నం చేసాడు. కలిగిరి సొంత మండలం కావడం, కాంగ్రెస్ కేడర్ కొంతవరకు కలిసి రావడంతో ఆయన గట్టిగానే ఉన్నాడు. కాంగ్రెస్ బలహీనమైన అభ్యర్థిని నిలబెట్టడంతో ఆ పార్టీ ఓటు బ్యాంకు కూడా చాలావరకు తెలుగుదేశంవైపే మళ్లింది. నియోజకవర్గంలో కమ్మ సామాజికవర్గం ఓట్లు ఎక్కువగా వుండడంతో తెలుగుదేశం అభ్యర్థి గట్టిపోటీనే ఇస్తున్నాడు. ఇటీవల మాజీఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మాజీజడ్పీటీసీ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, కృష్ణారెడ్డి లాంటి నాయకులు చేరడం కూడా తెలుగుదేశాన్ని బలోపేతం చేసింది.

నియోజకవర్గంలో ఉదయగిరి, సీతారాంపురం, వరికుంటపాడు, దుత్తలూరు, కలిగిరి, కొండాపురం, వింజమూరు, జలదంకి మండలాలున్నాయి. అన్ని మండలాల్లోనూ ఇరుపార్టీలకు గట్టికేడర్ వుంది. ఎవరు గెలిచినా మెజార్టీ కొద్దిగానే వుంటుంది. పోటీ మాత్రం హోరాహోరీగానే!








**నియోజకవర్గ మండలాలు**

ఉదయగిరి, సీతారాంపురం, దుత్తలూరు, వరికుంటపాడు, వింజమూరు, కలిగిరి, కొండాపురం, జలదంకి

**రంగంలోని ప్రధానపార్టీ అభ్యర్థులు**

బొల్లినేని రామారావు(టీడీపీ)
మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి(వైసీపీ)
చెంచలబాబుయాదవ్(కాంగ్రెస్)
వెంకటకృష్ణారావు(జేఎస్పీ)

**ఓటర్ల వివరాలు**

| | |
|---|---|
| పురుషులు | 1,13,255 |
| మహిళలు | 1,12,795 |
| ఇతరులు | 9 |
| మొత్తం | 2,26,059 |

### విభజనలో నిందితులు వారైనా...

# నిందలు కాంగ్రెస్‌పైనే!

సింహపురి సమాచారం

**- బహిరంగసభలో చిరంజీవి**



రాష్ట్ర విభజనలో ప్రధాన నిందితులు బీజేపీ, తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలే అయినా నిందను మాత్రం కాంగ్రెస్ మీద మోపుతున్నారని కేంద్రమంత్రి, రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ ప్రచార సారధి కొణిదెల చిరంజీవి ఆరోపించారు.

మంగళవారం కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులకు మద్దతుగా నెల్లూరులోని వి.ఆర్ హైస్కూల్ మైదానంలో జరిగిన బహిరంగసభలో ఆయన ప్రసంగించారు. మీరు ఇస్తారా లేక మమ్మల్ని ఇవ్వమంటారా అంటూ తెలంగాణపై బీజేపీ పదేపదే తొందర చేసిందని, తెలంగాణ ఏర్పాటు చేయాలని చంద్రబాబు లేఖ వ్రాసారని, తెలంగాణను ఏర్పాటు చేయాలంటూ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ వాళ్ళు ఇడుపులపాయ ప్లీనరీలో తీర్మానం చేసారని, వీరందరూ చెప్పాకే కేంద్రం తెలంగాణ ఏర్పాటుకు ఆమోదం తెలిపిందన్నారు. అయితే ఈరోజు అన్ని పార్టీలు విభజనపై మాటమార్చి కాంగ్రెస్‌ను దోషిగా నిలబెట్టాలని చూస్తున్నాయని, దీనిని ప్రజలు తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ రాష్ట్రంలో సొంతంగా గెలవగల సత్తా చంద్రబాబుకు లేదని, అందుకే పాకులాడి మరీ బీజేపీతో పొత్తు పెట్టుకున్నారని ఆయన విమర్శించారు. గుజరాత్ అల్లర్ల తర్వాత బీజేపీతో ఈ జన్మలో కలవబోనని చెప్పిన చంద్రబాబు మళ్లీ ఏ ముఖం పెట్టుకుని వారితో కలిసాడని ప్రశ్నించారు. తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకున్న వై.యస్.జగన్మోహన్‌రెడ్డి సీఎం అయితే ఈ రాష్ట్రంలో దోపిడీకి అడ్డే ఉండదన్నారు. ఐదు సంతకాలతో ఆయన పంచభూతాలను కూడా అమ్మేస్తాడన్నారు. బీజేపీ, జగన్‌ల మధ్య రహస్య ఒప్పందం ఉందని, ఎన్నికల తర్వాత కేంద్రంలో గనుక ఎన్డీఏ అధికారంలోకి వస్తే నరేంద్రమోడీతో చేతులు కలపడానికి జగన్ సిద్ధంగా వున్నాడని, ముస్లింలను జగన్ మోసం చేయబోతున్నాడని అన్నారు. నరేంద్ర మోడీ వంటి మతతత్వ వాది ప్రధాని అయితే ఈ దేశంలో మతసమైక్యత విచ్ఛిన్నమవుతుందన్నారు. ఈ దేశంలో అన్ని వర్గాలు, అన్ని కులాలు అన్ని మతాల వారు అభివృద్ధి సాధించింది కాంగ్రెస్ పాలనలోనేనని, ఈ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ సభలో మాజీమంత్రులు సి.రామచంద్రయ్య, డొక్కా మాణిక్యవరప్రసాద్, సి.రామచంద్రయ్య, లోక్‌సభ అభ్యర్థి వాకాటి నారాయణరెడ్డి, నెల్లూరు నగరం, రూరల్ అభ్యర్థులు ఏ.సి.సుబ్బారెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి, డీసీసీబీ ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, మాజీమేయర్ భానుశ్రీ, ఎమ్మెల్యే ఆనం వివేకాలు పాల్గొన్నారు.

# సంక్షేమ రాజ్యం జగనన్నకే సాధ్యం

**కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి**



నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గత నెల 27వ తేదీ 37, 27, 28 డివిజన్‌లలో వై.యస్.ఆర్.కాంగ్రెస్‌పార్టీ నెల్లూరు రూరల్ ఎమ్.ఎల్.ఎ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఆపద వస్తే, కష్టం వస్తే ఒక్క ఫోన్ కాల్ చేస్తే మన మధ్యకు వచ్చే దివంగత మహానేత వై.యస్. ప్రవేశపెట్టిన 108, 104 వాహనాలు డీజిల్ డబ్బులులేక మూలన పడి ఉన్నాయని పేర్కొన్నారు. అనేక వాహనాలకు రిపేర్లు వచ్చి ఆగిపోయాయని, వాటి మీద దృష్టిపెట్టి ప్రజలకు ఉపయోగపడాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని విస్మరించి తమ ప్రభుత్వ ప్రచార ఆర్భాటాలకు వందలకోట్లతో ప్రచార రథాలు తిప్పటం దుర్మార్గం అని కాంగ్రెస్ ప్రభుత్వ కిరాతకాలకు ఇది ఒక నిదర్శనం అని అన్నారు. ఆరోగ్యశ్రీలో 133జబ్బులు తొలగించారని, వడ్డీలేని రుణాలు అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే చెక్కులు బ్యాంకులలో పాస్‌కావటంలేదని, అమ్మహస్తం కింద అందించే సరుకులు నాశిరకంగా ఉన్నాయని కేవలం ప్రచార ఆర్భాటం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం సాధించింది ఏమీలేదని విమర్శించారు. కానీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ బోగస్ ప్రచారాలకు ఊరువాడ హోరెత్తించే దానికి వందల కోట్ల ప్రజాధనాన్ని నీళ్ళలాగా ఖర్చు పెట్టేదానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించిందని అన్నారు. అటువంటి కుటిల యత్నాలను తిప్పికొడుతూ ప్రజలందరూ వారి పక్షాన నిలిచే వైఎస్సార్సీపీని గెలిపించి జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేద్దామన్నారు.

ఈ కార్యక్రమంలో వైయస్ఆర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



పితృదేవోభవ
సంఘసేవకులు, ప్రజాసేవకులు
స్వర్గీయ తిక్కవరపు బాబురెడ్డి గారు
నిర్యాణం 4 మే 1992
22వ వర్ధంతి (04.05.14) సందర్భంగా
వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ...
డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి
రాజ్యసభసభ్యులు, మాజీ కేంద్రమంత్రివర్యులు
కుమారుడు

# 'లెజెండ్' ప్రచారంలో హెల్మెట్లు

గల్పిక

రెండు రాష్ట్రాల ఉమ్మడి రాజధాని హైదరాబాద్ నగరం. ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌లో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. కొందరు కెమెరాలు సెట్ చేసుకుంటున్నారు, లైట్‌బాయ్‌లు లైట్లు పట్టుకుని అటూ ఇటూ పరుగులు తీస్తున్నారు. దర్శకుడు కె.రాఘవేంద్రరావు పర్యవేక్షణలో అక్కడ తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రచారానికి సంబంధించిన ప్రకటనలు చిత్రీకరిస్తున్నారు.

**మల్లయ్యా :** ఏం ఎల్లన్నా నీ గేదె సూడిదైందా...

**ఎల్లయ్య :** లేదు మల్లయ్య... చాలా దిగులుగా వుంది.

**మల్లయ్యా :** నువ్వేం దిగులుపడకు ఎల్లన్నా... మన కోసం ఆయన మళ్ళీ వస్తున్నాడు. మన కష్టాలన్నీ తీరుస్తాడు.

**ఎల్లయ్య :** అవును ఆయనే రావాలి, నాతోపాటు నా గేదె కష్టాలు కూడా తీరిపోవాలి.

**ఇద్దరూ కోరస్‌గా...**

**తెలుగుదేశంకే ఓటేద్దాం... చంద్రబాబును సీఎంగా చేద్దాం.**

రెండో ప్రకటన

**సుబ్బమ్మ :** ఏంటే రత్తాలు... దిగులుగా ఉన్నావు.

**రత్తాలు :** ఏముంది పిన్నీ... రాత్రి మా ఆయన గంజాయి తెస్తుంటే పోలీసులు పట్టుకున్నారు. ఎలా విడిపించాలో తెలియక బాధపడుతున్నా...

**సుబ్బమ్మ :** మరి నువ్వెందుకే మంగీ అలా ఏడుస్తున్నావ్...

**మంగమ్మ :** నిన్న మా సచ్చినోడు పొలాల్లో పేకాడుతుంటే పోలీసులు పట్టుకుపోయారే...

**సుబ్బమ్మ :** మరి మీ ఆయన స్టేషన్‌లోనే ఉన్నాడా?

**మంగమ్మ :** వాళ్లు ఆ సచ్చినోడిని పట్టుకపోయినా బాగుణ్ణు... వాడిని వదిలేసి వాడు పేకాట్లో పెట్టడం కోసం తీసుకెళ్లిన నా నాలుగు బంగారు గాజులను పట్టుకెళ్లారే...

**సుబ్బమ్మ :** మీరేం బాధపడొద్దు. మన కష్టాలు త్వరలోనే తీరబోతున్నాయి. మన కోసం ఆయనొస్తున్నాడు.

**మంగమ్మ :** ఎవరే ఆయన..?

**సుబ్బమ్మ :** ఇంకెవరు మన చంద్రన్న...

**ముగ్గురూ కోరస్‌గా...**

**అవును చంద్రన్న రావాలి... మన కష్టాలు తొలగాలి.**

ఈ రెండు ప్రకటనలలో కూడా చంద్రబాబు సమరసింహారెడ్డిలో బాలకృష్ణ మాదిరిగా నడిచివచ్చే సీన్‌లను షూట్ చేసారు. ఆరోజుకు షూటింగ్ పూర్తి కావడంతో చంద్రబాబు తన ఛాంబర్‌లో కూర్చున్నాడు. రాష్ట్ర వ్యాప్తంగా అభ్యర్థుల సీట్ల విషయమై మాట్లాడ్డానికి సీఎం రమేష్, సుజనాచౌదరి, కంభంపాటి రామ్మోహన్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితర నేతలు ఆయనకెదురుగా కూర్చున్నారు. అంతలో చంద్రబాబు సెల్‌ఫోన్ రింగయ్యింది. బాబు ఫోన్ ఎత్తాడు. అవతల నుండి బాలకృష్ణ... బావా, నేనొస్తున్నా, ప్రచారానికి సుడిగాలిలా దూసుకొస్తా... రాష్ట్రమంతటా తిరుగుతా... అడ్డొచ్చిన వారిని అడ్డంగా నరికేస్తా... నీ శత్రువులను కంటిచూపుతో చంపేస్తా... తొడగొట్టి నీ రాజకీయ ప్రత్యర్థుల గుండెల్లో దడపుట్టిస్తా... నిన్ను సీఎంను చేసే దాకా నేను నిద్రపోను, నిన్ను నిద్రపోనివ్వను, మన పార్టీ వాళ్లను కూడా ఎవరినీ నిద్రపోవద్దని చెప్పు అని ఫోన్ పెట్టేసాడు. బాలకృష్ణ ఫోన్ దెబ్బకు చంద్రబాబుకు చెమటలు పట్టసాగాయి. ఒంట్లో వణుకు మొదలైంది. సుజనాచౌదరి అది చూసి... ఏంటి సార్, అంతలా వణికిపోతున్నారని అడిగాడు. బాలకృష్ణ ఫోన్ గురించి చంద్రబాబు చెప్పాడు. బాలకృష్ణ ప్రచారానికి వస్తే మంచిదేగా అని సుజనాచౌదరి అన్నాడు. అప్పుడు చంద్రబాబు... బాలయ్య సంగతి నీకు పూర్తిగా తెలీదు... మనలాగా రాజకీయ మాయోపాయాలు తెలిసిన మనిషి కాదు. కడుపులో కత్తులు పెట్టుకుని కళ్లతో ప్రేమ నటించే రకం కాదు. ఎవరిమీదన్నా కోపం వచ్చిందంటే అక్కడే కొట్టేస్తాడు. పార్టీకి ఓట్లు రావడం మాట అటుంచి అతని కొట్టుడు వల్ల వచ్చే ఓట్లు కూడా పోతాయని భయపడసాగాడు. అప్పుడు కంభంపాటి రామ్మోహన్‌రావు ఉండి... సార్, బాలయ్యబాబు రాష్ట్రమంతా తిరిగితేనే కదా సమస్య, మనం ఆ సమస్య లేకుండా ఉండడం కోసం ఆయనను ఒక అసెంబ్లీకే పరిమితం చేద్దాం. ఏదో ఒక అసెంబ్లీ నుండి పోటీకి దింపితే ఆయన అక్కడే తిరుగుతుంటాడు. మిగతా నియోజకవర్గాలలో సమస్య ఉండదన్నాడు. చంద్రబాబుకు ఆ ఐడియా నచ్చింది. వెంటనే ఆయనను హిందూపురం అసెంబ్లీ అభ్యర్థిగా ప్రకటించేసాడు.

★★★★★

మదనపల్లిలో రాజంపేట బీజేపీ అభ్యర్థి దగ్గుపాటి పురంధేశ్వరి ప్రచారంలో ఉంది. ఆమె ఓ ఇంట్లో టిఫిన్ చేసి అక్కడేవున్న దినపత్రికను చేతిలోకి తీసుకుంది. 'పార్టీ ఆదేశిస్తే పురంధేశ్వరికి ప్రచారం చేస్తా – బాలకృష్ణ' అనే వార్త వుంది. అది చూసి పురంధేశ్వరికి గుండెల్లో గూడ్స్‌రైళ్లు పరుగెత్తాయి. చంద్రబాబుకు తన మీద కోపం ఉంది, ఆ కోపంతో ఆయన తమ మీద పగతీర్చుకోవడానికి బాలకృష్ణను ప్రచారానికి పంపినా పంపొచ్చు... దీనినుండి బయటపడాలంటే ఒకటే మార్గం అనుకుని వెంటనే సెల్‌ఫోన్ తీసి బాలకృష్ణకు ఫోన్‌చేసింది. బాలయ్య ఫోన్ ఎత్తాడు. తమ్ముడూ, నేను పురంధేశ్వరిని, నా నియోజకవర్గంలో నువ్వు ప్రచారానికి రావాలి... నువ్వొచ్చి ప్రచారం చేస్తేనేగాని ఇక్కడ నేను గెలిచేటట్లు లేను అని వేడుకుంది. అప్పుడు బాలయ్య ఆలోచనలో పడ్డాడు. నేను ప్రచారానికి పోకుంటే అక్క ఓడిపోతుంది, అది తన బావ చంద్రబాబుకు ఆనందాన్ని కలిగిస్తుంది... బావ కళ్ళల్లో ఆనందం చూడాలంటే అక్క పురంధేశ్వరి ఓడిపోవాలి, ఆమె ఓడిపోవాలంటే తాను ప్రచారానికి పోకూడదు అని నిర్ణయించుకుని పురంధేశ్వరితో... నువ్వు ఎంతగానైనా బ్రతిమలాడు, చంద్రబాబు చెప్పినా సరే నేను నీకు ప్రచారం చేసేదిలేదని చెప్పి ఫోన్ పెట్టేసాడు... ఆ మాటలు విని పురంధేశ్వరి గుండెల నిండాగాలి పీల్చుకుంది.

★★★★★

చంద్రబాబు ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌లో కూర్చుని ఉన్నాడు. సీఎం రమేష్ పరుగెత్తుకుంటూ వచ్చాడు. ఏమైంది రమేష్ అని చంద్రబాబు అడిగాడు. దానికి అతను... హిందూపురం నుండి మన కార్యకర్తలు బస్సులు వేసుకుని మరీ వచ్చార్సార్ అని చెప్పాడు. ఎందుకని చంద్రబాబు అడిగాడు. హెల్మెట్లు లేనిదే బాలయ్య వెంట ప్రచారానికి పోలేరట.. ఆయన ఎప్పుడు ఎవరి చెంపలు వాయిస్తాడో అర్థంకాక ఆందోళన చెందుతున్నారు. ఆయన వెంట తిరగాలంటే తలా ఒక హెల్మెట్ కావాలట అని చెప్పాడు. ఇంత మందికి హెల్మెట్లా... అంటూ చంద్రబాబు నోరు తెరిచాడు.

---

## కదంబం

# హైకూలు

**మోపూరు పెంచల నరసింహం, నెల్లూరు, 9346393501.**

కోయిల పాట
ఆకుపచ్చని తోట
ఆమని ఆట





కనిపించని
తీరపు అడుగులు
బాల్యస్మృతులు

చీకటి తెరపై
వెండి సంతకము
పున్నమి రేయి





ఆకాశం నుండి
శర పరంపర
వర్ష బాణాలు

కొమ్మ కొమ్మలో
పిట్టల సరాగాలు
స్మృతుల గ్రంథం





గుప్పుమంటున్న
పరిమళాల వాన
పూల నవ్వులు

---

### నీతివంతమైన ఓటు...

# పటిష్టమైన ప్రజాస్వామ్యానికి చోటు

## ఓటు వినియోగంపై కవిసమ్మేళనం - జేసీ రేఖారాణి




సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని నెల్లూరు పురమందిరంలో గత నెల 26న జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ఓటర్లను చైతన్యపరిచే విధంగా నీతివంతమైన ఓటుపై కవిసమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ రేఖారాణి మాట్లాడుతూ మే 7వ తేదీన జరిగే పోలింగ్‌లో ప్రతి ఒక్క ఓటరూ నోటులేని ఓటును వినియోగించుకొని పటిష్టమైన ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పరచుకోవాలన్నారు. పొదుపు మహిళలు ఈ ప్రక్రియలో ప్రధానపాత్ర పోషించాలని పేర్కొన్నారు. తదుపరి జిల్లాలోని పలువురు కవులు, కవయిత్రులు ఓటర్లను చైతన్యపరిచే విధంగా తమ కవితలను చదివారు. ఈ సందర్భంలో కళాదీప్తి డ్యాన్స్ అకాడమీ చిన్నారులు గ్రీష్మ, రిషితలు చేసిన నృత్యప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో ట్రైనీ జేసీ ఇంతియాజ్, ఏజేసీ సాల్మన్‌రాజ్‌కుమార్, పొదుపు నగర సమాఖ్య అధ్యక్షులు శోభారాణి, కవులు డాక్టర్ ఈదూరు సుధాకర్, పాతూరి అన్నపూర్ణ, ఊరుబిండి వెంకటసుబ్రహ్మణ్యశాస్త్రి, వేలూరు వరకుమార్, తిక్కవరపు సుకుమార్‌రెడ్డి, జి.సుభద్రాదేవి, ప్రవల్లిక, పద్మనాభరావు, జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానంపై కవితలపోటీ

మే8న ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా "రక్తదానమే ప్రాణదానం" అన్న అంశంపై కవితల పోటీ నిర్వహిస్తున్నట్లు నెల్లూరు రెడ్‌క్రాస్ రక్తనిధి కన్వీనర్ డాక్టర్ ఈదూరు సుధాకర్ గత నెల 28న ప్రకటించారు. మే2లోపు 20పంక్తులకు మించని కవితలను నెల్లూరు మద్రాసుబస్టాండు సమీపంలోగల రెడ్‌క్రాస్ కార్యాలయానికి పంపాలని తెలిపారు. వివరాలకు 9347109266లో సంప్రదించమని తెలిపారు. "రక్తదానమే ప్రాణదానం" కవితల పోటీ, రెడ్‌క్రాస్ రక్తనిధి, మద్రాస్‌బస్టాండ్ దగ్గర, నెల్లూరు చిరునామాకు పోస్టులో పంపవచ్చని తెలిపారు.

---

### మే నెల 4 నుంచి...

# జగద్గురు ఆదిశంకర జయంత్యుత్సవములు



నెల్లూరులోని తిప్పరాజు వెంకట సుబ్బయ్య కల్యాణసదన్‌లో మే నెల 4 నుండి 8వ తేదీ వరకు శ్రీ పినాకిని విద్యాపీఠము ఆధ్వర్యంలో జగద్గురు ఆదిశంకర జయంత్యుత్సవములు జరుగనున్నాయి. ప్రతిరోజు ఉదయం మహాన్యాసపూర్వక ఏకాదశ పూర్ణ దార రుద్రాభిషేకములు, వేదపారాయణలు, భాష్యప్రవచనములు తదితర విశేష కార్యక్రమములు, సాయంత్రం సుప్రసిద్ధ పండితులచే ఆధ్యాత్మిక ఉపన్యాసములు, తీర్థప్రసాదాల వితరణ వుంటుందని శ్రీ పినాకిని విద్యాపీఠము కార్యదర్శి దూబగుంట ప్రభాకరరావు అధ్యక్షులు స్వయంపాకుల శ్రీనివాసులు తెలిపారు. 4వతేది రాజమండ్రికి చెందిన జ్ఞాన సరస్వతి డా॥ప్రభవ సుబ్రహ్మణ్యశర్మ అధ్యాస ఆత్మకతత్వము, 5వతేది అద్వైతము సగుణోపాసనలపై ఉపన్యసిస్తారని తెలిపారు. 6వతేదీ కావలి వాస్తవ్యులు జవహర్‌భారతి కళాశాల విశ్రాంత ఆంధ్రభాష అధ్యాపకులు గొట్టుముక్కల రామకృష్ణమూర్తి ప్రస్థానత్రయము, శంకరభాష్య వైభవముపై ఉపన్యసిస్తారని, 7,8 తేదీలలో విజయవాడకు చెందిన సాహిత్య విద్యాప్రవీణ హరిశ్రీరామమూర్తి "విష్ణుసహస్రనామస్తోత్రము – గీతార్థ సమన్వయము" "భజగోవింద స్తోత్రము – వేదాంతార్థము"లపై ప్రసంగిస్తారని తెలిపారు. 6వతేదీ ఉదయం మహిళలచే శ్రీ లలితాసహస్ర నామ కుంకుమార్చన జరుగుతుందని, 8వతేదీ వేదపండితసభ–సమ్మానములు జరుగుతాయని పేర్కొన్నారు. డా॥సర్వేపల్లి అజయ్‌కుమార్ వితరణతో ఈ కార్యక్రమములన్నింటికి ఉచిత వసతి, విద్యుత్ సౌకర్యములు ఏర్పాటుచేయడం జరుగుతుందని, అందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేసారు.

# పురమందిరంలో మే8న టాగూర్ జయంతి

నెల్లూరు పురమందిరంలో వర్ధమాన సమాజం ఆధ్వర్యంలో ఈ నెల 8న రవీంద్రనాథ్ టాగూర్ జయంతి సభ జరుగుతుందని కార్యదర్శి మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సర్వోదయ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ కాళిదాసు పురుషోత్తం ఉపన్యాసకులుగా పాల్గొంటారని తెలిపారు. నెల్లూరు పురప్రజలు, సాహిత్యాభిమానులు పాల్గొని జయప్రదం చేయమని కోరారు.



## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 02.05.2014 నుండి**
**తేది. 08.05.2014 వరకు**

ఈ వారం మేషంలో రవిబుధకేతువులు, 4వతేది నుండి వృషభంలో బుధుడు, మిథునంలో గురువు, కన్యలో కేతువు, తులలో శనిరాహువులు, మీనరాశిలో శుక్రుడు సంచరిస్తారు.

పంచాంగము: 4వతేదీన డొల్లుకర్తరి ప్రారంభము, జగద్గురు ఆదిశంకర జయంతి మరియు జగద్గురు రామానుజాచార్య జయంతి.
విశేష వివరణ. శ్రీ శంకరజయంతి నాడు ఆర్ధ్రనక్షత్రమున్న కారణముగా శాస్త్రబద్ధమగు ముహూర్తమేదిలేదు. కావున ఉదయం ముహూర్తములేదు.
ముహుర్తము: తేది 2 ఉదయం గం॥6.45ల నుండి 8గం॥30ని॥లోగా వృషభ లగ్నమున వ్యాపార గృహారంభములు. రాత్రి గం॥9.17ని॥ల నుండి 11గం॥25ని॥లలోగా ధనుర్లగ్నమున గృహప్రవేశము. ( మే నెల 2వతేది తరువాత శంకుస్థాపన లగ్నములు డిసెంబరు వరకు లేవు), తేది 8 గురువారం ఉదయం 8.14ని॥ల నుండి 10.20ని॥లలోగా మిథునలగ్నమున వివాహ వ్యాపారములు.

### వైశాఖ మాస శుక్ల పక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 02 | శుక్ర | తదియ | ప॥గం.11.30వ॥ |
| తేది. 03 | శని | చతుర్థి | ప॥గం.12.37వ॥ |
| తేది. 04 | ఆది | పంచమి | ప॥గం.2.00వ॥ |
| తేది. 05 | సోమ | షష్ఠి | సా॥గం.3.48వ॥ |
| తేది. 06 | మంగళ | సప్తమి | సా॥గం.5.46వ॥ |
| తేది. 07 | బుధ | అష్టమి | రా॥గం.7.52వ॥ |
| తేది. 08 | గురు | నవమి | రా॥గం.9.47వ॥ |

### మేషం

అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఉద్యోగ నిర్వహణలో సామర్థ్యం గుర్తింపు బాగుంటాయి. సోదరవర్గంతో సన్నిహితంగా ఉండటం, గత సమస్యలను పరిష్కరించుకొనడం జరుగుతుంది. ఆర్థిక పరిస్థితి సమతుల్యంలో ఉంటుంది. కొన్ని అనవసర ఖర్చులు తగ్గించుకొంటారు. వృత్తి వ్యాపారములందు అభివృద్ధి, అవకాశాలు బాగుంటాయి. చేపట్టిన పనులకు ఇబ్బందులు కలిగినా అధిగమించి సానుకూలం చేసుకొంటారు.

### వృషభం

కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

దూరప్రయాణాలుండగలవు. స్థిరాస్తుల క్రయవిక్రయాలను ఖరారు చేస్తారు. దైవకార్యములందు పాల్గొంటారు. మరియు మంచి పనులకు ఆర్థిక సహాయమందించగలరు. వృత్తి ఉపాధి కార్యములందు అభివృద్ధి ప్రోత్సాహం బాగుంటుంది. ఆదాయం పెరుగుతుంది. మంచి వ్యాపార అవకాశాలు దొరుకుతాయి. బంధుమిత్రులను కలుసుకొనడం ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి.

### మిధునం

మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

బిడ్డల విద్యా ఉద్యోగ వివాహ విషయాలపై దృష్టి పెట్టి ప్రయత్నిస్తారు. పట్టుదలతో అనుకున్న పనులు సాధించడం, రావలసిన బాకీలు కొంత వసూలుకావడం జరుగుతుంది. ఆర్థికంగా బాగుంటుంది. వృత్తిపరంగా, వ్యాపారపరంగా అభివృద్ధి అవకాశాలు దొరుకుతాయి. ఆదాయం పెరుగుతుంది. దైవ సామాజిక సేవలందు పాల్గొంటారు. అసోసియేషన్ బాధ్యతలు లభించగలవు.

### కర్కాటకం

పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

స్థిరాస్తుల క్రయవిక్రయాలుంటాయి. గృహవస్తు వాహన రిపేర్లు ఖర్చులుంటాయి. శుక్ర ఆదివారముల మధ్య ఆరోగ్యం కూడా సరిగా ఉండదు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. అయితే మంచి ఖర్చు కూడా ఒకటి ఉంటుంది. శుభకార్యాలలో పాల్గొనడం బంధుమిత్రులను కలుసుకొనడం జరుగుతుంది. విద్యార్థులు ప్రగతి కొరకు కష్టపడతారు.

### సింహం

మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. మీపై గల అభియోగాలు విమర్శలు తొలగిపోతాయి. గృహోపకరణాలు, విలువైన వస్తు వాహనాలు కొంటారు. అనుకున్న పనులు సులభంగా నెరవేరగలవు. దైవకార్యాలు, సామాజిక కార్యాలలోను శుభకార్యాలలో ప్రముఖ భూమిక వహిస్తారు. తీసుకొనే నిర్ణయాలు సత్ఫలితాలనిస్తాయి. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉండి ఆదాయం పెరుగుతుంది.

### కన్య

ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఉద్యోగులు అధికారులతోను పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగండి. ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూ అవకాశాలు రాగలవు. ముఖ్యపత్రాలు నోటీసులు అందుకొంటారు. ఆర్థికంగా బాగుండినా, అదనపు ఖర్చులను నిలువరించలేరు. శుభకార్యాల ఖర్చులు, ప్రయాణాల ఖర్చులుంటాయి. వ్యాపార రంగములో కొత్త ఆలోచనలతో ప్రణాళికలను తయారుచేస్తారు.

### తుల

చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

కుటుంబసభ్యులతో అనుకూలత తక్కువ పట్టుదల, కోపం టెన్షన్ వదిలిపెట్టి సామరస్యంగా మెలగండి. అనుకున్న పనులు మీ ఆలోచనలకు తగ్గట్లు జరగవు. ఆస్థి వ్యవహారాలు, కోర్టు వ్యవహారాలు రాజీకివస్తాయి. వ్యాపారవర్గాలవారు అభివృద్ధి పథకాలు ప్రణాళికలలో నిమగ్నం అగుదురు. వృత్తి వ్యాపారాలలో ఆదాయము బాగుంటుంది.

### వృశ్చికం

విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

గృహవస్తు వాహన రిపేర్లుంటాయి. కోర్టు కేసులు, రావలసిన బాకీలు వాయిదాపడగలవు. పనుల సానుకూలతకు శ్రమ ఎక్కువ తీసుకొనవలసి ఉంటుంది. వ్యాపార విస్తరణకు డబ్బు పెట్టుబడులు, భాగస్వామ్య వ్యాపారాలకు తొందరపడకండి. వృత్తిపరంగా బాగుండి ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. వ్యాపారాలలో పోటీవల్ల అవకాశాలు చేజారవచ్చును. ఈ వారం ఖర్చులు పెరుగుతాయి.

### ధనుస్సు

మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

శుభకార్య నిర్ణయాలు జరుగుతాయి. క్రొత్త పరిచయాలు జరుగుతాయి. బంధుమిత్రులకు సహకారము సహాయము అందిస్తారు. స్త్రీలు ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించండి. మీ పనులు, ఇచ్చే సలహాల వల్ల గౌరవ ప్రతిష్టలు వృద్ధి పొందుతారు. వాణిజ్యపరంగా మంచి అవకాశాలు రావడం, ఆదాయం పెరగడం ఉంటుంది. క్రొత్త పెట్టుబడులు, పథకాలపై దృష్టిపెడతారు.

### మకరం

ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ప్రభుత్వ కార్యాలయాలలో అనుమతులు ఆలస్యం కాగలవు. కుటుంబసభ్యులకు, ముఖ్యంగా స్త్రీలకు అనారోగ్య బాధలుంటాయి. సన్నిహితులు సరైన సలహాలివ్వక తప్పుదారి పట్టించే అవకాశమున్నది. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఉండి ఆధాయం పెరుగుతుంది. శుభకార్యాలలో పాల్గొంటారు. ఈ వారం ఎక్కువగా అదనపు ఖర్చులుంటాయి.

### కుంభం

ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

కుటుంబసౌఖ్యం బాగుంటుంది. శుభకార్య తేదీలు నిర్ణయం కావడం జరుగుతుంది. మిమ్మల్ని వ్యతిరేకించిన వారే దగ్గరౌతారు. అనుకున్న పనులు సక్రమంగా జరగడము. శ్రమకు సామర్థ్యానికి గుర్తింపు లభిస్తుంది. ఆర్థిక వ్యవహారాలను పరిష్కరించుకొంటారు. దైవ, సమాజ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. కొద్ది మందితో భేదాలున్నా సర్దుకొనిపోండి.

### మీనం

పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

అవసరాలకు కొద్దిపాటి ఋణాలు చేయవలసి రావచ్చును. అయితే అనుకోని అవకాశాలు దొరకడం, ఖర్చులను ప్రణాళికాబద్ధంగా పెట్టడం జరుగుతుంది. ఏ పనైనా తొందరపాటు లేకుండా మెలకువతో నడపండి. యాజమాన్యాలకు పనివార్లతో సమస్యలుండగలవు. వ్యాపారవర్గాలకు ఇబ్బందులు, అవకాశాలు తప్పిపోవడం, ఆదాయం తగ్గడముంటుంది. ఆరోగ్యం బాగుంటుంది.

# ఎన్డీఏతోనే సీమాంధ్ర అభివృద్ధి



కేంద్రంలో ఎన్డీఏ అధికారంలోకి వచ్చాక సీమాంధ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను రూపొందించడం జరుగుతుందని బీజేపీ జాతీయ నాయకులు యం.వెంకయ్యనాయుడు చెప్పారు. సోమవారం నెల్లూరులోని తన ఇంట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంటులో ఏకపక్షంగా రాష్ట్ర విభజనకు పూనుకున్న కాంగ్రెస్ ప్రయత్నాలను తాము అడ్డుకున్నామన్నారు. పార్లమెంటులో బీజేపీ చేసిన పోరాటం వల్లే సీమాంధ్రకు న్యాయం జరిగిందన్నారు. సీమాంధ్రకు ప్రత్యేకరాష్ట్రం హోదా రావడం ఆషామాషీ కాదని, తమ ప్రయత్నాల వల్లే అది సాధ్యమైందన్నారు. ఎన్డీఏ అధికారంలోకి రాగానే సీమాంధ్రకున్న 5ఏళ్ల ప్రతిపత్తిని పదేళ్లకు పొడిగిస్తామన్నారు. రాష్ట్ర విభజన జరిగాక సీమాంధ్రకు ఏర్పడే రెవెన్యూ లోటును భర్తీ చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్డీఏ అధికారంలోకి వచ్చాక సీమాంధ్రలో చేసుకోవాల్సిన పనులు చాలావున్నాయి. చెన్నై-వైజాగ్ పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. పెట్రో కెమికల్ కారిడార్ ద్వారా లక్షకోట్ల ఆదాయం వస్తుంది. కేంద్ర ప్రభుత్వ సంస్థలనన్నింటినీ సీమాంధ్రకు తీసుకురావాల్సి వుందని చెప్పారు. ఆరోగ్యం బాగాలేకపోయినా రెండు లక్ష్యాల కోసం మండుటెండలను కూడా లెక్కచేయకుండా తిరుగుతున్నాను. మొదటిది బీజేపీ మళ్ళీ అధికారంలోకి రావాలి, నాటి వాజ్‌పేయి పథకాలన్నింటిని తిరిగి ప్రవేశపెట్టాలి. నదుల అనుసంధానం జరగాలి. రెండోది విడిపోయిన తెలంగాణ, సీమాంధ్రలను సంపన్నవంతమైన రాష్ట్రాలుగా చూడడమని చెప్పారు. సీమాంధ్ర అభివృద్ధి కోసం కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రధాని కావాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు.

ఈ సమావేశంలో నెల్లూరురూరల్ బీజేపీ అభ్యర్థి సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పెరుగుతున్న విద్యుత్ అవసరాలు



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ఎం.వై.యస్.ప్రసాద్ తదితరులు

ఆధునిక సమాజంలో ప్రతి వ్యవస్థ పనితీరు కూడా విద్యుత్ పైనే ఆధారపడి ఉందని ఏపిసిడిసిఎల్ విశ్రాంత పర్యవేక్షక ఇంజనీర్ వివేకానంద పేర్కొన్నారు. శ్రీహరికోట షార్ సెంటర్‌లోని బ్రహ్మప్రకాశ్ భవన్‌లో 'విద్యుత్ వ్యవస్థలు – విస్తరణ' అనే అంశంపై సోమవారం సెమినార్‌ను నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న వివేకానంద మాట్లాడుతూ రాబోయే నాలుగైదేళ్ల కాలంలో విద్యుత్ వినియోగం మరింతగా పెరిగే అవకాశముందన్నారు. విద్యుత్ వ్యవస్థలు చక్కగా పనిచేస్తేనే అవసరాలకు తగ్గ విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. విద్యుత్ డిమాండ్‌కు తగినట్లుగా సౌకర్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ఉత్పత్తి యూనిట్లలో సమస్యలను ఆయన వివరించారు. షార్ డైరెక్టర్, పద్మశ్రీ ఎంవైఎస్ ప్రసాద్ మాట్లాడుతూ నేడు ప్రతి వ్యవస్థ కూడా విద్యుత్‌తోనే అనుసంధానించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ వ్యవస్థలపై రూపొందించిన సావనీర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సదస్సులో షార్ శాస్త్రవేత్తలు వి.శేషగిరిరావు, జె.వి. రాజారెడ్డి, ఎస్.వి. సుబ్బారావు, ఇంకా 140మంది ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

# విజయవంతమైన తమన్ మ్యూజికల్ నైట్

## "నోటు లేని ఓటు నెల్లూరు జిల్లా"

నెల్లూరు దర్గామిట్టలోని పోలీస్ పేరెడ్ గ్రౌండ్‌లో గత నెల 27న ప్రముఖ సినీసంగీత దర్శకుడు తమన్ నేతృత్వంలో జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో "నోటు లేని ఓటు మన నెల్లూరుజిల్లా" అనే నినాదంతో మ్యూజికల్ నైట్ అద్భుతంగా జరిగింది. ఇప్పటిదాకా "ఓటు వినియోగం" అవగాహనపై ఇటువంటి కార్యక్రమం జరుగలేదేమో! తమన్ స్వరపరచిన "ఓటు" గీతం సభికులను అలరించింది. తమన్‌తో పాటు ప్రముఖ నేపథ్యగాయనీగాయకులు కృష్ణచైతన్య, శ్రీకృష్ణ, దీప్, బిందు, మాళవిక, గీతామాధురి, పరిణిత, శ్వేతరాజ్ పాడిన గీతాలకు జనాలు చప్పట్లతప్పెట్లు మోగించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీకాంత్ జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ ఎటువంటి ప్రలోభాలకు ప్రభావితం కాకుండా ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోవాలన్నారు. ముఖ్యంగా మహిళలు తమ ఓటు హక్కును నూరుశాతం వినియోగించుకుంటే మంచి ప్రభుత్వం ఏర్పడుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతంలోకంటే పట్టణ ప్రాంతంలో పోలింగ్ శాతం తక్కువగా వుంటోందని, ఈసారి అలా కాకుండా పట్టణాలలో ఓటర్లందరూ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ జి.రేఖారాణి మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలందరూ ఓటు విలువను గ్రహించి తప్పనిసరిగా తమ ఓటును వినియోగించుకోవాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి సహకారం అందించిన వారికి, తమ కోరికను మన్నించి మ్యూజికల్ నైట్ ఏర్పాటుచేసిన సంగీతదర్శకులు, నెల్లూరుజిల్లాకు చెందిన తమన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు రేంజి ఐజి సునీల్‌కుమార్, జిల్లా ఎస్పీ నవదీప్‌సింగ్ గ్రేవాల్, ట్రైనీ కలెక్టర్ వర్షిణి తదితరులు పాల్గొన్నారు.



# జిల్లాను సస్యశ్యామలం చేస్తా - నరేంద్రమోడీ

## నెల్లూరు చదువే నాకు స్ఫూర్తి - పవన్‌కళ్యాణ్





కేంద్రంలో బీజేపీకి సీమాంధ్రలో తెలుగుదేశానికి అధికారమిస్తే సీమాంధ్రను స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చడంతో పాటు నెల్లూరును సస్యశ్యామలం చేస్తానని భారతీయ జనతాపార్టీ ప్రధానమంత్రి అభ్యర్థి నరేంద్రమోడీ అన్నారు. గురువారం మధ్యాహ్నం సుమారు 1.30గంటల ప్రాంతంలో నెల్లూరు ఎ.సి.సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన "విజయశంఖారావం" సభలో మోడీ పాల్గొని ప్రసంగించారు. వెంకయ్యనాయుడు వంటి సమర్థత కలిగిన నాయకుడు వున్న నెల్లూరు జిల్లాకు తాను రెండవసారి వచ్చానని పేర్కొంటూ నెల్లూరుజిల్లా రైతాంగానికి నీటికొరతను తీర్చి జిల్లాను సస్యశ్యామలంగా మారుస్తానని హామీ ఇచ్చారు. యువతను చైతన్యపరచే పవన్ కళ్యాణ్‌వంటి యువ హీరో భారతదేశం కోసం నిస్వార్థంతో పనిచేయడానికి ముందుకి రావడం అభినందనీయమన్నారు. గత పదేళ్లుగా కేంద్రంలో తల్లీ కొడుకులు పరిపాలన సాగించారని, అదేవిధంగా రాష్ట్రంలో ఐదేళ్లు తండ్రీకొడుకులు రాజ్యమేలితే మరో ఐదేళ్లుగా ప్రభుత్వమే లేని స్థితి దాపురించిందని వ్యాఖ్యానించారు. అభివృద్ధి పాలన కావాలో, అవినీతిరాజ్యం కావాలో ప్రజలే తేల్చుకోవాలని ఆయన అన్నారు. మోడీ ప్రసంగాన్ని వెంకయ్యనాయుడు తెలుగులోకి అనువదించారు.

ఇదే సభలో పాల్గొన్న పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ తాను నెల్లూరు సెయింట్ జోసఫ్ స్కూలులో చదువుకున్నానని వి.ఆర్.కళాశాలలో ఇంటర్ చదివానని నెల్లూరులో తను చిన్ననాడు నేర్చుకున్న విద్య క్రమశిక్షణే ఈరోజు తనను దేశ సేవవైపు దృష్టి మారల్చేలా చేసిందని పేర్కొన్నాడు. వై.యస్.ఆర్.కాంగ్రెస్ హఠవో సీమాంధ్రకు బచావో అంటూ నినదించి కాశ్మీర్ టూ కన్యాకుమారి ఈ దేశాన్ని బాగుపరచే ఏకైక నాయకుడు నరేంద్రమోడీ ఒక్కరే అని కితాబునిచ్చాడు.

మోడీ బృందం రాకముందే జిల్లాకు చెందిన పలువురు తెలుగుదేశం బిజెపి నాయకులు తమ తమ ఉపన్యాసాలతో సభను ఎంటర్‌టైన్ చేశారు. జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బీద రవిచంద్ర తన సుదీర్ఘ ఆవేశోపన్యాసంలో పవన్‌కళ్యాణ్‌ను తలపిస్తూ సభను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. ఇదే సభలో ప్రసంగించిన చంద్రబాబునాయుడు మరోసారి కె.సి.ఆర్‌కు సవాల్ విసిరాడు. తన జోలికొస్తే సైకిల్ గేరు మార్చి స్పీడు పెంచి తుక్కు తుక్కు చేసేస్తానని కెసిఆర్‌ని హెచ్చరించాడు. బీజేపీతో కలసి పోటీచేస్తున్న తమ పార్టీ అభ్యర్థులను అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ గెలిపించి రాష్ట్రంలో అదే విధంగా కేంద్రంలో అభివృద్ధి మంత్రంగా పనిచేసే ప్రభుత్వాలను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. లక్షమందికి పైగా జనం పాల్గొన్న ఈ సభకి వెంకయ్య నాయుడు అధ్యక్షత వహించాడు. నరేంద్ర మోడీ సభ అనుకున్నదానికంటే ఎక్కువస్థాయిలో విజయవంతం కావడంతో అటు తెలుగుదేశం ఇటు బీజేపీపార్టీల్లో ఉత్సాహం పెరిగి ఆనందం నెలకొంది.

### శ్రీ షిరిడిసాయి, శ్రీ యోగాంజనేయ స్వామి వార్లకు

# బ్రహ్మాండంగా జరిగిన వార్షిక బ్రహ్మోత్సవాలు





ఇందుకూరుపేట మండలం కొత్తూరులో అధునాతన రీతిలో నిర్మించబడిన శ్రీ షిరిడిసాయిబాబా మరియు శ్రీ యోగాంజనేయ స్వామి వార్ల వార్షిక బ్రహ్మోత్సవాలు ఏప్రియల్ 21వతేదీ నుండి 25వతేదీ వరకూ వైభవోపేతంగా జరిగాయి.

శ్రీమతి కలికి శ్రీలత, శ్రీ కలికి కోదండరామిరెడ్డిలు ఉభయకర్తలుగా శ్రీ షిర్డిసాయిబాబా మందిరం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ ఆలయాలు నిర్మించిన అనంతరం తొలిసారిగా జరిగిన ఈ వార్షిక బ్రహ్మోత్సవాలలో జిల్లా నలుమూలల నుండి భక్తులు వేలాదిగా పాల్గొని తరించారు. ముఖ్యంగా వినూత్నరీతిలో రాష్ట్రంలోనే ఎక్కడాలేని విధంగా నిర్మించిన శ్రీ యోగాంజనేయ దేవాలయం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

21వతేదీ నుండి 22తేదీ వరకూ రెండు రోజుల పాటు షిరిడిసాయి బ్రహ్మోత్సవాలను నిర్వహించి 23, 24, 25వతేదీలలో శ్రీ యోగాంజనేయ స్వామికి పలుసేవల ద్వారా వార్షిక బ్రహ్మోత్సవ తంతును నిర్వహించారు. మొత్తం ఈ 5రోజుల కార్యక్రమానికి కొత్తూరు గ్రామం మొత్తం తరలివచ్చి ఒక పండుగలా ఈ బ్రహ్మోత్సవ వేడుకలను జరుపుకున్నారు. 5 రోజుల పాటు జరిగిన అన్నదాన కార్యక్రమంలో సైతం ఎక్కువ సంఖ్యలో ప్రజలు పాల్గొని తీర్థప్రసాదాలతో పాటు భోజనాన్ని స్వీకరించారు.



తొలి వార్షిక బ్రహ్మోత్సవాలుగా ఈ యేడాది నిర్వహించామని ఇక ప్రతి యేడాది ఈ వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తామని కోదండ రామిరెడ్డి దంపతులు తెలిపారు. 5 రోజుల పాటు జరిగిన అన్ని పూజా కార్యక్రమాలలో ఈ దంపతులు పాల్గొని వచ్చిన భక్తులందరిని ఆప్యాయంగా పలకరించడం గమనార్హం.

రెండు అద్భుత నిర్మాణాలను సింహపురి ఆధ్యాత్మిక రంగానికి అందించడంతో పాటు ప్రతియేటా ఇలా వార్షిక బ్రహ్మోత్సవాలను చేయాలని సంకల్పించడం శుభదాయకం. కోదండరామిరెడ్డి, శ్రీలత దంపతులు పుణ్యజీవులే కాదు ధన్యజీవులు కూడా, వారికి "లాయర్" అభినందనలు.

# ఇక తేల్చాల్సింది ఓటర్స్

(మొదటిపేజీ తరువాయి)

నెల్లూరుజిల్లాలో ఎన్నికల వాతావరణం కోలాహలంగా ఉంది. అన్ని పార్టీలు ప్రచారంలో మోతెక్కించాయి. మేనిఫెస్టోలతో ఊదరగొట్టాయి. ఇక ఎన్నికలన్నాక నాయకులు అటుకులు చిటుకులు మారినట్టుగా పార్టీలను మార్చడం సహజమే. ఈ ఎన్నికల్లో పార్టీలు మార్చే నాయకులు ఎక్కువయ్యారు. నామినేషన్లలను మొదలుకొని పోలింగ్ వరకు అభ్యర్థులు ప్రచారాన్ని ఉధృతంగా నిర్వహించారు.

జిల్లాలో నెల్లూరు, తిరుపతి లోక్‌సభ, 10అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికలు అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగనున్నాయి. అభ్యర్థుల ఎంపికలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఒకే సిటింగ్‌లో అభ్యర్థులను ప్రకటించి ఆ దిశలో కొంత విజయం సాధించగా, అభ్యర్థుల ఎంపికలో తెలుగుదేశం మాత్రం కొంత తడబడింది. సూళ్లూరు పేట, గూడూరు, నెల్లూరురూరల్, ఆత్మకూరు నియోజకవర్గాలలో తెలుగుదేశం అభ్యర్థుల ఎంపికపై పొరపాటు చేసిందని, దీనికి భారీమూల్యం చెల్లించుకోక తప్పదనే ప్రచారం జరుగుతుంది. ఇక కాంగ్రెస్‌పార్టీ నుండి పోటీ చేసే దానికి ఈ ఎన్నికల్లో అభ్యర్థులే కరువయ్యారు. ఆత్మకూరు నుండి ఆనం రామనారాయణరెడ్డి, గూడూరు నుండి పనబాక కృష్ణయ్యలు మాత్రమే పాతవాళ్లు. మిగతా 8స్థానాలలో కొత్త అభ్యర్థులనే ఎంపిక చేయాల్సి వచ్చింది.

నెల్లూరు లోక్‌సభ నుండి మేకపాటి రాజమోహన్‌రెడ్డి(వైకాపా), ఆదాల ప్రభాకర్‌రెడ్డి(తెదేపా), వాకాటి నారాయణరెడ్డి(కాంగ్రెస్)లు రంగంలో వున్నారు. తిరుపతి లోక్‌సభ నుండి వి.వరప్రసాద్(వైకాపా), కారుమంచి జయరాం(బీజేపీ), చింతా మోహన్(కాంగ్రెస్)లు బరిలో వున్నారు.

ఇక అసెంబ్లీ వారీగా చూస్తే ఉదయగిరిలో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి(వైకాపా), బొల్లినేని రామారావు(తెలుగు దేశం), పి.చెంచలబాబుయాదవ్(కాంగ్రెస్), కావలి నుండి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి(వైకాపా), బీద మస్తాన్‌రావు(తెలుగుదేశం), చింతాల వెంకట్రావ్(కాంగ్రెస్), కోవూరు నుండి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి(వైకాపా), పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి(తెదేపా), వెంకటరమణ(కాంగ్రెస్), ఆత్మకూరు నుండి మేకపాటి గౌతంరెడ్డి(వైకాపా), గూటూరు కన్నబాబు(తెదేపా), ఆనం రామనారాయణరెడ్డి(కాంగ్రెస్), నెల్లూరు నగరం నుండి పి.అనిల్‌కుమార్ యాదవ్(వైకాపా), ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి(తెదేపా), ఏ.సి.సుబ్బారెడ్డి(కాంగ్రెస్), నెల్లూరు గ్రామీణంలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి(వైకాపా), సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి(బీజేపీ), ఆనం విజయకుమార్‌రెడ్డి(కాంగ్రెస్), సర్వేపల్లిలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి(వైకాపా), సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి(తెదేపా), డాక్టర్ పట్టాభిరామయ్య(కాంగ్రెస్), గూడూరు నుండి పాశం సునీల్‌కుమార్(వైకాపా), డాక్టర్ బి.రాధాజ్యోత్స్నలత(తెదేపా), పనబాక కృష్ణయ్య (కాంగ్రెస్), సూళ్లూరుపేట నుండి కిలివేటి సంజీవయ్య(వైకాపా), పరసారత్నం(తెదేపా), డి.మధుసూదన్‌రావు (కాంగ్రెస్), వెంకటగిరి నుండి కొమ్మి లక్ష్మయ్యనాయుడు(వైకాపా), కురుగొండ్ల రామకృష్ణ(తెదేపా), నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి(కాంగ్రెస్)లు ప్రధాన పోటీదారులుగా ఉన్నారు. జైసమైక్యాంధ్ర పార్టీ సీపీఎంతో పొత్తు కుదుర్చుకుని నెల్లూరు లోక్‌సభ మిగిలిన అన్ని అసెంబ్లీలో పోటీ చేస్తుంది. నెల్లూరు నగరంలో ఆనం జయకుమార్‌రెడ్డి(జైసపా), నెల్లూరురూరల్‌లో మాదాల వెంకటేశ్వర్లు(సీపీఎం)లు ఒక మోస్తరుగా ఓట్లు చీల్చే అవకాశముంది. రాష్ట్ర విభజన ప్రభావం కాంగ్రెస్‌పార్టీపై తీవ్రంగా వుంది. నెల్లూరు లోక్‌సభ సహా ఏ అసెంబ్లీలోనూ ఆ పార్టీ అభ్యర్థులు గెలిచే పరిస్థితి కానరావడం లేదు. ఆత్మకూరు, గూడూరు, వెంకటగిరి, నెల్లూరు నగరం, నెల్లూరురూరల్‌లో మాత్రమే కొంతవరకు పోటీలో వున్నారు. అయితే ఇక్కడా గెలుపు అవకాశాలు లేవు.

జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ జోష్ కనిపిస్తుంది. ఆరు లేదా ఏడు వరకు అసెంబ్లీలు ఆ పార్టీ ఖాతాలో జమపడే అవకాశముంది. తెలుగుదేశంపార్టీ అభ్యర్థుల ఎంపిక, బీజేపీతో సీట్ల సర్దుబాటులో చేసిన సంస్థాగత తప్పిదాల వల్ల కనీసం రెండు సీట్లయినా వైయస్సార్ కాంగ్రెస్‌కు అదనంగా ఇచ్చే పరిస్థితి ఏర్పడింది. సర్వేపల్లి, నెల్లూరురూరల్, ఆత్మకూరు, సూళ్లూరుపేటలలో వైకాపాకు గెలుపు స్పష్టంగా వుంది. గూడూరు, వెంకటగిరిలలో కొంత పోటీ వుంది. నెల్లూరునగరం, కోవూరు, కావలి, ఉదయగిరిలలో మాత్రం తెలుగుదేశం అభ్యర్థుల నుండి వైకాపాకు గట్టిపోటీ ఎదురవుతుంది. అయితే వైకాపా అభ్యర్థులకు ప్రధాన బలమంతా జగన్ గాలే! వై.యస్. సానుభూతి పవనాలు, జగన్ హవా మీదనే వీళ్ల గెలుపోటములు ఆధారపడి వున్నాయి. ఇక కాంగ్రెస్‌లో నలుగురు సమర్థులైన అభ్యర్థులున్నా, సొంతంగా ఓటుబ్యాంకు వున్నా కాంగ్రెస్ చేసిన తప్పుడు విభజన పనికి వీళ్లు బలవుతున్నారు. టీడీపీలో లోక్‌సభ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డితో పాటు నాయకత్వ పరంగా తెలుగుదేశం అభ్యర్థులు ఓ ఆరుమంది దాకా సమర్థులైన నాయకులున్నారు. పార్టీ ఓటుతో పాటు సొంతశక్తితో వాళ్లు గట్టి పోటీ ఇస్తున్నారు. మొత్తానికి ఫైటర్స్‌గా అభ్యర్థులు తమ ప్రచారం పూర్తి చేసే దశకు వచ్చారు. ఇక తదుపరి మేటర్ వుండేది ఓటర్ చేతిలోనే!

# ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)

మెగాస్టార్ చిరంజీవి రాజ్యసభసభ్యుడు, కేంద్రమంత్రి కాగలిగారు. చిరంజీవి ప్రజారాజ్యంపార్టీ ద్వారా 2009 ఎన్నికల్లోనన్నా పోటీ చేసాడు. కాని పవన్ కల్యాణ్ జనసేన పార్టీ అసలు ఎన్నికల్లో పోటీ చేయడమే లేదు. ఈ ఎన్నికలకు కొద్దిరోజుల క్రితమే ఆయన జనసేన పార్టీని స్థాపించారు. వెంటనే నరేంద్రమోడీని కలిసారు. బీజేపీకి మద్దతు ప్రకటించారు. ఆ తర్వాత చంద్రబాబు బ్రతిమలాడడంతో తెలుగుదేశంకు కూడా తన మద్దతు ఉందన్నాడు. నరేంద్ర మోడీతో కలిసి తెలంగాణ, సీమాంధ్రలలో ఎన్నికల ప్రచార సభలలో పాల్గొన్నారు. పవన్ ఇంత చేయడం వెనుక కారణం రేపు కేంద్రంలో ఎన్డీఏ అధికారంలోకి వస్తే ఆయనకు రాజ్యసభసీటు దక్కే అవకాశముంది. కేంద్రమంత్రిగా కూడా ఛాన్సుంది. యూపిఏలో మెగాస్టార్, ఎన్డీఏలో పవర్‌స్టార్... ఇద్దరూ లక్కీ స్టార్‌లే!

# అవసరం లేదు

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుంటారు. ఈ ఎన్నికల్లో మాత్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విభిన్న పరిస్థితి నెలకొంది. సోనియా, రాహుల్‌లు తమ ప్రాంతానికి ప్రచారానికి రాకుంటే బాగుంటుందని కాంగ్రెస్ అభ్యర్థులే కోరుకుంటున్నారు. వాళ్లొచ్చి ప్రచారం చేస్తే పడే ఓట్లు కూడా పోతాయని వీరి భయం. ముఖ్యంగా సోనియాగాంధీని చూస్తే సీమాంధ్రలోని జనం మూడ్ మారే అవకాశముంది. కాంగ్రెస్ అభ్యర్థికి నాలుగువేల ఓట్లన్నా వస్తాయనుకునే దగ్గర ఆమెను చూస్తే కనీసం రెండువేల ఓట్లు కన్నా కోత పడుతుంది. దీనికి కారణం రాష్ట్ర విభజనే! ఓట్ల కక్కుర్తితో ఉన్నదంతా తెలంగాణకు దోచిపెట్టి సీమాంధ్రులకు గోచీ గుడ్డ మిగిల్చింది. సోనియాగాంధీకి ఆ ఉసురు ఊరికే పోతుందా? తెలంగాణవాళ్ల పాలిట దేవతయిన సోనియా సీమాంధ్రులకు ఎప్పటికీ దెయ్యమే!

# చంద్రబాబు

(మొదటిపేజీ తరువాయి)

సీట్లు తగ్గితే జగన్ అవసరం రావచ్చు. ఇక్కడ సీట్లు లేక చంద్రబాబు అక్కరకు రాకపోవచ్చు. ఆరోజు జగన్ కావాలంటే ఇలాంటి మాటలు అడ్డంకిగా మారొచ్చు. చంద్రబాబునే నమ్ముకుని మోడీ వ్యక్తిగత విమర్శలకు పాల్పడితే నిండా మునిగే అవకాశం వుంది.

ADMISSIONS - 2014
B.E/ B.Tech
(All Branches)
Chennai Top Colleges
Konda Reddy
098416 05100 (TN)

# గూడూరు డివిజన్ వార్తలు

## రాష్ట్ర అభివృద్ధి జగన్‌తోనే సాధ్యం

**పాశం సునీల్‌కుమార్**



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పాశం సునీల్‌కుమార్

రాష్ట్ర అభివృద్ధి వైఎస్ జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించాలని కోరుతూ ఆదివారం ముస్లింల ఆధ్వర్యంలో పట్టణంలోని హజరత్ సయ్యద్ అసీమ్‌హుస్సేనీ దర్గాలో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దివంగత మహానేత వైఎస్సార్ హయాంలో రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందిందన్నారు. పేదల సంక్షేమం కోసం ప్రవేశ పెట్టిన పథకాలతో ప్రతి ఒక్కరూ లబ్ధిపొందారని, ఆయన మరణానంతరం కాంగ్రెస్‌పార్టీ ఆ పథకాలను తుంగలో తొక్కి వైఎస్ కుటుంబాన్ని కష్టాల పాలుచేసిందన్నారు. ఆ పథకాలు తిరిగి అమలు కావాలంటే జగన్మోహన్‌రెడ్డి ముఖ్య మంత్రి కావాలన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు వాటంబేటి శివకుమార్, అనీస్ అహ్మద్, మొహిద్దీన్, నరేంద్ర, మధు, పెంచలయ్య, రహంతుల్లా, సలీం, రామాక్షయ్య, కోటి, బొమ్మిడి శ్రీనివా సులు తదితరులు పాల్గొన్నారు.

కాగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి పట్టణంలోని 5,6,9 వార్డుల్లో ఇంటింట ప్రచారం నిర్వహించారు.

## ప్రధాన మంత్రి అభ్యర్థి ఎవరో చెప్పలేని కాంగ్రెస్

**— భాజపా నేత వెంకయ్యనాయుడు —**



సభలో ప్రసంగిస్తున్న వెంకయ్యనాయుడు

తమ ప్రధానమంత్రి అభ్యర్థి ఎవరో చెప్పలేని స్థితిలో ఉన్న కాంగ్రెస్‌కు ఏమని ఓటేయాలని భారతీయ జనతాపార్టీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు వెంకయ్య నాయుడు అన్నారు. గూడూరు టవర్‌క్లాక్ సెంటర్ వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి పేరే చెప్పలేని పార్టీలు ఓట్లు అడుగుతున్నాయని, కానీ భాజపా ధైర్యంగా మోడీని ఎంచుకొని ఎన్నికల్లో ముందుకెళ్తోందని వెంకయ్యనాయుడు అన్నారు. నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్నాయని సామాన్యుడు బతకలేని పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల వచ్చిందన్నారు. రైతు ఆత్మహత్యలూ పెరిగాయన్నారు. వేర్పాటువాదులు, ఉగ్రవాదులు దాడులు చేస్తున్నారన్నారు. గుజరాత్ తరహా అభివృద్ధిని ఆంధ్రప్రదేశ్‌లో సాధ్యం చేసే సత్తా తమ పార్టీకి ఉందన్నారు. పార్లమెంటులో 33శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును వచ్చే ఎన్‌డీఏ ప్రభుత్వం ఆమోదిస్తుందని వెంకయ్యనాయుడు భరోసా ఇచ్చారు. గతంలో చెన్నైకి వెళ్లాలంటే నెల్లూరు నుంచి ఐదు గంటల సమయం పట్టేదని నేడు రెండున్నర గంటల్లో చేరుకుంటున్నామంటే అది ఎన్డీఏ చేపట్టిన జాతీయ రహదారి అభివృద్ధి చలవేనన్నారు. రాష్ట్ర విభజన ఇంకా జరగలేదని సమైక్యాంధ్ర పార్టీ చెబుతుండడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పుడు ఆలోచించాల్సింది హైదరాబాద్ స్థాయి రాజధాని స్థాపన గురించేనన్నారు. ఐఐటీ, ఐఐఐటీ, కేంద్ర విశ్వవిద్యాలయాలు, ఎయిర్‌పోర్టులు, పోర్టులు అన్ని సౌకర్యాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయగల సమర్థత భారతీయ జనతాపార్టీకే ఉందన్నారు.

## టీడీపీ పార్టీ గెలుపు బాధ్యత బల్లిదే

**ఏకమైన రెండు వర్గాలు**



మాట్లాడుతున్న బల్లి దుర్గాప్రసాదరావు, ప్రక్కన కంభంపాటి రామ్మోహన్‌రావు, ఎమ్మెల్యే అభ్యర్థి రాధాజ్యోత్సలత

గత వారంరోజులు పాటు గూడూరు తెలుగుదేశంపార్టీలో కొనసాగుతున్న ఉత్కంఠకు ఆదివారంతో తెరపడింది. అంతా ఊహించనట్లుగానే అధిష్టానం బుజ్జగింపులతో ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌రావు మెత్తపడ్డారు. నిన్నటివరకు గూడూరు నియోజకవర్గ తెలుగుదేశంపార్టీలో రెండు వర్గాలుగా కొనసాగుతున్న వారంతా ఒక్కటయ్యారు. తెలుగుదేశంపార్టీ అభ్యర్థి విజయానికి సమిష్టిగా సహకరిస్తామని ప్రకటించారు. ఆదివారం సాయంత్రం గూడూరు స్వర్ణభారత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో దుర్గాప్రసాద్‌రావుతో పార్టీ జిల్లా పరిశీలకులు కంభంపాటి రామమోహన్‌రావు, పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్‌రావు తెలుగుదేశంపార్టీ అభ్యర్థిని బత్తుల రాధాజ్యోత్సలత సమావేశమయ్యారు. అనంతరం కార్యకర్తలతో కలిసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేతలు కోడూరు శ్రీనివాసులురెడ్డి, శీలం కిరణ్‌కుమార్, పొనకా శివకుమార్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, మధురెడ్డి, ఉడ్‌కాంట్రాక్టర్ నానాజీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంభంపాటి రామ్మోహనరావు మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిని రాధాజ్యోత్సలతను గెలిపించాల్సిన బాధ్యత బల్లిపైనే ఉందన్నారు. మహిళలకు ఎక్కడైనా అవకాశం ఇవ్వాలన్న ఉద్ధేశ్యంతో ఆయన వ్యక్తిగత మనిషిగా దుర్గాప్రసాదరావును పక్కన పెట్టి, జ్యోత్స్నలతకు టికెట్టు ఇచ్చారే తప్ప ఆయన్ను పార్టీ దూరం చేసుకోదని స్పష్టంచేశారు.


నేటి జూ॥ ఇంటర్ మార్కులతో...
రేపటి మెడికల్ ర్యాంకులకు సింహద్వారంగా మారిన

నారాయణ శ్రీచైతన్య

BiPC 1 Always No.1 | MEC 1 Always No.1

జూనియర్ ఇంటర్ - 2014 ఫలితాలు

జాతీయస్థాయిలో మన తెలుగు తేజాలను ఏ పోటీపరీక్షలోనైనా, తిరుగులేని విజేతలుగా తీర్చిదిద్దాలంటే ఒక ప్రతిష్టాత్మక వేదిక అవసరం. ఆ అవసరాన్ని గుర్తించిన శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థల సంయుక్త 'క్వాలిటీ టీచింగ్, క్వాలిటీ మెటీరియల్, క్వాలిటీ ఎగ్జామ్స్ ద్వారా మొదటి ఫలితాలలోనే JEE-MAIN, JEE-ADVANCED, మరియు జాతీయ స్థాయి MEDICAL పోటీ పరీక్షలలో క్వాలిటీ & క్వాంటిటీ ర్యాంకులు సాధించి రాష్ట్రాన్ని నెం.1 గా నిలిపి తమదైన ముద్రవేసి రాష్ట్ర విద్యార్థుల ఉజ్వల భవితకు ఎదురులేదని నిరూపించారు.

BiPC

436/440 T.V. Adarsh | 436/440 V. Akshaya | 436/440 K.S. Bharghavi
436/440 R.V. Anusha | 436/440 K. Likhitha | 436/440 K. Sri Sravani
434/440 S. Pavan Sagar | 434/440 P. Sai Teja
434/440 K. Yashitha | 434/440 A.L. Mounika | 434/440 S. Pratyusha | 434/440 P. Dheeraj Kumar | 434/440 M. Jagadeeswar | 434/440 P. Sriram Kumar | 434/440 P. Bhavya
434/440 P. Naveen Kumar | 434/440 G. Amruth Sagar | 434/440 B. Bharath | 434/440 C.V. Bharath | 434/440 G. Kishore Kumar | 434/440 D. Prasanna | 434/440 C.V. Balaji

MEC

491/500 Appalabattula Sreevidhya | 490/500 Todet Pujitha
486/500 Mega Naresh Kumar | 486/500 Ravikanti Sahithi | 486/500 Yedla Priyavadana | 486/500 Sunuka Ankush

జూనియర్ ఇంటర్ ఫలితాలలో ఏ కోణంలో విశ్లేషించినా అగ్రస్థానం నెం.1 నారాయణ శ్రీచైతన్య దే

| మార్కులు | నారాయణ.శ్రీచైతన్య విద్యార్థుల సంఖ్య | AP లోని మొత్తం విద్యార్థుల సంఖ్య | నారాయణ.శ్రీచైతన్య విద్యార్థుల శాతం |
|---|---|---|---|
| 436 ఆ పైన | 6 | 7 | 85.7 % |
| 435 ఆ పైన | 34 | 39 | 87.1 % |
| 434 ఆ పైన | 128 | 142 | 90.1 % |
| 433 ఆ పైన | 257 | 295 | 87.1 % |
| 430 ఆ పైన | 975 | 1148 | 84.9 % |

సబ్జెక్టుల వారీగా 100% మార్కుల విశ్లేషణ

| సబ్జెక్టులు | మార్కులు | నారాయణ.శ్రీచైతన్య విద్యార్థుల సంఖ్య | AP లోని మొత్తం విద్యార్థుల సంఖ్య | నారాయణ.శ్రీచైతన్య విద్యార్థుల శాతం |
|---|---|---|---|---|
| బోటనీ | 60/60 | 5548 | 6965 | 79.6% |
| జువాలజీ | 60/60 | 6267 | 8611 | 72.7% |
| ఫిజిక్స్ | 60/60 | 32,825 | 49,209 | 66.7% |
| కెమిస్ట్రీ | 60/60 | 6,620 | 10073 | 65.7% |

| గ్రూపు మార్కులు 270 | నారాయణ.శ్రీచైతన్య విద్యార్థుల సంఖ్య | AP లోని మొత్తం విద్యార్థుల సంఖ్య | నారాయణ.శ్రీచైతన్య విద్యార్థుల శాతం |
|---|---|---|---|
| 240 | 512 | 552 | 92.7% |
| 239 ఆ పైన | 899 | 1001 | 89.8% |
| 238 ఆ పైన | 1540 | 1775 | 86.7% |
| 237 ఆ పైన | 2163 | 2503 | 86.4% |
| 236 ఆ పైన | 2861 | 3334 | 85.8% |
| 235 ఆ పైన | 3522 | 4128 | 85.3% |

శ్రీ శార్వాణి ఎడ్యుకేషనల్ సొసైటీ వారి సౌజన్యంతో...

నారాయణ శ్రీచైతన్య విద్యాసంస్థలు

# మైనార్టీలకు అండగా నిలిచింది కాంగ్రెస్సే



అజారుద్దీన్‌ను సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

దేశవ్యాప్తంగా మొదటి నుండి మైనార్టీల హక్కులను కాపాడుతూ వారికి అండగా నిలుస్తూవచ్చింది కాంగ్రెస్‌పార్టీ యేనని మాజీక్రికెటర్, ఎంపీ అజారుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో మైనార్టీ సదస్సు జరిగింది. ఈ సదస్సులో పాల్గొన్న అజారుద్దీన్ మాట్లాడుతూ ముస్లింలకు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అన్ని అవకాశాలు కల్పించింది కాంగ్రెస్‌పార్టీయే నన్నారు. కాంగ్రెస్‌పార్టీ అనేదే లేకపోతే మతతత్వ పార్టీలు అధికారంలోకి వచ్చి మైనార్టీల హక్కులను కాలరాసేవని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ కాకుండా ఇక ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ముస్లింలు అన్ని రంగాలలో వెనుకబడిపోతారన్నారు. ఆయా పార్టీల నాయకులు పీఎంలు, సీఎంలు కావాలని కలలు కంటున్నారని, అలాంటి స్వార్థపరులు అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ సదస్సులో ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి, లోక్‌సభ అభ్యర్థి వాకాటి నారాయణరెడ్డి, నెల్లూరునగర, రూరల్ అభ్యర్థులు ఏ.సి సుబ్బారెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షులు కొడవలూరు ధనుంజయరెడ్డి, నగర అధ్యక్షులు చాట్ల నరసింహారావు, ముస్లిం నాయకులు అబూబకర్, మౌలానాజలాల్, అహ్మద్ బాషా, సమి, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

# వైకాపాలో చేరిన ఆర్ఎస్ఆర్



నెల్లూరు కొండాయపాలెంరోడ్డు వనంతోపు ప్రాంతంలో గట్టిపట్టున్న కాంగ్రెస్ నాయకుడు ఆర్. శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో సహా బుధవారం దాదాపు వెయ్యిమంది అనుచరులతో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరారు. దర్గామిట్టలోని ఎంపీ అభ్యర్థి మేకపాటి రాజమోహన్‌రెడ్డి కార్యాలయంలో ఆయన సమక్షంలో ఆర్ఎస్ఆర్ వైకాపా తీర్థం తీసుకున్నారు. వనంతోపులోని ఆర్ఎస్ఆర్ ఇంటి నుండి దర్గామిట్టలోని మేకపాటి కార్యాలయం వరకు 300బైక్‌లు, పెద్దసంఖ్యలో కార్లు, ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైకాపా జిల్లా అధ్యక్షుడు మేరిగమురళీధర్, మేయర్ అభ్యర్థి అబ్దుల్ అజీజ్, 20వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి బత్తిన శోభన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బాంబు బ్లాస్ట్

గురువారం ఉదయం కార్మికుల దినోత్సవం రోజున చెన్నైలోని సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో గౌహతీ ఎక్స్‌ప్రెస్‌లో బాంబుపేలుళ్లు సంభవించాయి. రెండు భోగీల్లో సంభవించిన పేలుళ్లతో ఒకరు మృతి చెందగా, 9మంది గాయపడ్డారు. ఉదయం 7గంటల 20 నిమిషాల ప్రాంతంలో ఈ పేలుళ్లు సంభవించాయి. అలాగే నెల్లూరులోనూ, విజయవాడలోను అనుమానాస్పద సూట్‌కేసులు లభించాయి. భద్రతాదళాలన్నీ ఎన్నికలపై దృష్టిపెట్టాయి. ఎన్నికల నిర్వహణ కోసం భద్రతాదళాలను తరలిస్తున్నారు. దీనిని అనువుగా తీసుకునే తీవ్రవాదులు బాంబుపేలుళ్లకు తెగబడ్డట్లు తెలుస్తుంది. చెన్నై బాంబు పేలుళ్లతో దేశవ్యాప్తంగా అన్ని రైల్వేస్టేషన్లను అప్రమత్తం చేసారు.









స్వర్గీయ శ్రీమతి రావూరు కౌసల్యమ్మ

కీ॥శే॥ శ్రీ రావూరు సుబ్బారెడ్డి గారి ధర్మపత్ని(రావూరువారి ఖండ్రిగ)

జననం: 13.04.1932 మరణం: 27.04.2014

## ఉత్తరక్రియలు

ఆప్యాయతానురాగాలు పంచిన అమృతమూర్తి

మా ఇంటి ఆరాధ్య దైవం, మా తల్లిగారైన

## శ్రీమతి రావూరు కౌసల్యమ్మ

కీ॥శే॥ శ్రీ రావూరు సుబ్బారెడ్డి గారి ధర్మపత్ని

తేది. 27.04.2014న జూబ్లీహిల్స్, హైదరాబాదు నందు స్వర్గస్తులైనారు.

వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ..

శోకతప్త హృదయాలతో

| కుమార్తెలు | అల్లుళ్ళు |
|---|---|
| గంగపట్నం దేవకి | రాధాకృష్ణారెడ్డి |
| కనుపూరు నర్మద | కీ॥శే॥ కృష్ణారెడ్డి |
| సిద్దారెడ్డి జ్యోతి | కీ॥శే॥ లక్ష్మీనారాయణరెడ్డి |
| ఆదాల అరుణ | రాఘవరెడ్డి |
| ఆదాల వింధ్యావళి | ప్రభాకర్‌రెడ్డి |
| శీరపు జమున | సూర్యనారాయణరెడ్డి |
| కొండ్లపూడి అనిత | సుధాకరరెడ్డి |

మనుమలు - మనుమరాండ్రు

మునిమనుమలు - మునిమనుమరాండ్రు

మరియు కుటుంబసభ్యులు

ఉత్తరక్రియలు: తేది. 11-05-2014 ఆదివారం ఉదయం 11.00గంటలకు

కార్యస్థలం : హోటల్ కత్రియ, రాజభవన్‌రోడ్డు, సోమాజిగూడ, హైదరాబాదు.

కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది. ఫోన్: 9849400501, 98490 33059

Edited, Published, Printed & owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY.